

పశ్చిమానికి దన్నుగా..

దశాబ్దాలుగా వెనుకబాటుతనానికి, వలసలకు కేరాఫ్ అడ్రస్‌గా నిలిచిన ప్రాంతమది. సాగునీరు అటుంచితే వర్షాకాలం లోనూ తాగునీటికి ఇక్కట్లు పడటం అక్కడ సర్వసాధారణం. చిన్నపాటి జబ్బు చేసినా సుదూర ప్రాంతాలకు పరుగులు తీయాల్సిందే. ఇలాంటి పరిస్థితుల నుంచి ఆ ప్రాంత ప్రజలకు విముక్తి కలిగించేలా చర్యలు మొదలయ్యాయి. జిల్లాలోని పశ్చిమప్రాంత అభివృద్ధిపై కూటమి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. శాశ్వత అభివృద్ధి, ఉపాధి కల్పన, మౌలిక సౌకర్యాల మెరుగుదల వైపు వేగంగా అడుగులు వేస్తోంది. పలు కీలక అంశాలపై ముఖ్యమంత్రి చంద్రబాబు ఆప్రాంత ప్రజాప్రతినిధు లకు, వారి ద్వారా ప్రజలకు భరోసా ఇవ్వడంతోపాటు వాటి సాకారం దిశగా పనులు చేపడుతున్నారు. వెలిగొండ ప్రాజెక్టు పూర్తి, మార్కాపురం జిల్లా ఏర్పాటు, మెడికల్ కాలేజీ నిర్మాణం, తాగునీటి సౌకర్యం, పారిశ్రామికాభివృద్ధి ఆ ప్రాంతానికి ప్రధాన మైనవి. తాజాగా వాటికి సంబంధించి ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలు భవిష్యత్‌పై నమ్మకాన్ని పెంచుతున్నాయి.

త్వరలో మార్కాపురం జిల్లా ఏర్పాటు

- వచ్చే ఆగస్టుకు వెలిగొండ తొలిదశ పూర్తి
- మెడికల్ కాలేజీకి పీపీపీ విధానంలో టెండర్లు
- దొనకొండ వద్ద ఏరోస్పేస్ పరిశ్రమ
- కేంద్రం జాబితాలో ఒంగోలు-దొనకొండ రైల్వే లైన్
- ఇప్పటికే పీసీపల్లి వద్ద సీబీజీ ప్లాంట్‌కు శంకుస్థాపన
- మరికొన్నింటి ఏర్పాటుకు వేగవంతంగా చర్యలు

ఒంగోలు, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : గత ఎన్నికల సమ యంలోనూ, అనంతరం పలు సందర్భాల్లో పార్టీ అధినేతగా, ముఖ్య మంత్రిగా చంద్రబాబునాయుడు వెలిగొండ ప్రాజెక్టు, మార్కాపురం జిల్లాపై విస్పష్ట ప్రకటనలు చేశారు. ప్రస్తుతం ఆ హామీలకు అనుగుణంగా పనులు జరుగుతున్నాయి. మార్కాపురం కేంద్రంగా పశ్చిమప్రాంతంలోని మార్కాపురం, గిద్దలూరు, వైపాలెం, కనిగిరి, దర్శి నియోజకవర్గాలతో కలిపి జిల్లా ఏర్పాటు దిశగా కసరత్తు నడుస్తోంది. ఇందులో దర్శి నియోజకవర్గంలో ఒంగోలుకు అందు బాటులో ఉండే ముండ్లమూరు, తాళ్లూరు మండలాలు మినహా ఇతర ఏప్రాంతాల నుంచి పెద్దగా అభ్యంతరాలు లేవు. దీంతో త్వరితగతిన మార్కాపురం జిల్లా ఏర్పాటయ్యే అవకాశాలు మెం డుగా ఉన్నాయి. మరో కీలకమైన వెలిగొండ ప్రాజెక్టు విషయంలో

మిగతా 8వ పేజీలో


వెలిగొండ ప్రాజెక్టు మొదటి సొరంగం


పనులు పునఃప్రారంభం కానున్న మార్కాపురం మెడికల్ కాలేజీ

మరో కీలకమైన మార్కాపురం మెడికల్ కాలేజీ విషయంపైనా ప్రభుత్వం ఫోకస్ పెట్టింది. ఇటీవల జరిగిన మంత్రివర్గ సమావేశం

తొలి జాబితాలో మెడికల్ కాలేజీ

రాష్ట్రంలో 17 మెడికల్ కాలేజీలను పీపీపీ విధానంలో పూర్తి చేసేందుకు ఆమోదించింది. తొలి జాబితాలో మార్కాపురం కాలేజీని ప్రభుత్వం చేర్చింది. వచ్చే ఏడాదికి అడ్మిషన్లు లక్ష్యంగా ప్రకటించింది. వారం క్రితం పీపీపీ విధానంలో కాలేజీ పనులకు టెండర్లు కూడా పిలిచారు. వైసీపీ ప్రభుత్వ కాలంలో 2022లో మెడికల్ కళాశాల పనులను రూ.475కోట్లతో చేపట్టి 2024 నాటికి అడ్మిషన్ల గడువు పెట్టింది. అయితే ఆ ప్రభుత్వం దిగిపోయే నాటికి 20శాతం పనులు కూడా పూర్తికాలేదు. దీంతో ప్రస్తుత ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది.



చంద్రఘంటాదేవీ నమోస్తుతే..



శరన్నవరాత్రులు వైభవంగా జరుగుతున్నాయి. ఆలయాలు దేవీ నామస్మరణతో మార్మోగుతు న్నాయి. ఉత్సవాల్లో మూడోరోజైన బుధవారం వివిధ ఆలయా ల్లోని అమ్మవార్లకు ప్రత్యేక అలం కారాలు చేశారు. ఒంగోలు మంగమూరు రోడ్డు అచలా నంద ఆశ్రమంలోని గోవింద మాంబ అన్నపూర్ణాదేవిగా దర్శ నమిచ్చారు. అక్కడ 108 పిండి వంటలతో నైవేద్యం సమర్పిం చారు. త్రిపురాంతకంలోని బాలా త్రిపురసుందరీదేవి చంద్ర ఘంటాదేవిగా వ్యాఘ్రవాహ నంపై దర్శనమిచ్చారు. భక్తులు భారీగా హాజరై దర్శించుకొని పూజలు, అభిషేకాలు చేశారు.

వివరాలు లోపలి పేజీల్లో..

ఈ-పంట నమోదును పూర్తి చేయాలి

జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణ ఆదేశం

- వ్యవసాయ శాఖ అధికారులతో సమావేశం
- సాంకేతిక సమస్యలను పరిష్కరించాలని డీఏవోకు సూచన

ఒంగోలు కలెక్టరేట్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఈ-పంట నమోదును త్వరగా పూర్తిచేసేలా చర్యలు తీసుకోవాలని జాయింట్ కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణ ఆదేశించారు. స్థానిక ప్రకాశం భవన్‌లోని కలెక్టర్ సమావేశపు హాలులో బుధవారం వ్యవసాయశాఖ అధికారులు, సహాయ వ్యవసాయ సంచాలకులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో 15,68,517 భూకమతాలకుగాను



సమావేశంలో మాట్లాడుతున్న జేసీ గోపాలకృష్ణ, పక్కన జిల్లా వ్యవసాయాధికారి శ్రీనివాసరావు

4,63,072 మాత్రమే (30శాతం) నమోదు చేయడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు ఈ నెలాఖరు నాటికి నూరుశాతం పూర్తిచేయాలన్నారు. ప్రతిరోజూ సమీక్ష చేసి అందుకు అనుగుణంగా లక్ష్యాలను అధికారులు నిర్దేశించాలన్నారు. సాంకేతిక సమస్యలు ఏమైనా ఉంటే వెంటనే సవరిం చాలని జిల్లా వ్యవసాయాధికారి శ్రీనివాసరావుకు సూచించారు. జిల్లా సరాసరి కన్నా తక్కువగా నమోదు చేసిన వారిని అందుకు కారణాలను అడిగి తెలుసుకున్నారు. జియో ఫెన్సింగ్ 20మీటర్ల నుంచి 100 మీటర్లకు పెంచితే బీడు కమతాలను త్వరగా పూర్తి చేయవచ్చని ఆ శాఖ అధికారులు జేసీ దృష్టికి తెచ్చారు. దీనిపై స్పందించిన జేసీ ఆ విషయాన్ని ఉన్నతాధికారుల తెలియజేస్తానని చెప్పారు. జిల్లాలో నల్లబర్లీ పొగాకు సాగును కట్టడి చేసే విధంగా చర్యలు తీసుకోవా లన్నారు. సమావేశంలో డీపీఎం సుభాషిణి పాల్గొన్నారు.


వసతి కేంద్రమైన ఒంగోలులోని ఆగ్నీలియం స్కూల్‌కు చేరుకున్న డీఎస్సీ మహిళా అభ్యర్థులు, కుటుంబ సభ్యులు

ఒంగోలు చేరిన డీఎస్సీ అభ్యర్థులు

- వసతి కల్పించిన కేంద్రాల్లో బస
- నేడు ప్రత్యేక బస్సుల్లో అమరావతికి..
- సీఎం చంద్రబాబు నుంచి అందుకోనున్న నియామక పత్రాలు


కుటుంబ సభ్యులతో కలిసి బస్సులో బస కేంద్రానికి వెళ్తున్న డీఎస్సీ అభ్యర్థులు

ఒంగోలు విద్య, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : మెగా డీఎస్సీ టీచర్ పోస్టులకు ఎంపికై గురువారం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చేతుల మీదుగా నియామక పత్రాలు అందుకోనున్న అభ్యర్థులు బుధ వారం సాయంత్రానికి ఒంగోలులో వారికి కేటాయిం చిన వసతి కేంద్రాలకు చేరుకున్నారు. డీఎస్సీలో ఎస్‌జీటీ, స్కూల్ అసిస్టెంట్లు, పీజీటీ, టీజీటీ, ప్రిన్సి పాల్ పోస్టులకు 849మంది ఎంపికయ్యారు. వీరిలో పురుషులు 372, మహిళలు 477 మంది ఉన్నారు. పురుష అభ్యర్థులకు క్విస్ ఇంజనీరింగ్ కళాశాలలో, మహిళా అభ్యర్థులకు సెయింట్ జేవియర్స్ హైస్కూలు, అగ్నీలియం ఇంగ్లీషు మీడియం స్కూలు, మంగమూరు రోడ్డులోని రామచంద్రమిషన్ ఆశ్ర మంలో రాత్రికి బస ఏర్పాటు చేశారు. వీరిని గురు వారం ఉదయం అల్పాహారం అనంతరం 43 బస్సు ల్లో అమరావతిలో జరిగే సీఎం సభకు తరలిస్తారు. వీరికి అవసరమైన అన్ని ఏర్పాట్లను అధికారులు చేశారు. అభ్యర్థులతోపాటు వారి కుటుంబ సభ్యులకు గుర్తింపు కార్డులను జారీచేశారు. అభ్యర్థులతో రిజిస్ట్రేషన్ ఫారాలు పూర్తిచేయించారు. గురువారం అమరావతి వెళ్లేందుకు ఎంతమంది అభ్యర్థులు తమ తల్లిదండ్రులతో వచ్చారో వివరాలు తెలుసుకు నేందుకు డీఈవో కిరణ్‌కుమార్‌ను పలుమార్లు ఫోన్‌లో సంప్రదించేందుకు ప్రయత్నించినా ఆయన స్పందించలేదు. దీంతో ఎంతమంది ఒంగోలు వచ్చింది కచ్చితమైన సంఖ్య తెలియలేదు.

నీటి వనరుల నిర్వహణపై ప్రత్యేక దృష్టి

అధికారులకు కలెక్టర్ రాజాబాబు ఆదేశం

ఒంగోలు కలెక్టరేట్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : నీటి వనరుల నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ పి.రాజాబాబు సంబంధిత అధికారులకు సూచించారు. ప్రతి నీటిబొట్టు ప్రజలకు ఉపయోగపడేలా చూడాలన్నారు. అందుకు అవసరమైన కార్యాచరణ ప్రణాళికలను రూపొందించాలని ఆదేశించారు. కలెక్టరేట్‌లో బుధవారం నీటిపారుదల, ప్రాజెక్టుల అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలోని జలాశయాలు, నిల్వ సామర్థ్యం, ప్రస్తుతం నిల్వ పరిమాణం, వాటి పరిధిలోని ఆయకట్టు


నీటి వనరులకు సంబంధించిన మ్యాప్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ రాజాబాబు

వివరాలను ఇరిగేషన్ శాఖ ఎస్ఈ వరలక్ష్మి ఈ సందర్భంగా కలెక్టర్‌కు వివరించారు. వెలిగొండ, గుండ్లకమ్మ ప్రాజెక్టుల నిర్మాణ స్థితిగతులు, నిర్వహణ తీరును ప్రాజెక్టుల ఎస్ఈ అబుత్ అలీం తెలిపారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలోని పరిస్థితుల దృష్ట్యా సాగర్, స్థానిక జలాశయాల్లోని నీటిని సమర్థవంతంగా వినియోగించుకోవాలన్నారు. వివిధ శాఖలకు సంబంధించిన సేవలను ప్రత్యక్షంగా పర్యవేక్షించేందుకు కలెక్టరేట్‌లో శాశ్వత ప్రాతిపదికన కమాండ్ కంట్రోల్ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. నీటి వనరుల నిర్వహణకు కూడా ఎప్పటికప్పుడు తెలు సుకునేందుకు జిల్లా వాటర్ మేనేజ్‌మెంట్ సిస్టం పేరుతో ప్రత్యేకంగా ఒక యాప్‌ను తయారు చేసి ఈ కేంద్రానికి అనుసంధానం చేసేలా చర్యలు తీసుకోవాలని

మిగతా 8వ పేజీలో



అప్రమత్తతే ఆరోగ్య రక్ష

- వర్షాకాలంలో వ్యాధుల ముప్పు
- డెంగ్యూ, మలేరియా, మెదడువాపు, గున్యా వ్యాప్తికి అవకాశం
- కొద్దిపాటి జాగ్రత్తలతో సురక్షితం

9

28 నుంచి జూనియర్ కళాశాలలకు దసరా సెలవులు



ఒంగోలు విద్య, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ, ప్రైవేటు, ఇతర అన్ని యాజమాన్యాల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జూనియర్ కళాశా లలకు ఈనెల 28 నుంచి దసరా సెలవులను ప్రభుత్వం ప్రకటించింది. ఇంటర్మీడియెట్ విద్యా మండలి జారీచేసిన 2025-26 విద్యాసంవత్సర అకడమిక్ క్యాలెండర్ ప్రకారం జూనియర్ కళాశాలలకు 28 నుంచి అక్టోబరు 5 వరకు సెలవులు ఇస్తారు. వచ్చేనెల 6న కాలేజీలు పునఃప్రారంభవుతాయి.

డప్పు కొట్టు.. తరిమికొట్టు..

- నల్లమల అటవీ ప్రాంతంలో జంతువుల నుంచి రైల్వే సిబ్బందికి రక్షణ
- ప్రత్యేకంగా డప్పు, టపాసులు
- పట్టాలపై అదనపు గస్తీ

8


రాత్రి వేళ ట్రాక్ వెంట డప్పుకొట్టుకుంటూ వెళ్తున్న సిబ్బంది

గెలాక్సీ గ్రానైట్ క్వారీ ఓనర్ల అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నిక

అధ్యక్షునిగా శిద్దా సుధీర్, ప్రధాన కార్యదర్శిగా రవి



సుధీర్‌కుమార్, రవి

చీమకుర్తి, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి) : గెలాక్సీ గ్రానైట్ క్వారీ ఓనర్ల అసోసియేషన్ నూతన అధ్యక్షునిగా యువపారిశ్రామికవేత్త శిద్దా వీరవెంకట సుధీర్‌కుమార్ ఎన్నికయ్యారు. అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నిక ప్రక్రియ బుధవారం ఒంగోలులో నిర్వహించారు. గౌరవ అధ్యక్షుడుగా పోతుల రామారావు, అధ్యక్షునిగా శిద్దా సుధీర్‌కుమార్, ప్రధాన కార్యదర్శిగా ఆర్‌పీ రవి, కోశాధికారిగా చలువాది బదరీనారాయణలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షులుగా శిద్దా భరత్, కె.శైలజ, శ్రీధర్, ఆనంద్, జాయింట్ సెక్రటరీలుగా భాస్కరరెడ్డి, నవీన్‌కుమార్‌రెడ్డి, ఈసీ సభ్యులుగా శిద్దా సూర్యప్రకాశరావు, చలువాది సాకేత్‌రామానుజ, నూనె వంశీకృష్ణ, ఎండీ రఫీ, చంద్రారెడ్డి, శ్రీనివాసులు, ఎన్‌వీ రెడ్డిలను ఎన్నికయ్యారు.

మంత్రి లోకేశ్‌కు కృతజ్ఞతలు తెలిపిన పండిత పరిషత్

మార్కాపురం, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : డీఈవో పూల్ బాషా పండితుల ఉద్యోగోన్నతులకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చిన విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్‌కు పండిత పరిషత్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు ఎన్.సంపత్‌కృష్ణ, రవిచంద్ర ఒక ప్రకటనలో కృతజ్ఞతలు తెలిపారు. దశాబ్దాలుగా వెట్టి చాకిరీకి గురవుతున్న భాషా పండితుల సమస్యల పట్ల గత టీడీపీ ప్రభుత్వం సానుకూలంగా స్పందించిందన్నారు. కేబినేట్, ఆర్థికశాఖల ఆమోదంతో రాష్ట్రవ్యాప్తంగా 10,224 మంది బాషా పండితుల పోస్టులను స్కూల్ అసిస్టెంట్‌లుగా ఉన్నతీకరణ చేస్తూ 2018 డిసెంబరు 17న జీవో 91 విడుదల చేసిందన్నారు. కొన్ని సంఘాల కుయుక్తుల వలన సుమారు వెయ్యిమందికి పైగా బాషా పండితులు ఉద్యోగోన్నతులు రాక, పని చేయడానికి తాము నియామకమైనా పోస్టులు లేక గత ఆరేళ్లుగా డీఈవో పూల్‌లో ఉంటూ అనేక ఇబ్బందులు పడినట్లు తెలిపారు. మంత్రి లోకేశ్ దృష్టికి తీసుకెళ్లిన వెంటనే మిగిలిన భాషా పండితుల ఉద్యోగోన్నతులు కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడం వారి చిత్తశుద్ధికి నిదర్శనమన్నారు.

సంతకాల సేకరణ

గిద్దలూరు, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఓట్ల దొంగ గద్దె దిగు అని రాహుల్ గాంధీ చేస్తున్న పోరాటానికి మద్దతుగా కాంగ్రెస్ నాయకులు సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. పట్టణంలోని ముఖ్యకూడళ్లలో సంతకాల సేకరణ చేపట్టారు. నియోజకవర్గ ఇన్‌చార్జి పగడాల రంగస్వామి, కాంగ్రెస్ నాయకులు డి.శేఖర్‌రెడ్డి, యు.పోలయ్య, మండలశాఖ అధ్యక్షుడు జమాల్‌సాబ్ పాల్గొని మాట్లాడుతూ ఉన్న ఓట్లను తొలగించి బీజేపీ ఓట్ చోరీకి పాల్పడిందని ఆరోపించారు.

అన్నపూర్ణదేవి అలంకరణలో అమ్మవారు



అన్నపూర్ణదేవి అలంకరణలో ఉమామహేశ్వరి

మేదరమెట్ల, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): దసర నవరాత్రుల సందర్భంగా మండలంలోని దేవాలయాల్లో అమ్మవారు అన్నపూర్ణదేవిగా దర్శనమిచ్చారు. బుధవారం దైవాలరావూరులోని ఉమామహేశ్వర స్వామి ఆలయంలో అమ్మవారిని పూజారి రాజశేఖర్‌శర్మ.. అన్నపూర్ణదేవిగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. రావినూతలలోని వాసవీ కన్యకపరమేశ్వరి అమ్మవారి ఆలయం అ మ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మేదరమెట్లలోని మిద్దెలడొంకలో ఉన్న మల్లేశ్వరస్వామి ఆలయంలో అమ్మవారి అన్నపూర్ణదేవిగా అలంకరించారు.

ట్రస్ట్‌బోర్డు సభ్యులకు ఆర్యవైశ్య నేతల అభినందన

అద్దంకి, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): శింగరకొండ ప్రసన్నాంజనేయ స్వామి దేవాలయం ట్రస్ట్‌బోర్డు సభ్యులుగా నియమితులైన టీడీపీ నేత చుండూరి మురళీసుధాకరరావు, జనసేన నేత బత్తుల చంద్రశేఖర్, బీజేపీ నేత దేవరపల్లి సురేష్‌బాబులను బుధవారంఆర్యవైశ్య నాయకులు అభినందించారు.నేతలు చిన్ని శ్రీనివాసరావు, భోజనపల్లి సత్యనారాయణ, అత్తులూరి రమేష్, గార్లపాటి శ్రీనివాసరావు, తమ్మన శ్రీనివాసరావు, కురిచేటి చిన్ని, కురిచేటి శంకరరావు, పబ్బిశెట్టి శ్రీనివాసరావు, చామర్తి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయం.. ఆదర్శనీయం

త్రిపురాంతకంలో ఎనిమిదేళ్లుగా అదే పంథా కొనసాగింపు

జీవామృతం, ఘనామృతం, నీమాస్త్రం, అగ్ని అస్త్రం తయారీ

రెండెకరాల్లో దేశవాళీ రకాల పంటలు

రైతు త్రిపురాంతకేశ్వరరెడ్డి విజయగాథ



ఘనామృతాన్ని సిద్ధం చేస్తున్న త్రిపురాంతకేశ్వరరెడ్డి

త్రిపురాంతకం, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : నేలమ్మ శ్వాసను అర్థం చేసుకున్నాడు.. పంటల సాగు సరళిని మార్చుకున్నాడు.. ప్రకృతి వ్యవసాయాన్ని ఎంచుకున్నాడు.. సహజసిద్ధమైన పద్ధతిలో పంటలు సాగు చేస్తూ ఆర్థిక భద్రతే కాదు, ఆహార భద్రత, మానవ ఆరోగ్యభద్రత సాధించాలని లక్ష్యంగా పెట్టుకున్నాడు ఓ రైతు. డిగ్రీ ఉత్తీర్ణత సాధించి తెలుగు లిటరేచర్ చదివిన ఆయన పయనం వ్యవసాయం వైపు సాగింది. అదీ పూర్తిగా ప్రకృతి వ్యవసాయంలోనే నిమగ్నమయ్యాడు. ప్రస్తుతం ఎందరినో ఆ దిశగా నడిపేందుకు శిక్షణ ఇస్తూ, తాను ఇంకా రాటుదేలుతూ రసాయనాలు లేకుండా పంటలు పండించవచ్చని ప్రకృతికి హానిచేయకుండా జీవనోపాధి సాధించవచ్చని తన కృషితో నిరూపిస్తున్నాడు. త్రిపురాంతకానికి చెందిన రైతు చల్లా త్రిపురాంతకేశ్వరరెడ్డి విజయగాథ ఇది.

త్రిపురాంతకానికి చెందిన చల్లా త్రిపురాంతకేశ్వరరెడ్డి డిగ్రీ పట్టా పొందిన తరువాత కూడా ఉద్యోగ అవకాశాల వైపు దృష్టి సారించలేదు. వివిధ రకాల ఆదాయ మార్గాలను అన్వేషిస్తున్న తరుణంలో 2017లో కాకినాడలో ప్రకృతి వ్యవసాయంపై పాలేకర్ మాటలు విని ఆయన దృష్టి వ్యవసాయంపై పడింది. అప్పటి నుంచి ప్రకృతి వ్యవసాయం చేస్తూ ఎటువంటి రసాయనాల వినియోగం లేని పంటలు పండిస్తూ తనకున్న రెండెకరాల పొలంలోనే వివిధ రకాల పంటలు పండిస్తూ వస్తున్నారు. పంటలకు జీవామృతం, ఘనామృతం, నీమాస్త్రం, అగ్ని అస్త్రం తయారు చేస్తూ.. వినియోగిస్తూ సహజ సిద్ధమైన పద్ధతుల్లో మేలురకం పంటలు పండిస్తున్నారు.

రెండేసి గేదెలు, ఆవులతో సాగు

గతంలో పెసర, మినుములు, వరి వంటి మేలైన వంగడాలు పండించిన రైతు తమ కుటుంబానికి అవసరమైన కూరగాయలు కూడా స్వయంగా పండించుకుని తింటున్నారు. తన వ్యవసాయ పద్ధతుల కోసం రెండు గేదెలు, రెండు ఆవులను పెంచుకుంటూ వాటి ద్వారానే వ్యవసాయ అవసరాలు తీర్చుకుంటున్నట్లు చెప్పారు. పలుమార్లు ప్రకృతి వ్యవసాయంపై శిక్షణ పొందిన త్రిపురాంతకేశ్వరరెడ్డి సహజ వ్యవసాయంపై జాతీయ మిషన్ ద్వారా పలువురు రైతులకు శిక్షణ ఇచ్చేందుకు ఎంపికై ప్రస్తుతం తెనాలిలో అత్తోట వద్ద జరుగుతున్న తరగతుల్లో శిక్షణ పొందుతున్నాడు. జాతీయ వ్యవసాయ మిషన్ (ఎన్ఎంఎన్ఎఫ్) ద్వారా నెలకు రూ.6వేల పారితోషకం కూడా అందుకుంటుండడం గమనార్హం.

రత్నసోలి వెరైటీ వరి సాగు చేస్తున్నా

రైతు త్రిపురాంతకేశ్వర రెడ్డి

ప్రస్తుతం దేశవాళీ వెరైటీ రత్నసోలి రకం వరిని సాగుచేస్తున్నా. నెల్లూరు నుంచి విత్తనాలు తెచ్చి 20 రోజుల్లో నారు నాటా. ఈ వరి దాదాపు 4 నుంచి 5 అడుగులు ఎత్తు పంట పెరుగుతుంది. ఎకరాకు 30 బస్తాలకు తగ్గకుండా దిగుబడి వస్తుంది. ఇతర రకాల వరికన్నా దీనికి అధిక ధర వస్తుంది. ప్రస్తుతం 50కిలోల వరి ధాన్యం బస్తా రూ.4వేలు పలుకుతోంది. సాగు చేస్తున్న 1.50 ఎకరాల పంటకు దాదాపు 50 బస్తాలు పండితే 4 వేల చొప్పున రూ.2లక్షలు ఆదాయం వస్తుంది. ప్రకృతి సిద్ధమైన ఎరువు వాడకం వల్ల కేవలం రూ.20వేల ఖర్చు మాత్రమే వస్తుంది. ఈ లెక్కన దాదాపు 1లక్షా 80వేలు ఆదాయం వస్తుంది. ప్రకృతి వ్యవసాయం ద్వారా ఆర్థిక అవసరాలు తక్కువ ఆరోగ్య ప్రయోజనాలు ఎక్కువగానూ ఆదాయ వనరులు మెరుగ్గానూ ఉంటాయి.



సాగు చేస్తున్న వరి

శింగరకొండ దేవాలయం ట్రస్ట్‌బోర్డు సభ్యుల నియామకం

చైర్మన్‌గా మురళీసుధాకరరావు ఎన్నిక లాంఛనమే



శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి దేవాలయం

అద్దంకి, సెప్టెంబరు24 (ఆంధ్రజ్యోతి) : శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి దేవాలయం ట్రస్ట్‌బోర్డు సభ్యులను నియమిస్తూ ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఉమ్మడి ప్రకాశం జిల్లాలో ప్రధాన దేవాలయాలలో ఒకటిగా శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి దేవాలయం ఉంది. ఈ ఆలయం ట్రస్ట్‌బోర్డు నియామకంపై ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత పలువురు తమ వంతు ప్రయత్నాలు చేశారు. ఈ నేపథ్యంలో అద్దంకి పట్టణంలోని ఆర్యవైశ్య సామాజిక వర్గానికి చెందిన చుండూరి మురళీసుధాకరరావుకు చైర్మన్‌గా దక్కే అవకాశం ఉందని టీడీపీ వర్గీయులలో చర్చ సాగింది. అదేవిధంగా బుధవారం రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన సభ్యుల జాబితాలో చుండూరి మురళీసుధాకరరావు పేరు ఉంది. మొత్తం 11 మంది సభ్యులతో ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు ఇచ్చింది. మురళీసుధకారరావు, ఆకుల కోటేశ్వరమ్మ, బత్తుల చంద్రశేఖర్, నూతి లక్ష్మీప్రసాద్, మద్దా సునీత, ఏల్చూరి వెంకట నారాయణమ్మ, దూళిపాళ్ల వెంకటరత్నం, గొర్రెపాటి పద్మజ, అరబోలు నాగమ్మ, దేవరపల్లి సురేషబాబు, కోనంకి సుబ్బారావుల తోపాటు ఎక్స్ అఫిసియో సభ్యుడిగా కోట లక్ష్మీనారాయణను నియమిస్తూ ప్రభుత్వ ఎక్స్ అఫిసియో సెక్రటరీ హరిజవహర్‌లాల్ బుదవారం ఉత్తర్వులు ఇచ్చారు. ఈ మేరకు శింగరకొండ ప్రసన్నాంజనేయ స్వామి దేవాలయానికి కూడా ఉత్తర్వులు అందినట్లు ఈవో, అసిస్టెంట్ కమిషనర్ తిమ్మానాయుడు తెలిపారు. 11 మంది సభ్యులు ప్రమాణస్వీకారం చేసిన తరువాత మురళీసుధాకరరావును చైర్మన్‌గా ఎన్నుకోవటం లాంఛనమే కానుంది. తమ నియమాకానికి కృషి చేసిన మంత్రి గొట్టిపాటి రవికుమార్‌కు మురళీసుధాకరరావు, మిగిలిన సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.



మురళీసుధాకరరావు

డప్పు, టపాసులతో అడవి జంతువుల నుంచి సిబ్బందికి రక్షణ

రైలు పట్టాలపై అదనపు గస్తీ

గిద్దలూరు, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): నల్లమల అటవీ ప్రాంతంలో పులుల సంఖ్య పెరిగింది. ఇతర అడవి జంతువుల సంఖ్య కూడా రోజురోజుకూ పెరుగుతున్నది. గ్రామ శివార్లలోకి పులులు వచ్చి పశువులను చంపుతున్న ఘటనలు చోటుచేసుకుంటున్నాయి. ఈనేపథ్యంలో రైల్వే శాఖ సిబ్బందిని కాపాడుకునేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టింది. అదనపు సిబ్బందితోపాటు పులుల బారినపడకుండా సిబ్బందికి డప్పులు, టపాసులు సమకూర్చింది. గుంటూరు - గుంతకల్లు రైలు మార్గంలో, గిద్దలూరు - నంద్యాల మధ్య దట్టమైన అటవీ ప్రాంతం నుంచి రైలు వెళ్లాల్సి ఉంది. పగలు, రాత్రి తేడా లేకుండా రైల్వే గ్యాంగ్ సిబ్బంది రైలు పట్టాల వెంట డ్యూటీ చేయాల్సి ఉంటుంది. అటవీ జంతువుల బారి నుంచి ప్రయాణికులను, సిబ్బందిని కాపాడుకునేందుకు రైల్వే శాఖ ఉన్నతాధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. దిగువమెట్ట నుంచి చలమ వరకు ఈ రెండు రైల్వేస్టేషన్ల మధ్య 16 కిలోమీటర్లమేర దట్టమైన అటవీ ప్రాంతం ఉంది. ఈ 16 కిలోమీటర్లను 3 భాగాలుగా విభజించి పెట్రోలింగ్ కోసం 3 టీములను ఏర్పాటు చేశారు. పగటి పూట ట్రాక్‌లు తనిఖీ చేసే కీమెన్ భద్రత కోసం ఒకరికి బదులు ఇద్దరిని కేటాయించారు. రాత్రివేళల్లో ముగ్గురు సభ్యులను బృందాలుగా పంపాలని నిర్ణయించారు. డ్రమ్స్, టపాసులను సిబ్బందికి సమకూర్చారు. అడవి జంతువులు కనిపిస్తే డప్పు వాయిస్తూ రైల్వే సిబ్బంది తమకు తాము రక్షించుకోవడంతోపాటు రైలు ప్రయాణికులను కూడా రక్షించడానికి ఉపకరిస్తుందని గుంటూరు డివిజన్ రైల్వే శాఖ అధికారి వినయ్‌కాంత్ తెలిపారు. 16 కిలోమీటర్ల ఘాట్ రోడ్డులో పులులు, చిరుతలు, ఎలుగుబంట్ల సంచారం పెరగడం వలన ఈ భద్రత చర్యలను అమల్లోకి తెచ్చినట్లు తెలిపారు.



విధులు నిర్వహిస్తూ డప్పు కొడుతున్న రైల్వే సిబ్బంది

ఎట్టకేలకు రోడ్డెక్కిన గ్యాస్ ట్యాంకర్

మూడు ఎక్స్‌కవేటర్ల సహాయంతో రోడ్డుపైకి ట్యాంకర్

పర్యవేక్షణ చేసిన జిల్లా అగ్నిమాపక అధికారి

నామ్ రోడ్డుపై ట్రాఫిక్ నిలిపివేత

అద్దంకి, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి) : రోడ్డు అంచులోకి ఒరిగిపోయిన గ్యాస్ ట్యాంకర్‌ను రెండు రోజుల నుంచి తీవ్రంగా ప్రయత్నించి బుధవారం మధ్యాహ్నానికి రోడ్డు పైకి చేర్చారు. మూడు రోజుల క్రితం అర్థరాత్రి సమయంలో చెన్నై నుంచి హైదరాబాద్ వైపు వెళ్తున్న గ్యాస్ ట్యాంకర్ అదుపు తప్పి అద్దంకి మండలం శ్రీనివాసనగర్ వద్ద నామ్ రోడ్డు అంచులోనికి వరిగింది. మంగళవారం రెండు ఎక్స్‌కవేటర్ల సహాయంతో తీవ్రంగా ప్రయత్నించినా రోడ్డు పైకి చేరలేదు. దీంతో బుధవారం విజయవాడ నుంచి తీసుకొచ్చిన రెండు భారీ ఎక్స్‌కవేటర్లు, స్థానికంగా ఉన్న మరో ఎక్స్‌కవేటర్ సహాయంతో సుమారు రెండున్నర గంటల పాటు శ్రమించి రోడ్డుపైకి చేర్చారు. ఈ సమయంలో నామ్ రోడ్డుపై ట్రాఫిక్ నిలిపివేశారు. 18 టన్నుల గ్యాస్‌తో పాటు మొత్తం ట్యాంకర్ బరువు సుమారు 35 టన్నుల వరకు ఉంది. దీంతో రోడ్డు అంచులో నుంచి రోడ్డు పైకి చేర్చేందుకు తీవ్రంగా శ్రమించాల్సి వచ్చింది. జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి వినయ్ పర్యక్షించారు. అద్దంకి పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేయటంతో పాటు నామ్ రోడ్డుపై ట్రాఫిక్ మళ్లించారు. గ్యాస్ లీకైతే పెను ప్రమాదం జరిగే అవకాశం ఉండటంతో అగ్నిమాపక, పోలీస్‌శాఖ అధికారులు అన్ని ముందస్తు జాగ్రత్తలు తీసుకున్నారు.



భారీ క్రేన్‌ల సహాయంతో రోడ్డు పైకి చేర్చుతున్న గ్యాస్ ట్యాంకర్

ప్రకాశం టూ చెన్నై వయా నెల్లూరు

- రేషన్ బియ్యం రాకెట్ రూట్ ఇది..
- రవాణదారుడు మహేష్‌రెడ్డిపై కేసు నమోదు
- పట్టుబడిన బియ్యం ఎంఎల్ఎస్ పాయింట్‌కు

నెల్లూరురూరల్,సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి) : రేషన్ బియ్యం అక్రమ రవాణా గుట్టురట్టైంది. స్మగ్లింగ్ రూటు బహిర్గతం కావడంతో అధికార, రాజకీయ వర్గాలు విస్మయం వ్యక్తం చేస్తున్నాయి. ప్రకాశం జిల్లా నుంచి సేకరించిన రేషన్ బియ్యాన్ని లారీల్లో లోడ్ చేసి చెన్నైలోని మార్కెట్‌కు తరలిస్తూ వయా నెల్లూరులో ఆగడంతో భారీగా బియ్యం పట్టుబడినట్లు పౌరసరఫరాల శాఖకు చెందిన ఓ అధికారి తెలిపారు. సాధారణ బియ్యం రవాణా మాటున రేషన్ బియ్యం కూడా తరలించేందుకు సిద్ధం చేసుకున్న ప్రణాళిక బెడిసికొట్టడంతో రెండు లారీల్లోని బియ్యం పట్టుబడినట్లు ఆ అధికారి చెప్పుకొచ్చారు. ప్రకాశం జిల్లాలో రేషన్ షాపుల ద్వారా రహస్యంగా సేకరించిన బియ్యం చెన్నై మార్కెట్‌కు తరలించే బాధ్యతను అనంతరసాగరం మండలం వెంగంపల్లికి చెందిన బట్టిరెడ్డి మహేష్‌రెడ్డి తీసుకున్నట్లు పౌరసరఫరాల శాఖ అధికారులు ప్రాథమికంగా గుర్తించారు.

పట్టుబడిన బియ్యం లారీలు



పట్టుబడిన లారీలు ఆయనవే కావడంతో పౌరసరఫరాల శాఖ ఆయనపై 6ఏ కేసును నమోదు చేయగా, ఇటు నెల్లూరురూరల్ పోలీసులు సీఎస్‌డీటీ జమీర్‌బాషా ఇచ్చిన ఫిర్యాదుతో 7 ఆఫ్ ఈసీ చట్టం కింద కేసు కట్టినట్లు సీఐ గుంజి వేణు బుధవారం తెలిపారు. కాగా పట్టుబడిన రేషన్ బియ్యాన్ని నిల్వ చేసేందుకు పౌరసరఫరాల శాఖ నేతృత్వంలోని ఎంఎల్ఎస్ గోదాములకు తరలించారు.

నెల్లూరులో ఎందుకు ఆపారు...?

అధికారులకు పట్టుబడింది రెండు లారీల రేషన్ బియ్యమే అయినా, చెన్నైలోని స్మగ్లింగ్ మార్కెట్ కేంద్రంగా భారీ రాకెట్ నడుస్తున్నట్లు నిఘా వర్గాలు అంచనా వేస్తున్నాయి. పేదలకు ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్న రేషన్ బియ్యానికి ఏకంగా రూ. 46 వరకు వ్యాపారులకు కొనుగోలు సమయంలో చెల్లిస్తున్నట్లు తెలుస్తోంది. వీటిని పలువురు తినేందుకు ఇష్టపడక రేషన్ డీలర్లకు కేజీ రూ. 10ల చొప్పున అమ్మేసి సొమ్ముచేసుకుంటున్నారు. ఇలా సేకరించిన బియ్యాన్ని మండలాల వారీగా మాఫీయా వ్యక్తులు జిల్లాకు కేజీ రూ. 15 నుంచి 20ల వరకు అమ్ముతున్నట్లు సమాచారం. ఈ మార్గాల ద్వారా రేషన్ బియ్యం స్మగ్లింగ్ చేసే సిండికేట్లు భారీగా నిల్వ చేసి చెన్నైకు తరలిస్తున్నట్లు తాజాగా పట్టుబడిన లారీగా రాకెట్ ద్వారా సమాచారాన్ని నిఘా వర్గాలు సేకరించినట్లు తెలుస్తోంది. కాగా మహేష్‌రెడ్డి అనే వ్యక్తి రెండు లారీల్లో రేషన్ బియ్యాన్ని నింపి మరో మూడు లారీల్లో సాధారణ బియ్యం నింపి నెల్లూరులో ఎందుకు ఆపారు...? వీటితో పాటు మరిన్ని లారీలు ఒకే సారి చెన్నై బయల్దేరే అవకాశమేమైన ఉందా...? ఉంటే ఆ లారీలు ఎక్కడ...? అన్నది ప్రస్తుతం దర్యాప్తు అధికారులు ఆరా తీస్తున్నారు.

పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఎనలిస్టుగా బాజీ

అవీఇవీ

ముక్తేశ్వరం పంచాయతీ కార్యదర్శిగా విధులు నిర్వహిస్తూనే ఎంపిక



తురిమెళ్ల బాజీ

బల్లికురవ, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి) : మండలంలోని ముక్తేశ్వరం గ్రామ పంచాయతీ కార్యదర్శిగా పనిచేస్తున్న షేక్ తురిమెళ్ల బాజీ రాష్ట్ర పొల్యూషన్ కంట్రోల్ బోర్డులో గ్రేడ్-2 ఎనలిస్టుగా ఎంపికయ్యారు. రాష్ట్రస్థాయిలో పొల్యూషన్ కంట్రోల్ బోర్డు పరీక్షలను ఈ ఏడాది మార్చిలో నిర్వహించారు ఈ పరీక్షలలో పంచాయతీ కార్యదర్శి తురిమెళ్ల బాజీ పాల్గొని ఉత్తీర్ణత సాధించారు. జూలైలో సీసీటీ పరీక్షలు నిర్వహించారు. ఈ పరీక్షలో రాష్ట్రవ్యాప్తంగా 40 మంది క్వాలిఫై కాగా వారిలో 18 మందిని ఎనలిస్టులుగా ఎంపిక చేశారు. మంగళవారం రాత్రి పోల్యూషన్ బోర్డు విడుదల చేసిన ఫలితాలలో సత్తాచాటిన బాజీ ఎనలిస్టు పోస్టుకు ఎంపికయ్యారు. సంతమాగులూరు మండలం ఏల్చూరుకు చెందిన షేక్ తురిమెళ్ల బాజీ ఐదేళ్ల నుంచి పంచాయతీ కార్యదర్శిగా విధులు నిర్వహిస్తున్నారు. చిన్నతనం నుంచే చదువుపై మక్కువతో ఆమె గ్రూప్స్ పరీక్షలు రాయాలని పట్టుదలగా ముందుకు వెళ్లారు. ఒక వైపు పంచాయతీ కార్యదర్శిగానే పనిచేస్తునే ఖాళీ సమయంలో చదువుతూ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు పరీక్షలు రాసి రాష్ట్రస్థాయిలో ఉత్తీర్ణత సాధించారు. ఈ సందర్భంగా అమెను ఏల్చూరు గ్రామస్థులతో పాటు తోటి ఉద్యోగులు ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా బాజీ మాట్లాడుతూ తాను పట్టుదలతో చదివానని ఏదైనా ఉన్నత ఉద్యోగం చేయాలనే సంకల్పంతో ముందుకు వెళ్లి విజయం సాధించానని తెలిపారు.

పశ్చిమానికి దన్నుగా..

(7వ పేజీ తరువాయి)

సీఎం చంద్రబాబు గట్టి పట్టుదలతో ఉన్నారు. దాదాపు 30 ఏళ్ల క్రితం ఆ ప్రాజెక్టుకు సీఎం హోదాలో ఆయనే శంకుస్థాపన చేయగా అప్పటి నుంచి నిర్మాణం సాగుతూ ఉంది. ప్రస్తుతం అనేక కీలక పనులు కొలిక్కి వచ్చాయి. నిధులు కేటాయించి పలు పెండింగ్ పనులు పూర్తిచేస్తే తొలిదశ నీరిచ్చే అవకాశం ఉంది. దానికి తోడు వచ్చే సీజన్‌కు తొలిదశ పూర్తికి సీఎం పలుసార్లు హామీ ఇచ్చారు.

తాగునీటి ఇక్కట్లకు చెక్

వెలిగొండ తొలిదశ పనులను వచ్చే ఆగస్టు నాటికి పూర్తిచేసి ప్రాజెక్టులోకి 10 టీఎంసీల మేర డెడ్ స్టోరేజీ వరకు నీరు నిలిపితే తీవ్ర తాగునీటి ఇక్కట్లు పడుతున్న పశ్చిమ ప్రాంత ప్రజలకు దాహార్తి తీర్చవచ్చు. అందుకోసం రూ.1,290 కోట్లతో భారీ తాగునీటి ప్రాజెక్టుకు డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఈఏడాది జూలై 4న శంకుస్థాపన చేశారు. దీని ద్వారా ఆ ప్రాంతంలోని 18 మండలాల్లో 10లక్షల మందికి తాగునీటి సౌకర్యం కల్పించనున్నారు. అత్యంత కీలకమైన వెలిగొండ ప్రాజెక్టు లోపలి భాగంలో రూ.70 కోట్లతో నిర్మిస్తున్న ఇన్‌టెక్ వెల్ నిర్మాణం పూర్తికావడం ప్రధాన ముందడుగుగా చెప్పాలి.

పారిశ్రామిక అభివృద్ధితో ఉపాధి

ఉపాధి అవకాశాలకు ఊతమిచ్చేందుకు నిరుపయోగంగా ఉండి, రాబడి అతి తక్కువగా ఉండే భూములను వినియోగంలోకి తెచ్చేలా రిలయన్స్ సంస్థతో ప్రభుత్వం చేసుకున్న ఒప్పందంలో భాగంగా తొలి కంప్రెస్ట్ బయోగ్యాస్ (సీబీజీ) ప్లాంట్‌కు పీసీపల్లి మండలం దివాకరపురం వద్ద బీజం పడింది. స్వయంగా మంత్రి నారా లోకేష్ శంకుస్థాపనకు రావడం ద్వారా ప్రభుత్వ ప్రాధాన్యతను చెప్పకనే చెప్పారు. దాంతోపాటు మరిన్ని ప్లాంట్లను జిల్లాలో ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించారు. ప్రస్తుతం మరో నాలుగు ప్లాంట్ల ఏర్పాటు కోసం భూసేకరణ ప్రక్రియ నడుస్తోంది. అలాగే దొనకొండ పారిశ్రామిక ప్రాంతంలో 4వేల ఎకరాలలో ఏరో స్పేస్ విడిభాగాల తయారీ పరిశ్రమ ఏర్పాటుపై ఇటీవల జరిగిన కలెక్టర్ల సమావేశంలో ప్రభుత్వం స్పష్టతనిచ్చింది. రాష్ట్రంలో మొత్తం 32 పారిశ్రామిక క్లస్టర్లు ఏర్పాటు చేయనుండగా, అందులో నాలుగు డిఫెన్స్ క్లస్టర్లు ఉన్నాయి. వాటిలో ఒకటి దొనకొండకు కేటాయిస్తున్నట్లు ప్రకటించారు. ఇప్పటికే సంబంధిత సంస్థల ఉన్నతస్థాయి అధికారులు ఆ ప్రాంతంలో పరిశీలన కూడా చేశారు.

మెరుగుకానున్న రవాణా సౌకర్యం

జిల్లాకు మధ్య ప్రాంతం నుంచి వెళ్లే నడికుడి-శ్రీకాళహస్తి రైల్వే మార్గం నిర్మాణం కొలిక్కి వస్తోంది. ప్రధానమైన దర్శి, పొదిలి, కనిగిరి స్టేషన్లు, అధిక భాగం రైల్వేమార్గం పూర్తయ్యింది. ఎంతోకాలంగా పెండింగ్‌లో ఉన్న ఒకరకంగా ఇక ఆగిపోయింది అనుకున్న ఒంగోలు-దొనకొండ రైల్వే మార్గం మళ్లీ తెరపైకి వచ్చింది. రాష్ట్రంలో రైల్వేల అభివృద్ధిలో భాగంగా కేంద్రం డీపీఆర్‌లు సిద్ధం చేస్తున్న రైల్వే ప్రాజెక్టులలో ఒంగోలు-దొనకొండ మార్గాన్ని చేర్చింది. దీంతో దీనిపై మళ్లీ ఆశలు చిగురించాయి. రాష్ట్రప్రభుత్వం ప్రత్యేకించి ముఖ్యమంత్రి రైల్వే ప్రాజెక్టులపై పట్టుదలతో ఉండటంతో ఇలాంటివన్నీ మళ్లీ తెరపైకి వస్తున్నట్లు సమాచారం. ఈ మార్గం రూపుదాల్చితే ప్రస్తుతం తూర్పు ప్రాంతంలోని చెన్నై-విజయవాడ, పశ్చిమప్రాంతంలోని గుంటూరు-గుంతకల్లు మార్గాలతోపాటు వేగంగా నిర్మాణం సాగుతున్న నడికుడి-శ్రీకాళహస్తి మార్గం కూడా అనుసంధానం అవుతాయి. తద్వారా రవాణా సౌకర్యం మరింత మెరుగవుతుంది. మొత్తం మీద పశ్చిమ ప్రాంతానికి చెందిన పలు కీలక అంశాలపై ప్రభుత్వం, సీఎం ప్రత్యేక ఫోకస్ పెట్టారన్న విషయం స్పష్టమవుతోంది.

నీటి వనరుల నిర్వహణపై ప్రత్యేక దృష్టి

(7వ పేజీ తరువాయి)

ఆదేశించారు. వివిధ జలాశయాలను జియో కోఆర్డినేటర్స్ ఆధారంగా ఈ యాప్‌తో అనుసంధానం చేయాలన్నారు. తద్వారా నీటివనరుల నిల్వ వివరాలను ఎప్పటికప్పుడు తెలుస్తుందన్నారు. ఈ యాప్ ద్వారా జనలవరులశాఖలో పనిచేసే ఉద్యోగులు, ప్రధానంగా క్షేత్రస్థాయి సిబ్బంది అనుక్షణం అప్రమత్తంగా ఉండేందుకు అవకాశం ఉంటుందన్నారు. వివిధ జలాశయాలకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న మరమ్మతులు, ఇతర నిర్వహణ పనుల అంచనాలను రూపొందించాలన్నారు. మైనర్ చెరువుల్లోని మట్టిని స్థానికులు ఉచితంగా తీసుకెళ్లేందుకు అనుమతి కోసం రాష్ట్రప్రభుత్వానికి పంపేందుకు ప్రతిపాదనలు సిద్ధంచేయాలని ఆదేశించారు. సాగర్ కాలువ ద్వారా దర్శి నుంచి పొదిలికి మంచినీళ్ల సరఫరా చేసే పైపులైన్ పనులు త్వరగా పూర్తిచేసేలా సంబంధిత కాంట్రాక్టర్‌తో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఇరిగేషన్, ప్రాజెక్టులు, ఆర్‌డబ్ల్యూఎస్ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. సమావేశంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ బాలశంకరరావు, ఇరిగేషన్, ప్రాజెక్టుల ఈఈలు, డీఈఈలు, భూగర్భ నీటి వనరులశాఖ డిప్యూటీ డైరెక్టర్ వందనం పాల్గొన్నారు.


లోక్ కల్యాణ్ పథకాన్ని వినియోగించుకోవాలి



మాట్లాడుతున్న నగరపంచాయతీ కమిషనర్ కేఎల్ఎన్ రెడ్డి

పొదిలి, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన లోక్ కల్యాణ్ పథకాన్ని వినియోగించుకోవాలని నగరపంచాయతీ కమిషనర్ కేఎల్ఎన్‌రెడ్డి చెప్పారు. బుధవారం నగర పంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన లోక్ కల్యాణ్ మేళాపై వీధి వ్యాపారులకు జరిగిన అవగాహన కార్యక్రమంలో కమిషనర్ మాట్లాడారు. చిరువ్యాపారులు ఆర్థికంగా అభివృద్ధి చెందాలనే లక్ష్యంతో ప్రభుత్వం లోక్ కల్యాణ్ మేళాను అమలు చేస్తోందన్నారు. మొదటి విడతగా రూ.15వేలు, రెండో విడతగా రూ.25వేలు, మూడవ విడతగా రూ.50వేలు ఇవ్వనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వ్యాపారులు, సిబ్బంది పాల్గొన్నారు.

అప్రమత్తతే ఆరోగ్య రక్ష



వర్షాకాలంలో వ్యాధుల ముప్పు
డెంగ్యూ, మలేరియా, మెదడువాపు, గున్యా వ్యాప్తికి అవకాశం
కొద్దిపాటి జాగ్రత్తలతో సురక్షితం


ఒంగోలు కార్పొరేషన్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : వానలు మొదలయ్యాయి.. తడి వాతావరణం అలముకుంది.. అలాగే దోమల ఉధృతి కూడా పెరిగింది. డెంగీ, మలేరియా కేసులు ఇప్పటికే నమోదవుతుండగా, అధికశాతం వైరల్ ఫీవర్స్‌తో రోగులు ఆసుపత్రుల బాట పడుతున్నారు. మెదడు వాపు, గన్యా, బోధ తదితర వ్యాధుల వ్యాప్తికి దోమలే కారణం. ముఖ్యంగా ఇంటితోపాటు పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారా రోగాల బారినపడకుండా జాగ్రత్తపడవచ్చు.

● నీటి కాలుష్యంతో ముప్పు

నీటికాలుష్యం కారణంగా డయేరియా, పచ్చకామెర్లు, వైరల్ జ్వరాలు, చికెన్‌పాక్స్, పిల్లల్లో మీజిల్స్, నీళ్ల విరేచనాలు, గవదబిళ్లలు, పలు రకాల వ్యాధులు వ్యాప్తి చెందే అవకాశాలు ఎక్కువ, దాంతో ప్రస్తుతం చెరువుల్లో కొత్తగా వస్తున్న నీటిని అధికార యంత్రాంగం కొళాయిల ద్వారా గృహాలకు విడుదల చేయడంతో రోగాలు మరింతగా వచ్చే అవకాశం ఉంది. కొళాయిల ద్వారా వచ్చే నీటిని కాచి, చల్లార్చి తీసుకోవడం ద్వారా రోగాల బారినపడకుండా జాగ్రత్త పడవచ్చు.

● డెంగ్యూ.. మలేరియా

వానాకాలంలో అధికంగా డెంగ్యూ, మలేరియా జ్వరాల బెడద అధికం. ప్లాస్మోడియం పరాన్నా జీవి ఆడ అనోఫిలస్ దోమ మలేరియాను వ్యాపింపచేస్తుంది. మలేరియాలో ప్లాస్మోడియం వైవాక్స్, ప్లాస్మోడియం ఫాల్సీ ఫారమ్ అనేవి రెండురకాలు. ఇందులో రెండో రకం చాలా ప్రమాదకరం. మలేరియా లక్షణాలు కనిపించిన వెంటనే రక్త పరీక్షలు చేసి, వ్యాధిని నిర్ధారించి త్వరగా చికిత్స అందించాలి. లేని పక్షంలో కాలేయాన్ని, మూత్ర పిండాలను, రక్తకణాలు దెబ్బతీస్తాయి. ఒక్కోసారి మెదడుపై దాడి జరిగి రోగి కోమాలోకి వెళ్లేప్రమాదం ఉంది. అదేవిధంగా ఈడిస్ ఈజిప్టై అనే దోమ కారణంగా డెంగ్యూ సోకుతుంది. నల్లగా ఉండే దోమ ఒంటిపై తెల్లని చారలు ఉంటాయి. దీనిని టైగర్ దోమగా పిలుస్తారు. ఇది కుట్టిన ఏడెనిమిది రోజుల తర్వాత డెంగ్యూ లక్షణాలు కనిపిస్తాయి. హఠాత్తుగా తీవ్రమైన జ్వరం, కళ్లు తిరగడం, కండరాల నొప్పి, వాంతులు, వికారం, రక్తంతో కూడిన మల విసర్జన, కడుపు నొప్పి ఉంటాయి. రక్తపోటు కణాలు సంఖ్య తగ్గిపోతుంది. లక్షణాలు ముందే గుర్తిస్తే పూర్తిస్థాయిలో చికిత్స అందించవచ్చు.



● 21 తేదీ నాటికి జీజీహెచ్‌లో నమోదైన జ్వరపీడితులు

వైరల్ జ్వరాలు	: 1,80,320
అతిసారం	: 4,100
టైఫాయిడ్	: 813
చికెన్ గన్యా	: 08
డెంగీ జ్వరాలు	: 89
శ్వాసకోశ వ్యాధులు	: 5,912
మలేరియా	: 82

● గున్యా.. ఫైలేరియా

వర్షాకాలంలో గున్యా, ఫైలేరియా లక్షణాలు కనిపిస్తాయి. గన్యా వస్తే జ్వరం, ఒళ్లుతూలడం, తీవ్రమైన కీళ్ల నొప్పులు ఉంటాయి. కొన్ని రోజులు మంచం దిగే పరిస్థితి ఉండదు. ఇది ప్రాణాంతక సమస్య కాదు. పెద్దవారికి వస్తే కోలుకోవానికి సమయం పడుతుంది. ఈ సీజన్‌లోనే ఫైలేరియా (బోద) సమస్య వస్తుంది. కాళ్లకు, చేతులకు రావచ్చు. పురుషుల్లో వృషణాల్లోనూ కనబడుతుంది. ఈ కాలంలో మెదడువాపు వ్యాధి కూడా కనిపిస్తుంది. పందుల్లో ఉన్న ఈ వైరస్ దోమల ద్వారా మనుష్యులకు వ్యాప్తిస్తుంది. ముఖ్యంగా పిల్లలకు ప్రాణాంతకం, తీవ్రమైన తలనొప్పి, మెదడు పొరల్లో వాపు, కొన్ని సార్లు బాధితులు కోమాలోకి వెళతారు.

● స్వైన్ ఫ్లూ..

సాధారణంగా పందుల్లో ఉండే హెచ్ 1 ఎన్1 వైరస్ ఇది. వర్షాకాలంతోపాటు చలికాలంలో ఎక్కువగా ప్రభావం చూపుతుంది. స్వైన్‌ఫ్లూ లక్షణాలు ముక్కు కారడం, దగ్గు, గొంతు నొప్పి, తమ్ములు, కళ్ల వెంట నీళ్లు, జ్వరం, ఒళ్లు నొప్పులు, విరేచనాలు, వాంతులు ఉంటాయి. తుమ్మినా, దగ్గినా చేతిగుడ్డ అడ్డుపెట్టుకోవడం ద్వారా ఇతరులకు వ్యాధి వ్యాప్తి చెందదు. వ్యాధి నిరోధక శక్తి తక్కువగా ఉండే వారికి ఈ వ్యాధి త్వరితగతిన వస్తుంది.

నివారణ చర్యలు ఇవీ..

- దోమకాటు బారినపడకుండా ఉండటానికి వ్యక్తి పరిశుభ్రతతోపాటు, పరిసరాల పరిశుభ్రత పాటించాలి.
- కాళ్లు, చేతులు కడుగుకోవడం, పూర్తిగా కప్పి ఉండే దుస్తులు ధరించడం, ఇంట్లో దోమల పెరగడానికి అనువుగా ఉండే వాతావరణం లేకుండా చూసుకోవాలి
- పూల కుండీలు, నీళ్ల ట్యాంకులు, కొబ్బరిబోండాల ఖాళీ చిప్పలు, మూతలేని ప్లాస్టిక్ డబ్బాలు,కూలర్లు, ఏసీలు, సిమెంట్ తొట్లు, ఖాళీ టైర్లలో నీరు నిల్వ ఉంచొద్దు.
- దోమతెరలు, గుడ్‌నైట్, ఆలౌట్ వంటి మిషన్లు, దోమలు తరిమే చక్రాలు వినియోగిండం ద్వారా కొంతమేర దోమలు నివారించవచ్చు.
- రోజూ కాచి చల్లార్చిన నీరు తాగాలి

జీజీహెచ్‌లో మెరుగైన వైద్యం

డాక్టర్ మాణిక్యరావు, జీజీహెచ్ సూపరింటెండెంట్

సీజనల్ వ్యాధులు ప్రబలుతున్న క్రమంలో జీజీహెచ్‌లో మెరుగైన వైద్యం అందిస్తున్నాం. అందుకోసం అవసరమైన మందులు అందుబాటులో ఉన్నాయి. స్పెషలిస్ట్ డాక్టర్లు, నర్సింగ్ సిబ్బంది 24 గంటలు అందుబాటులో ఉన్నారు. కొద్దిపాటి నీరసం.. జ్వరం, వళ్లు నొప్పులు, ఇతర అనారోగ్య సమస్యలు కనిపిస్తే వెంటనే వైద్యుని సంప్రదించాలి. రక్తపరీక్షలు చేసి, వ్యాధి నిర్ధారణ బట్టి వైద్య అందిస్తున్నాం. ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడం వలన అనారోగ్య సమస్య నుంచి త్వరగా కోలుకోవచ్చు.

దుర్గం దొరువు ఆధునికీకరణకు నిధులివ్వండి

- ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర నరసింహారెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి

కనిగిరి, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి) : కనిగిరి దుర్గం దొరువు అభివృద్ధికి నిధులు కేటాయించాలని ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి కోరారు. మంగళవారం అసెంబ్లీలో ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వంలో పచ్చదనం, పర్యావరణం, సుందరీకరణం పేరుతో దొరువు ఆదునికీకరణ కోసం కాంట్రాక్టు ఇచ్చారన్నారు. సదరు ఏజెన్సీ ఒక్క పని కూడా చేయలేదన్నారు. దొరువు ప్రాంత పరిస్థితిపై ఫొటోలను చూపిస్తూ ఎంతో చారిత్రాత్మక చరిత్ర కల్గిన రాయల దొరువు దుస్థితి గురించి వివరించారు. దొరువు ప్రాంతంలో ప్రముఖ దేవాలయాలు ఉన్నాయన్నారు. అలాగే, రాయలవారు కొండపై నిర్మించిన విజయమార్తేండేశ్వరస్వామి దేవాలయానికి వెళ్లే మార్గమని వివరించారు. అలాంటి ప్రాంతం అపరిశుభ్రంగా మారి దేవాలయాలకు వెళ్లే భక్తులతో పాటు ప్రజలకు నీటిఊటగా ఉండే దొరవు దుర్వాసన ప్రాంగణంగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజల అవసరాన్ని, చారిత్రాత్మక విలువలను దృష్టిలో ఉంచుకుని కనిగిరి దొరువు అభివృద్ధికి, మరమ్మతులకు నిధులు మంజూరు చేయాలని ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర కోరారు.

అసెంబ్లీలో మాట్లాడేందుకే ప్రతిపక్ష హోదా అడిగాం

మద్యం కుంభకోణం పేరుతో అక్రమ అరెస్టులు
రాజ్యసభ సభ్యుడు వైవీ సుబ్బారెడ్డి

ఒంగోలు కలెక్టరేట్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : ప్రజాసమస్యలపై అసెంబ్లీలో ఎక్కువ సమయం మాట్లాడేందుకు ప్రతిపక్ష హోదా ఉంటేనే సాధ్యమవుతుందని, అందుకోసమే హైకోర్టును ఆశ్రయించామని రాజ్యసభ సభ్యుడు వైవీ సుబ్బారెడ్డి చెప్పారు. బుధవారం మధ్యాహ్నం స్థానిక లాయర్‌పేటలోని నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అసెంబ్లీలో మాట్లాడేందుకు ప్రస్తుత ప్రభుత్వం అవకాశం ఇచ్చే పరిస్థితి లేదన్నారు. ఒక ప్రతిపక్ష పార్టీగా ప్రజల సమస్యలను ప్రస్తావించాలంటే ఎక్కువ సమయం అవసరమన్నారు. అందుకోసమే వైసీపీ పోరాడుతోందని చెప్పారు. మద్యం కుంభకోణం పేరుతో అక్రమ కేసులు బనాయించి అరెస్టులు చేశారని ఆరోపించారు. మద్యం స్కాం జరగనప్పుడు ఎన్ని కేసులు పెట్టుకున్నా భయపడేది లేదని స్పష్టంచేశారు. తిరుమల దేవస్థానంలో గత వైసీపీ ప్రభుత్వంలో బంగారాన్ని దొంగతనాన్ని చేశారని మాట్లాడటం హాస్యాస్పదంగా ఉందన్నారు. దీనిపై అప్పట్లో రికవరీ కూడా చేశామని చెప్పారు. మెడికల్ కాలేజీలను ప్రైవేటీకరణ చేసేందుకు ప్రభుత్వం కుట్రపూరితంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. రానున్న రోజుల్లో వైసీపీ ప్రజా సమస్యల పరిష్కారం కోసం ముందుండి పోరాడుతుందన్నారు. కాగా ఒంగోలు వచ్చిన వైవీని ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు మర్యాదపూర్వకంగా కలిశారు.

ఆదాయమే లక్ష్యంగా సీనరేజీ వసూలు ప్రైవేటీకరణ

క్వారీ ఓనర్లతో అవగాహన సదస్సులో మైన్స్ డీడీ రాజశేఖర్



పాల్గొన్న మైన్స్ అధికారులు,ఓనర్లు,సంస్థ ప్రతినిధులు

చీమకుర్తి, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం ఆదాయ వనరులను పెంచుకోవటం కోసమే సీనరేజీ వసూలు బాధ్యతలను ప్రైవేటు వ్యక్తులకు అప్పజెప్పిందని మైన్స్ డీడీ రాజశేఖర్ చెప్పారు. సీనరేజి వసూలు అధికారం పొందిన ఏఎంఆర్ సంస్థ ప్రతినిధులు, గనులశాఖాధికారులు క్వారీ ఓనర్లకు సీనరేజి వసూలుపై అవగాహన కార్యక్రమాన్ని బుధవారం ఒంగోలులో నిర్వహించారు. ఈ సందర్భంగా డీడీ రాజశేఖర్ విధివిధానాలను వివరించారు. ఏఎంఆర్ సంస్థ ప్రతినిధులు మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనల మేరకు సీనరేజీ వసూలు ప్రక్రియను నిర్వహిస్తామన్నారు. క్వారీ ఓనర్లు తమ సందేహాలను అడిగారు. రికవరీ శాతంతో సంబంధం లేకుండా సీనరేజీ వసూలు చేస్తే ఇబ్బందులు ఎదురవుతాయని తెలిపారు.

వ్యాపారులపై సైబర్ వల

తాళ్లూరు ఏఎస్సైనంటూ ఫోన్
ప్రమాదంలో ఉన్న మహిళకు వైద్య చికిత్సల కోసం డబ్బులు సాయం
నమ్మి ఫోన్ పే చేసిన వైనం



తాళ్లూరు, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో మహిళ తీవ్రంగా గాయపడింది.. అత్యవసర చికిత్స చేయించాలి.. గాయపడ్డవారి వద్ద చేతిలో నగదు ఉంది.. ఫోన్‌పేలో డబ్బులు ఉంటే పంపండి అందజేస్తామని పోలీస్ శాఖకు చెందిన ఏఎస్‌ఐ ఆనందరెడ్డి పేరున వ్యాపారులకు ఫోన్ వచ్చింది. అది నమ్మి ఇద్దరు వ్యాపారులు సదరు వ్యక్తి ఫోన్‌పేకు రూ.లక్షా 35వేలు కొట్టి మోసపోయారు. ఈ ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. వివరాల్లో కెళ్తే... మూడు రోజుల క్రితం తాళ్లూరులోని విత్తనాల దుకాణం యజమాని పసుపుగంటి కోటిరెడ్డికి సాయంత్రం సమయంలో 8985776054 నంబర్ ద్వారా ఫోన్ వచ్చింది. తాను తాళ్లూరు పోలీస్ స్టేషన్‌లో ఏఎస్‌ఐనని, పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ మహిళ తీవ్రంగా గాయపడిందని, అత్యవసర చికిత్సకోసం వారి బంధువులు నగదు తీసుకువస్తున్నారని చెప్పి రూ.65వేలు పంపాలని చెప్పాడు. ఆ ఫోన్ నెంబర్ ట్రూకాలర్‌లో ఏఎస్సై ఆనంద రెడ్డి, తాళ్లూరు అని ఉంది. వ్యాపారి కోటిరెడ్డి తన వద్ద అంత డబ్బు లేక పోవటంతో స్నేహితుడు మోటార్ల కొట్టు శ్రీనివాసరెడ్డి ఫోన్ ద్వారా ఆ నంబర్‌కు డబ్బులు ఫోన్‌పే చేయించాడు. ఆ తర్వాత అతను నగదు పంపకపోవటంతో ఫోన్ చేయగా ఫోన్ స్విచ్ ఆఫ్ చేసి ఉంది. దీంతో డబ్బులు పోయాయని నిర్ధారించుకున్నాడు. అలాగే, మరుసటి రోజు అదేనంబర్ నుంచి తాళ్లూరులోని ఎరువుల దుకాణం వ్యాపారి మేడగం నాగిరెడ్డికి ఫోన్ వచ్చింది. రూ.70వేలు ఫోన్‌పే చేస్తే కానిస్టేబుల్ ద్వారా డబ్బులు పంపుతానని చెప్పాడు. వ్యాపారి తన వద్ద డబ్బులు లేకపోవటంతో కొత్తపాలెంకు చెందిన ధాన్యం వ్యాపారి నాగార్జునరెడ్డికి ఫోన్ చేసి విషయం చెప్పి తనకు ఫోన్ వచ్చిన నెంబర్ ఇచ్చాడు. దీంతో కొత్తపాలెం వ్యాపారి ఆ నంబర్‌కు ఫోన్ చేయగా.. అవతలి వ్యక్తి అదే కథ వినిపించాడు. పోలీసు శాఖకు చెందిన వ్యక్తి అని చెప్పినందున వారితో అవసరముంటుందన్న కారణంతో నాగార్జునరెడ్డి తన ఫోన్‌పే ద్వారా రూ.70వేలు పంపాడు. ఆ తర్వాత ఎంత సేపటికీ డబ్బులు పంపకపోవటంతో ఆందోళన చెందాడు. సదరు వ్యాపారులు పోలీస్ స్టేషన్ వద్దకు వెళ్లి ఆరా తీయగా ఆనందరెడ్డి అనే పేరుగల వ్యక్తి ఏఎస్సైగా లేడని వెల్లడికావటంతో లబోదిబోమన్నారు.

అమానుష ఘటనలను పునరావృతం కానివ్వొద్దు

గిద్దలూరు టౌన్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : ఆసుపత్రి మరుగుదొడ్డిలో పురిటి బిడ్డను వదిలివెళ్లిన ఘటన అమానుషమైనదని, ఇలాంటివి పునరావృతం కాకుండా మహిళలకు అవగాహన కల్పించాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జాడి శ్వేత అన్నారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న పసికందును ఆమె చూసి అవసరమైన దుస్తులు, ఇతర వస్తువులను చికిత్స చేస్తున్న డాక్టర్ సాయిసిసిర్‌కు అందజేశారు. ఈసందర్భంగా శ్వేత మాట్లాడుతూ పోలీసులు వెంటనే స్పందించి పసికందు తల్లిదండ్రులను గుర్తించి వారికి అప్పగించాలని లేదా ప్రభుత్వ సంరక్షణకు పంపించాలని కోరారు.

'థ్యాంక్యు లోకేశ్ సార్'

లోకేష్ చిత్రపటానికి పాలాభిషేకం చేసిన మెగా డీఎస్సీ విజేతలు



లోకేశ్ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న ఎంపీ మాగుంటతోపాటు టీఎస్‌యూఎస్ నేతలు

ఒంగోలు విద్య, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : మెగా డీఎస్సీలో టీచర్ పోస్టులకు ఎంపికైన అభ్యర్థులకు గురువారం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా నియామక పత్రాలు అందజేస్తున్న తరుణంలో బుధవారం తెలుగునాడు ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో థ్యాంక్యూ లోకేష్‌సార్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక రామనగర్‌లోని ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి కార్యాలయంలో టీఎన్‌యూఎస్ ఆధ్వర్యంలో ఎంపీ చేతుల మీదుగా విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ చిత్రపటానికి పాలాభిషేకం చేయించారు. ఈసందర్భంగా ఎంపీ మాట్లాడుతూ రాష్ట్రంలో అత్యధిక డీఎస్సీల ద్వారా 2.5 లక్షల మంది ఉపాధ్యాయుల నియామకాలు చేపట్టిన ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబుకు దక్కుతుందన్నారు. టీఎన్‌యూఎస్ రాష్ట్ర అధ్యక్షుడు మన్నం శ్రీనివాస్ మాట్లాడుతూ మెగా డీఎస్సీ ఎన్నికలహామీ అమలులో ప్రభుత్వం చిత్తశుద్ధితో వ్యవహరించిందన్నారు. అనంతరం క్విస్ ఇంజనీరింగ్ కళాశాలలో డీఎస్సీ విజేతలను కలిసి అభినందించారు. ఈ కార్యక్రమంలో నాయకులు పూర్ణచంద్రరావు, ఎం. రాంబాబు, రహమాన్, రవీంద్ర, శ్రీనివాసరావు, నాగేశ్వరరావు, సుబ్బారావు, రఘు తదితరులు ఉన్నారు.

పంచాయతీ నిధుల దుర్వినియోగంపై మళ్లీ విచారణ

గతంలో ఫిర్యాదుదారుడికి సమాచారం ఇవ్వకుండా ముగింపు
గ్రీవెన్స్‌లో మళ్లీ ఫిర్యాదుతో డీఎల్‌పీవో ఎంక్వైరీ



విచారణ చేపడుతున్న డీఎల్‌పీవో పద్మ

సంతనూతలపాడు, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి) : సంతనూతలపాడు పంచాయతీలో నిధుల దుర్వినియోగంపై బుధవారం డీఎల్‌పీవో పద్మ విచారణ ప్రారంభించారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో 2019-24 వరకు పంచాయతీలో జరిగిన నిధుల దుర్వినియోగంపై గత జూన్ నెల 23న కలెక్టరేట్‌లో జరిగిన గ్రీవెన్స్‌లో టీఎన్‌టీయూసీ మండల అధ్యక్షుడు మందాడి వెంకటేశ్వర్లు ఫిర్యాదు చేశాడు. ఇటీవల ఉద్యోగోన్నతిపై నెల్లూరుకు బదిలీపై వెళ్లిన ఈవోఆర్డీ రమణమ్మను సంతనూతలపాడు పంచాయతీ నిధుల దుర్వినియోగంపై ఫిర్యాదుదారుని సమక్షంలో విచారణ చేపట్టాలని ఉన్నతాధికారులు ఆదేశాలు ఇచ్చారు. అప్పటి ఈవోఆర్డీ రమణమ్మ, ఫిర్యాదుదారుడికి ఎటువంటి సమాచారం ఇవ్వకుండా నిధులు దుర్వినియోగం కాలేదని విచారణ ముగించివేసింది. దీంతో ఫిర్యాదుదారుడు వెంకటేశ్వర్లు తనకు ఎటువంటి సమాచారం ఇవ్వకుండా విచారణ ముగించడంపై మరళ ఈనెల 8న కలెక్టరేట్ నందు జరిగిన గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేశాడు. ఈక్రమంలో బుధవారం విచారణకు వచ్చిన డీఎల్‌పీవో పద్మ విచారణ చేపట్టారు. విచారణ సమయంలో నిధులు ఖర్చుల వివరాలకు సంబంధించి రికార్డులను అడుగగా పంచాయతీ కార్యదర్శి ప్రతాప్‌కుమార్ సమయం కావాలని కోరారు. ఈ సందర్భంగా డీఎల్‌పీవో మాట్లాడుతూ పంచాయతీ నిధుల దుర్వినియోగంపై విచారణకు సంబంధించిన రికార్డులు శనివారంలోపు పంచాయతీ తీర్మానాలు, ఎంబుక్‌లు, పంచాయతీ రశీదులు, పారిశుధ్యకార్మికులకు జీతాలు ఇచ్చిన రశీదులు, పనులకు సంబంధించి అంచనా పత్రాలు ఇవ్వాలని పంచాయతీ కార్యదర్శి ప్రతాప్‌ను ఆదేశించింది. సోమవారం విచారణకు వస్తానని ఆరోజు విచారణ సమయంలో సంబంధించిన రికార్డులన్నీ ఉండాలని పంచాయతీ కార్యదర్శిని ఆదేశించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు బి.యలమంద, పిఎస్.నారాయణచౌదరి, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి అవసరాలపై ప్రత్యేక దృష్టి సారించాలి

ఒంగోలు కలెక్టరేట్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : ఒంగోలు నగరపాలక సంస్థతో పాటు అన్ని మునిసిపాలిటీల్లో తాగునీటి అవసరాలు తీర్చేందుకు దృష్టి సారించాలని కలెక్టర్ రాజాబాబు ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లో బుధవారం సాయంత్రం జేసీ గోపాలకృష్ణతో కలిసి ఒంగోలు పట్టణాభివృద్ధి సంస్థ అధికారులు, పబ్లిక్ హెల్త్, జిల్లాలోని అన్ని మునిసిపాలిటీల కమిషనర్లతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తాగునీటి అవసరాలను తీర్చేందుకు చేపట్టిన పనుల పురోగతిపై ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. ప్రధానంగా సాలిడ్ వేస్ట్, లిక్విడ్ వేస్ట్, డ్రై వేస్ట్ నిర్వహణపై చర్యలు తీసుకోవాలని చెప్పారు. నేషనల్ క్లీన్ ఎయిర్ కార్యక్రమం కింద చేపట్టిన పనులను త్వరగా పూర్తిచేయాలన్నారు. ఒంగోలులోకి ప్రవేశించే ప్రదేశాన్ని పూర్తి స్థాయిలో సుందరీకరణంగా అభివృద్ధి చేసేలా ప్రతిపాదనలు రూపొందించాలని కమిషనర్ వెంకటేశ్వరరావును ఆదేశించారు.

వైసీపీ పాలకులకు పశ్చిమ ప్రజలు గుర్తుకు రాలేదా..?

వెలిగొండను ఎందుకు విస్మరించారు



మాట్లాడుతున్న బీజేపీ నాయకులు కృష్ణారావు

మార్కాపురం, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): మీ పాలనలో వెనుకబడిన ప్రాంతమైన పశ్చిమ ప్రకాశం ప్రజలు గుర్తుకు రాలేదా అని బీజేపీ నాయకుడు పీవీ కృష్ణారావు వైసీపీ నేతలను ప్రశ్నించారు. దోర్నాల బస్టాండ్‌లోని బీజేపీ పట్టణ పార్టీ కార్యాలయంలో బుధవారం జరిగిన విలేకరుల సమావేశంలో కృష్ణారావు మాట్లాడారు. ముఖ్యంగా నాడు అవకాశం ఉండి మార్కాపురాన్ని ఎందుకు జిల్లాగా చేయలేదని, వెలిగొండ ప్రాజెక్టును ఎందుకు పూర్తి చేయలేదని ప్రశ్నించారు. నాడు అభివృద్ధిని పూర్తిగా విస్మరించి నేడు ప్రజాప్రభుత్వంపై నిందలు వేయడం సిగ్గుచేటని కృష్ణారావు చెప్పారు. మెడికల్ కాలేజీని మీరే పూర్తిచేసి అడ్మిషన్లు ప్రారంభించి ఉంటే అడ్డుకునేవారెవరన్నారు. అమరావతి నుంచి అనంతపురం ఎక్స్‌ప్రెస్ హైవేను అడ్డుకున్నది నాటి వైసీపీ కాదా అన్నారు. నేడు ప్రెస్‌మీట్‌లు పెట్టి అవినీతి, అక్రమాలు అంటూ వైసీపీ నాయకులు చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. సమావేశంలో బీజేపీ పట్టణ పార్టీ అధ్యక్షుడు పాదర్తి అంజనేయులు, మండల పార్టీ అధ్యక్షుడు శేషిరెడ్డి, గురునాథం, సుజాత పాల్గొన్నారు.

బాలబాలికలకు అవగాహన కల్పించాలి

మార్కాపురం వన్‌టౌన్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : అంగన్‌వాడీ కార్యకర్తలు బాలబాలికలకు సమాజంలో జరుగుతున్న వివిధ అంశాలపై అవగాహన కల్పించాలని సబ్ కలెక్టర్ వెంకట్ త్రివినాగ్ చెప్పారు. ప్రెస్‌క్లబ్‌లో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో డివిజనల్ స్థాయి పోషకాహార వారోత్సవాల సందర్భంగా బాలల హక్కులు మహిళ సాధికారిక రక్షణపై బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన సబ్ కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రతి ఒక్క అధికారి హాస్టల్‌ను తనిఖీ చేసి వార్డెన్, పనిచేసే సిబ్బంది లేకుండా బాలికలతో వ్యక్తిగతంగా మాట్లాడాలన్నారు. ప్రతి హాస్టల్‌లో ఎన్నో సమస్యలు ఉన్నాయని, తాను కొన్ని హాస్టల్‌ను స్వయంగా తనిఖీలు చేసినప్పుడు తన దృష్టికి పిల్లలు పలు సమస్యలు తెచ్చారన్నారు. వివిధ పాఠశాలల వద్ద బాలికలను ఈవ్‌టీజింగ్ చేసే వాళ్లను కనిపెట్టి శిక్షలు వేయాలన్నారు. వివిధ సమస్యలపై సబ్ కలెక్టర్ వివరించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ త్రివినాగ్


కలెక్టర్‌కు పూలబొకే అందజేస్తున్న ఎమ్మెల్యే బీఎన్ విజయ్‌కుమార్

కలెక్టర్‌ను కలిసిన ఎమ్మెల్యే బీఎన్

ఒంగోలు కలెక్టరేట్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : కలెక్టర్ రాజాబాబును సంతనూతలపాడు శాసనసభ్యుడు బీఎన్ విజయకుమార్ బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కలెక్టర్‌కు బొకే ఇచ్చి అభినందించారు. అనంతరం సంతనూతలపాడు నియోజకవర్గానికి సంబంధించిన పలు అంశాలపై ఎమ్మెల్యే విజయకుమార్ కలెక్టర్‌తో చర్చించారు.

కలెక్టర్‌కు అభినందనలు

కలెక్టర్ పీ రాజాబాబును ప్రభుత్వవాహనాల డ్రైవర్ల సంఘం నాయకులు బుధవారం బొకే ఇచ్చి అభినందించారు. స్థానిక కలెక్టరేట్‌లోని చాంబర్‌లో సంఘం జిల్లా అధ్యక్షుడు వి. ప్రసన్నకుమార్ ఆధ్వర్యంలో సంఘం ప్రతినిధులు కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగాకలిశారు. ఈసందర్భంగా బొకే ఇచ్చి అభినందించారు. అనంతరం జిల్లాలో ప్రభుత్వ డ్రైవర్లు ఎదుర్కొంటున్న పలు సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. ఈకార్యక్రమంలో సంఘం గౌరవాధ్యక్షుడు వి.సతీష్‌బాబు, కోశాధికారి ఎస్. రాఘవ, అసోసియేట్ అధ్యక్షుడు ఏడుకొండలు, పోల్‌రాజు, రమణబాబు,నాసరయ్య తదితరులు ఉన్నారు.


బీసీ సంక్షేమశాఖ కార్యాలయంలో చర్చా వేదికలో ప్రభుత్వ ఉద్యోగుల సంఘం నాయకులు

ఉద్యోగుల బకాయిలను చెల్లించాలి

ఒంగోలు కలెక్టరేట్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ ఉద్యోగులకు చెల్లించాల్సిన బకాయిలను ప్రభుత్వం వెంటనే చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు చిన్నపురెడ్డి కిరణ్‌కుమార్‌రెడ్డి కోరారు. సంఘం ఆధ్వర్యంలో బుధవారం జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమశాఖ కార్యాలయంలో జరిగిన చర్చా కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ ఉద్యోగులకు రావాల్సిన బకాయిలు పెండింగ్‌లో ఉండటంతో ఉద్యోగులు తీవ్ర ఆందోళనలో ఉన్నారన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి వెంటనే ఉద్యోగులకు చెల్లించాల్సినబకాయిలను చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి వరకుమార్, షర్మిల, సంధ్యారాణి, అంకబాబు, ఆంజనేయులు, ప్రసాద్, రహమతుల్ల, ఎం. శ్రీనివాసరావు తదితరులు ఉన్నారు.

ఉద్యోగోన్నతులకు నియామక పత్రాలు అందజేత

ఒంగోలు కలెక్టరేట్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : జిల్లా గ్రామ పంచాయతీపరిధిలో గ్రేడ్-5 పంచాయతీ కార్యదర్శులుగా పనిచేస్తూ గ్రేడ్-4 కార్యదర్శులుగా ఉద్యోగోన్నతులు పొందిన కార్యదర్శులకు కలెక్టర్ పీ రాజాబాబు నియామక పత్రాలను అందజేశారు. బుధవారం రాత్రి స్థానిక కలెక్టర్ చాంబర్‌లో ఈ పదోన్నతుల పత్రాలను అందజేశారు. గ్రేడ్-5గా కార్యదర్శులుగా పనిచేస్తున్న 100 మంది కార్యదర్శులకు ఇటీవల కౌన్సెలింగ్ నిర్వహించారు. బుధవారం రాత్రి కలెక్టర్‌చేతుల మీదుగా 88 మంది కార్యదర్శులకు ఉద్యోగోన్నతి పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వరరావు తదితరులు ఉన్నారు.

విద్యార్థులు సామాజిక బాధ్యతను కలిగి ఉండాలి

ఒంగోలు కలెక్టరేట్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు సామాజిక బాధ్యతను కలిగి ఉండాలని ఆంధ్రకేసరి యూనివర్శిటీ వీసీ డీవీఆర్ మూర్తి అన్నారు. ఎన్ఎస్ఎస్ ఆవిర్భావ వేడుకలను పురస్కరించుకొని యూనివర్శిటీ సమావేశపు హాలులో బుధవారం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రతిఒక్కరూ సమాజసేవలో భాగస్వాములై సంక్షేమం కోసం పాటుపడాలన్నారు. ఏకేయూ రిజిస్ట్రార్ హరిబాబు మాట్లాడుతూ ఎన్ఎస్ఎస్ కార్యక్రమాల్లో భాగంగా పర్యావరణపరిరక్షణ, యాంటీ డ్రగ్స్ యాంటీర్యాగింగ్ వంటి కార్యక్రమాలు చేపడుతూ సమాజ సేవలో భాగస్వాములు కావడం అభినందనీయమన్నారు. ఎన్ఎస్ఎస్ సమన్వయకర్త డాక్టర్‌మండే హర్షప్రీతమ్‌దేవ్‌కుమార్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ నిర్మలామణి, ప్రోగ్రామ్ ఆఫీసర్ రాజేంద్రప్రసాద్ ఉన్నారు.


ఎమ్మెల్యే జనార్దన్ సతీమణి నాగసత్యలతను సన్మానిస్తున్న స్కూలు యాజమాన్యం

హెచ్‌పీఎస్‌లో ముందస్తు దసరా వేడుకలు

ఒంగోలు కార్పొరేషన్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని హైదరాబాదు పబ్లిక్ స్కూలులో ముందస్తు దసరా వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. పాఠశాలలో ఏర్పాటుచేసిన వేడుకలకు ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ సతీమణి నాగసత్యలత ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కార్యక్రమంలో భాగంగా మామ్ అండ్ బేబీ, బ్యూటీఫుల్ ఫ్యామిలీ, బ్యూటీఫుల్ కపుల్ పోటీలు, ఇతర సాంస్కృతిక కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. అనంతరం పోటీలలో విజేతలైనవారికి నాగసత్యలత బహుమతి ప్రదానం చేశారు. స్కూలు డైరెక్టర్ జగదీష్, దుర్గా, ప్రిన్సిపాల్స్ మహేష్, అపర్ణ, పలువురు ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

ఒంగోలుక్రైం, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): నగరంలో బుధవారం విద్యుత్ మరమతుల కారణంగా ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటలవరకు కొన్ని ప్రాంతాలలో విద్యుత్ నిలిపివేస్తున్నట్లు ఆ శాఖ డీఈ కేవీపీ రంగారావు తెలిపారు. కర్నూల్‌రోడ్డ్, శ్రీనగర్ కాలనీ, భారత్ పెట్రోల్ బంకు, ఉడ్‌కాంప్లెక్స్, వెంకటేశ్వరకాలనీ, చంద్రయ్యనగర్, ఎన్‌జీవో కాలనీలలో విద్యుత్ అంతరాయం ఉంటుందని అన్నారు. వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

అన్నపూర్ణా దేవి పాలయమాం

లలితా సహస్రపారాయణం, కుంకుమ పూజలు

ఒంగోలు కల్చరల్, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి):దసరా శరన్నవరాత్రి ఉత్సవాలలో మూడవ రోజైన బుధవారం అమ్మవారు అన్నపూర్ణ దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా పలు దేవాలయాలలో మహిళలు లలితా సహస్రనామ పారాయణం చేయగా, ప్రత్యేక కుంకుమార్చనలు జరిగాయి.

ఒంగోలు నగరంలోని కేశవస్వామిపేట శ్రీ విజయదుర్గాదేవి దేవస్థానం, శ్రీ ప్రసన్న చెన్నకేశవ స్వామి దేవస్థానం, గంటాపాలెం పార్వతీ దేవస్థానం, బాలాజీరావుపేట శ్రీ పోలేరమ్మ, శ్రీ మహాలక్ష్మి దేవస్థానం, గద్దలగుంట శ్రీ రాజరాజేశ్వరి దేవి త్రిశక్తిపీఠం, మంగమూరు రోడ్డు అచలానంద ఆశ్రమం, కొత్తపట్నం రోడ్డు శ్రీ లక్ష్మీనారసింహ స్వామి శ్రీ బాలా త్రిపురసుందరి దేవి ఆలయం, అమలనాథుని వారి వీధి శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవస్థానం, సంతపేట, లాయ


బాలాజీరావుపేటలో అన్నపూర్ణాదేవిగా పోలేరమ్మ

రోపేట సాయిబాబా మందిరాలలో అమ్మవారికి ప్రత్యేక అలంకరణలు, విశేష కుంకుమార్చనలు


లాయర్‌పేట సాయిబాబా మందిరంలో విశేష అలంకరణ

జరిగాయి. అటు స్థానిక శ్రీ చెన్నకేశవ స్వామి దేవస్థానంలో అమ్మవారు ధైర్యలక్ష్మి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. కాగా ఇక్కడ స్వామివారి మాస కల్యాణం వైభవంగా జరిగింది.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

దసరా శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా వివిధ దేవాలయాలలో ఏర్పాటు చేసిన భక్తిభరిత సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను విశేషంగా అలరించాయి. స్థానిక కేశవస్వామిపేట లలితాశ్రమంలో గాయత్రి వైభవం గురించి ప్రముఖ ప్రవచకులు కొప్పోలు ఫణిరాజ్ చేసిన ఆధ్యాత్మిక ఉపన్యాసం భక్తులను విశేషంగా అలరించింది. అటు అమలనాథుని వారి వీధి శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి దేవస్థానంలో ప్రత్యేక భజన కార్యక్రమం, శ్రీ వాసవి కోలాట భజన మండలి మహిళలచే గుడి ఉత్సవం అత్యంత శోభాయమానంగా జరిగింది. పెద్దసంఖ్యలో ఆర్యవైశ్యులు కుటుంబసమేతంగా పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు.


వాసవి దేవస్థానంలో అన్నపూర్ణాదేవిగా..


విజయదుర్గాదేవి ఆలయంలో ..

నాణ్యమైన పొగాకు నారు నాటుకోవాలి

వేలం నిర్వహణాధికారి తులసి

ఒంగోలు(రూరల్), సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): పొగాకు రైతులు నాణ్యమైన నారును నాటుకోవాలని ఒంగోలు పొగాకు బోర్డు రెండు వేలం నిర్వహణాధికారి జె. తులసి స్పష్టంచేశారు. ఒంగోలు పొగాకు వేలంకేంద్రం రెండుపరిధిలోని ఓబన్నపాలెం గ్రామంలో బుధవారం పొగాకు సాగు, ప్రత్యామ్నాయ పంటల సాగుపై రైతులతో సమావేశం జరిగింది. ఈ సమావేశంలో వేలం నిర్వహణాధికారి మాట్లాడుతూ పొగాకు సాగు చేయు రైతులు తప్పక పొగాకు బోర్డు నియంత్రణలు పాటించాలన్నారు. రైతులు తప్పక పొగ నారు కొనుగోలు చేసిన వారి నుంచి రశీదు పొందాలన్నారు. ఆ రశీదు జిరాక్స్ కాపీని వేలం కేంద్రంలో ఇవ్వాలన్నారు. రైతులు బోర్డు అనుమతి ఉన్న నారుమళ్ల వ్యాపారి నుంచి నారు కొనుగోలు చేయాలన్నారు. భూములు,బ్యారన్‌లు ఎక్కువ ధరలకు కౌలుకు తీసుకొని సాగు చేసిన ష్టపోవద్దని ఆమె సూచించారు. కార్యక్రమంలో ఐటీసీ శాస్త్రవేత్త వెంకటేశ్వరరావు రైతులకు తగుసూచనలు, సలహాలను వివరించారు. ఈకార్యక్రమంలో జీపీఐ మేనేజర్ శ్రీనివాసరావు, ప్రతినిధి కిశోర్, గ్రామరైతులు పాల్గొన్నారు.

చింతలపాలెం అభివృద్ధిలో చెంచురామానాయుడి కృషి మరువలేనిది

జరుగుమల్లి (కొండపి), సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : చింతలపాలెం గ్రామాభివృద్ధికి బెల్లం చెంచురామానాయుడు చేసిన కృషి మరువలేనిదని ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి అన్నారు. బుధవారం చింతలపాలెంలో జరిగిన చెంచురామానాయుడు దశదిన కర్మలో ఎంపీతోపాటు మాజీ ఎమ్మెల్యే పోతుల రామారావు, టీడీపీ జిల్లా సీనియర్ నాయకుడు దామచర్ల పూర్ణచంద్రరావు పాల్గొన్నారు. చెంచురామానాయుడు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో విద్యుత్‌శాఖ ఎస్ఈ కట్టా వెంకటేశ్వర్లు, టీడీపీ మండల అధ్యక్షుడు పోకూరి రవీంద్రబాబు, సీనియర్ నాయకుడు పోటు శ్రీనివాసమురళి, కామేపల్లి మాజీ సర్పంచ్ ఏలూరి రాంబాబు, పైడిపాడు సర్పంచ్ నాగినేని భాస్కర్‌చౌదరి, నాయకులు వాకా సంజీవరెడ్డి, శంకర్‌రెడ్డి, కొండపి ఏఎంసీ మాజీ ఛైర్మన్ గొర్రెపాటి రామయ్యచౌదరి, టీడీపీ టంగుటూరు మండల నాయకులు బెల్లం జయంత్‌బాబు, బెజవాడ వెంకటేశ్వర్లు, టంగుటూరు, కొండపి, జరుగుమల్లి పీఏసీఎస్‌ల ఛైర్మన్‌లు మక్కెన హరిబాబు, రావెళ్ల రఘునాథ్‌బాబు, నలమోతు వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.


నివాళులర్పిస్తున్న ఎంపీ మాగుంట, దామచర్ల పూర్ణచంద్రరావు తదితరులు

మహిళ అనుమానాస్పద మృతి

హత్య కోణంలో పోలీసుల విచారణ

చీమకుర్తి,సెప్టెంబరు24(ఆంధ్రజ్యోతి): మండలంలోని దేవరపాలెం పంచాయతీ పరిధిలోని ఊబచెత్తపాలెం గ్రామంలో బుధవారం మహిళ అనుమానాస్పద స్థితిలో మృతిచెందటం గ్రామంలో కలకలం రేపింది. పోలీసులు తెలిపిన మేరకు వివరాల మేరకు.. గ్రామానికి చెందిన వెంకటరమణమ్మ(35) అనే మహిళ బుధవారం సాయంత్రం తన ఇంట్లో మంచం మీద మెడకు చీరను చుట్టుకుని కొన ఊపిరితో ఉందని, ఆ స్థితిలో అప్పుడే ఆమె ఇంటికి వెళ్లిన తాను చీమకుర్తి ప్రైవేటు ఆసుపత్రికి తీసుకెళ్లానని, అక్కడ వైద్యులు మృతిచెందిందని తెలుపటంతో తిరిగి ఇంటికి తీసుకువచ్చానని అదే గ్రామానికి చెందిన రాజశేఖరరెడ్డి అనే మృతురాలకు దూరపు బంధువు పోలీసులకు వాంగ్మూలం ఇచ్చాడు.

ఈ మేరకు ఎస్ఐ కృష్ణయ్య తన సిబ్బందితో కలిసి సంఘటనా స్థలాన్ని,మృతురాలు రమణమ్మ మృతదేహాన్ని పరిశీలించారు.మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించారు.కేసు నమోదుచేసి విచారణ జరుపుతున్నారు.

జనసైనికుల సంబరాలు

- కేక్ కట్ చేసి టపాసులు పేల్చి సంబరాలు


రవిప్రియామాల్ వద్ద కేక్‌కట్ చేస్తున్న ఒడా ఛైర్మన్ రియాజ్, రవిశంకర్ గ్రూప్ అధినేత కంది రవిశంకర్

ఒంగోలు కలెక్టరేట్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : జనసేన పార్టీ అధ్యక్షుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ నటించిన ఓజీ సినిమా విడుదల సందర్భంగా జనసేన పార్టీ నేతలు సంబరాలు నిర్వహించారు. ఒంగోలులోని రవిప్రియామాల్ వద్ద బుధవారం రాత్రి భారీ కేక్ కట్ చేసి బాణసంచా పేల్చి సంబరాలు నిర్వహించారు. జనసేన పార్టీ జిల్లా అధ్యక్షుడు, ఒడా ఛైర్మన్ షేక్ రియాజ్, రవిశంకర్ గ్రూప్ అధినేత, జనసేన నాయకుడు కంది రవిశంకర్‌లు కేక్ చేశారు. జనసైనికులతో కలిసి సంబరాలు నిర్వహించారు. జనసేన నాయకుడు పర్వతరెడ్డి కిషోర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకల్లో ఆ పార్టీ నాయకులు,మహిళా కార్యకర్తలు భారీగా పాల్గొన్నారు.

సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ

సంతనూతలపాడు, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): ఒంగోలులో ఎమ్మెల్యే బీఎన్ విజయ్‌కుమార్ నివాసంలో బుధవారం ముఖ్యమంత్రి సహాయనిధి కింద 15 మంది లబ్ధిదారులకు రూ.10.10 లక్షలను చెక్కుల రూపంలో అందజేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షులు మద్దినేని హరిబాబు, టీడీపీ వర్కింగ్ పెసిడెంట్ అబ్బూరి శ్రీనివాసరావు, సిండికేట్ రైతు సొసైటీ డైరెక్టర్ మల్లవరపు రామకృష్ణారెడ్డి, తిరుపతిస్వామి, గోపి, అనిల్ పాల్గొన్నారు.

జాయ్ ఆసుపత్రిలో చోరీ

ఒంగోలుక్రైం, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): జాయ్ ఆసుపత్రిలో దుండగుడు చోరీకి పాల్పడి రూ. 80 వేలు నగదు అపహరించుకెళ్లాడు. మంగళవారం తెల్లవారు జామున స్థానిక జాయ్ ఆసుపత్రిలో ఈ ఘటన చోటు చేసుకుంది. తనకు కడుపులో నొప్పిగా ఉందని ఆసుపత్రిలోకి వచ్చిన దుండగుడు మెడికల్ షాప్ తాళం తీయించి టాబ్లెట్ తీసుకున్నాడు. అనంతరం మెడికల్ షాప్‌లో పనిచేసే యువతి గుర్తు తెలియని వ్యక్తికి టాబ్లెట్ ఇచ్చిన తరువాత షాప్ తాళం వేసుకొని, తాళాలు టేబులుపై పెట్టి ఆమె నిద్ర పోయింది. గుర్తు తెలియని వ్యక్తి అక్కడే వేచి ఉండి తెల్లవారు జామున 3 గంటల సమయంలో అక్కడ ఉన్న తాళంతో తలుపులు తెరిచి మెడికల్ షాప్‌లో ఉన్న రూ. 80 వేలు నగదు అపహరించుకెళ్లాడు. ఈ మేరకు ఒంగోలు టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

శ్రీహర్షిణీలో ఘనంగా ఎన్ఎస్ఎస్ డే

ఒంగోలు విద్య, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : స్థానిక శ్రీహర్షిణీ మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో బుధవారం జాతీయ సేవా పథకం(ఎన్ఎస్ఎస్) డేను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినులు కళాశాల ప్రాంగణాన్ని శుభ్రం చేశారు. ఛైర్మన్ గోరంట్ల రవికుమార్ విద్యార్థినులకు జాతీయ సేవా పథకంపై అవగాహన కల్పించారు. విద్యార్థినులు సేవా కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొని సమాజాభివృద్ధిలో తమవంతు పాత్ర పోషించాలన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ జి. హర్షిత, వైస్ ప్రిన్సిపాల్ సుధీర్ చక్రవర్తి, ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్ టి. రామపిచ్చయ్య, అధ్యాపకులు ఉమాదేవి, ఏ పద్మ, సుల్తానా, అనురాధ తదితరులు ఉన్నారు.

మునిసిపల్ కార్మికుల నిరసన

ఒంగోలు కార్పొరేషన్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : పారిశుధ్య కార్మికులపై పని భారం తగ్గించాలని డిమాండ్ చేశారు. ఏపీ మునిసిపల్ వర్కర్స్, ఎంప్లాయిస్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో బుధవారం 3వ డివిజన్‌లోని మస్టర్‌పాయింట్ వద్ద నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు చీకటి శ్రీనివాసరావు మాట్లాడగా సీఐటీయూ నగర కన్వీనర్ టి. మహేష్, యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు జి.నరసింహ, డి. వరణ తదితరులు పాల్గొన్నారు.

క్విస్‌లో ముగిసిన కబడ్డీ శిక్షణ

ఒంగోలు విద్య, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : స్థానిక క్విస్ ఇంజనీరింగ్ కళాశాలలో జిల్లా అండర్ 18 కబడ్డీ జట్టు శిక్షణ శిబిరం బుధవారం ముగిసింది. అండర్ 18 కబడ్డీ రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొనే జిల్లా జట్టుకు ఈ నెల 21నుంచి ఇక్కడ శిక్షణ ఇచ్చారు. జిల్లా జట్టుతో పాటు కొందరు క్విస్ ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులకు కూడా కబడ్డీలో శిక్షణ ఇచ్చి ఆటలో మెలకువలు నేర్పించారు. జిల్లా జట్టు శిక్షణకు అవసరమైన అన్ని వసతులు, సౌకర్యాలను క్విస్ కళాశాల యాజమాన్యం సమకూర్చింది. శిక్షణ ముగింపు సందర్భంగా బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో కళాశాలలో అన్ని వసతులు కల్పించినందుకు క్విస్ విద్యా సంస్థల అధినేత నిడమానూరి సూర్య కల్యాణ్ చక్రవర్తి, ఎగ్జిక్యూటివ్ వైస్ ఛైర్మన్ డాక్టర్ శ్రీ గాయత్రిలకు కబడ్డీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు కే భాస్కరరావు కృతజ్ఞతలు తెలిపారు. అసోసియేషన్ నాయకులు వై.పూర్ణచంద్రరావు, సుబ్బారావు, కే రమేష్ ఉన్నారు.


ఉద్యోగ విరమణ చేయనున్న సుబ్బమ్మను సన్మానిస్తున్న సమాచార శాఖ ఉద్యోగులు, సిబ్బంది

సమాచార శాఖ ఉద్యోగినికి ఘన సన్మానం

ఒంగోలు కలెక్టరేట్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : సమాచార శాఖలో 38 ఏళ్లకు పైగా పనిచేసి ఈనెలాఖరులో ఉద్యోగ విరమణ చేయనున్న సుబ్బమ్మను సమాచార. పౌరసంబంధాలశాఖ అధికారులు ఘనంగా సన్మానించారు. బుధవారం డీపీఆర్వో కార్యాలయంలో జరిగిన సన్మాన కార్యక్రమంలో పలువురు మాట్లాడుతూ టైపిస్టుగా, సీనియర్ అసిస్టెంట్‌గా నెల్లూరు ప్రకాశం జిల్లాలో ఆమె అందించిన సేవలను కొనియాడారు. ఈకార్యక్రమంలో రీజనల్ జాయింట్‌డైరెక్టర్ టి. కస్తూరిబాయి, డీపీఆర్వో రమేష్, డివిజనల్ పీఆర్వో దుర్గా ప్రసాద్ తదితరులు ఉన్నారు.

ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ఎంఎస్సీ కంప్యూటర్ కోర్సు

ఒంగోలు విద్య, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : ఒంగోలులోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో 2025-26 విద్యా సంవత్సరానికి ఎంఎస్సీ కంప్యూటర్ సైన్స్ కోర్సులో అడ్మిషన్లు జరుగుతున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డి.కళ్యాణి ఒక ప్రకటనలో తెలిపారు. పీజీసెట్ అర్హత సాధించిన వారు కళాశాలలో ప్రవేశం కోసం ఈనెల 27లోపు వెబ్‌సైట్‌లో ఆప్షన్లు పెట్టుకోవాలని కోరారు. ఈ కళాశాలలో ఆ కోర్సులో చేరే వారికి ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ సౌకర్యం కల్పించినట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని విద్యార్థినులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.


జేసీ గోపాలకృష్ణను మర్యాదపూర్వకంగా కలిసి పూలమొక్కను అందజేస్తున్న పీడీసీసీ బ్యాంకు ఛైర్మన్ సీతారామయ్య, బ్యాంక్ సీఈవో డీవీ శర్మ

రీ సర్వేలో జరిగిన లోపాలను సవరించాలి

ఒంగోలు కలెక్టరేట్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని పలు ప్రాంతాల్లో భూముల రీ సర్వేలో అనేక లోపాలు జరిగాయని, వాటిని సవరించే విధంగా చర్యలుతీసుకోవాలని పీడీసీసీ బ్యాంకు ఛైర్మన్ డాక్టర్ కామేపల్లి సీతారామయ్య కోరారు. బుధవారం కలెక్టరేట్‌లోని జేసీ గోపాలకృష్ణను మర్యాదపూర్వకంగా కలిశారు.ఈసందర్భంగా జేసీకి మొక్క ఇచ్చి అభినందించారు. రీ సర్వేలో ఆ భూములను ఇనాం భూములు, రైతువారీ పట్టాగా రెవెన్యూ రికార్డుల్లో చూపించారన్నారు. దాని వల్ల రైతులు వారి భూములను తనఖా పెట్టుకొని రుణం తీసుకొనే వీలు లేక నానా ఇబ్బందులు పడుతున్నారని, అందువల్ల ఆ సమస్యను పరిష్కరించాలని కోరారు. జిల్లాలో పీడీసీసీ బ్యాంకుకు 34 బ్రాంచీలు ఉండగా 30 బ్రాంచిలు అద్దెభవనాల్లో ఉన్నాయని జేసీ దృష్టికి తెచ్చారు. బ్యాంకు కార్యకలాపాలు నిర్వహించేందుకు ఆభవనాల్లో ఇబ్బందికరంగా ఉన్నందున అందుబాటులో ఉన్న ప్రాంతాల్లో ప దిసెంట్ల భూమిని కేటాయించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం అందుకు సంబంధించిన అంశాలపై వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు సీఈవో పోలూరి డీవీ శర్మ ఉన్నారు.


మల్లవరం వేంకటేశ్వరస్వామి ఆలయంలో రఘుబాబుతో జనసేన జిల్లానేత, మద్దిపాడు టీడీపీ నాయకులు

మల్లవరం దేవస్థానం అభివృద్ధికి సహకారం

● సినీనటుడు రఘుబాబు

మద్దిపాడు,సెప్టెంబరు24(ఆంధ్రజ్యోతి): మల్లవరం దేవస్థానం అభివృద్ధికి తన వంతుసహకారం అందిస్తానని సినీనటుడు రఘుబాబు అన్నారు.బుధవారం మల్లవరం రిజర్వాయర్ దగ్గర గల వేంకటేశ్వరస్వామివారి దేవాలయంలో స్వామివారిని ఆయనతోపాటు జనసేన పార్టీ నాయకుడు, ఒడా ఛైర్మన్ రియాజ్ దర్శించుకున్నారు. ఈసందర్భంగా రఘుబాబు మాట్లాడుతూ మల్లవరం దేవాలయం దినదినాభివృద్ధి చెందుతోందన్నారు. అదేక్రమంలో దేవాలయ వసతులు కూడా మెరుగు పడాల్సిఉన్నదన్నారు. ఆలయానికి వచ్చే భక్తులు కూడా భారీగా పెరిగారన్నారు. ఈ కార్యక్రమంలో దేవాలయ ట్రస్ట్ బోర్డు ఛైర్మన్ మార్నేని రాఘవేంద్రరావు, దొడ్డవరం పీఏసీఎస్ అధ్యక్షుడు సుబ్బారావు, శ్రీవారి వనం కమిటీ సభ్యులు మార్నేని కృష్ణారావు , నాయకులు పాల్గొన్నారు. అనంతరం రఘుబాబుని ఘనంగా సన్మానించారు

మాగుంటను కలిసిన సినీనటుడు రఘుబాబు

ఒంగోలు కలెక్టరేట్ : ఒంగోలు లోక్‌సభ సభ్యుడు మాగుంట శ్రీనివాసులురెడ్డిని సినీనటుడు రఘుబాబు మర్యాదపూర్వకంగా కలిశారు. స్థానిక రామనగర్‌లోని మాగుంట కార్యాలయంలో బుధవారం మధ్యాహ్నం ఎంపీని కలిసి పలు అంశాలపై చర్చించుకున్నారు.











అన్నపూర్ణాదేవీ నమోస్తుతే


మార్కాపురంలో ధనలక్ష్మిగా రాజ్యలక్ష్మి


గిద్దలూరులో కామాక్షిదేవిగా అమ్మవారు


కంభంలో భువనేశ్వరిగా


వైపాలెంలో శాకాంబరిగా అమ్మవారు

మార్కాపురం వన్‌టౌన్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : దసరా నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని పట్టణంలోని వివిధ ఆలయాల్లో అమ్మవార్లు ప్రత్యేక అలంకారాల్లో దర్శనమిచ్చారు. శ్రీలక్ష్మి చెన్నకేశవస్వామి ఆలయంలో ప్రధాన అర్చకులు శ్రీపతి అప్పనాచార్యులు రాజ్యలక్ష్మి అమ్మవారి మూలవిరాట్ ఉత్సవ మూర్తులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాజ్యలక్ష్మి అమ్మవారు ధనలక్ష్మి అలంకారంలో భక్తులకు దర్శనం ఇచ్చారు. ఈవో గొలమారి శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో కార్యక్రమాలు పర్యవేక్షించారు. మార్కండేశ్వర స్వామి ఆలయంలో జగదాంబ చంద్రగంట అలంకారంలో దర్శనం ఇచ్చారు. ఈవో ఈదుల చెన్నకేశవరెడ్డి ఆధ్వర్యంలో కార్యక్రమాలను పర్యవేక్షించి భక్తులకు సౌకర్యాలు కల్పించారు. వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో వాసవి మాత భవానీ దేవిగా భక్తులు దర్శనం ఇచ్చారు. పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు బొంతల పుల్లారావు, కార్యదర్శి వక్కలగడ్డ సురేశ్ కుమార్, కోశాధికారి చక్కా మాలకొండ చిన్న నరసింహారావు కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు ప్రసాద పంపిణీ నిర్వహించారు. వివిధ కార్యక్రమాలు నిర్వహించారు.

గిద్దలూరు : దసరా శరన్నవరాత్రులలో భాగంగా పట్టణంలోని శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి దేవస్థానంలో అమ్మవారికి పంచామృతాభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారు కామాక్షిదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. స్నేహ సంగీత నాట్య కళా క్షేత్రం ఆధ్వర్యంలో నిర్వహించిన చిన్నారుల భరతనాట్య ప్రదర్శన అందరినీ అలరించింది. అంకాలమ్మ దేవాలయంలో, ఇంకా పలు ఆలయాలలో దసరా ప్రత్యేక పూజలు నిర్వహించారు. షరాఫ్ బజారులోని వేంకటేశ్వరస్వామి దేవాలయంలో స్వామి వారు కూర్మావతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. పట్టణంలోని కాశినాయన ఆశ్రమంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. దాతల సహకారంతో పేదలకు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.

చంద్రఘంటగా దేవీ దర్శనం

త్రిపురాంతకం : త్రిపురాంతకేశ్వరస్వామి, బాలాత్రిపురసుందరీదేవి అమ్మవారి దేవస్థానంలో దసరా శరన్నవరాత్రులు వైభవంగా జరుగుతున్నాయి. భక్తులు అధిక సంఖ్యలో హాజరవుతూ మూడు రోజులుగా అమ్మవారిని దర్శించుకుంటున్నారు. బుధవారం మూడోరోజు వ్యాఘ్ర వాహనంపై బాలాత్రిపురసుందరీదేవి చంద్రఘంటాదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. పెద్ద సంఖ్యలో భక్తులు హాజరై అమ్మవారిని దర్శించుకున్నారు.

పెద్ద దోర్నాల : దసరా ఉత్సవాల నేపథ్యంలో బుధవారం అన్నపూర్ణాదేవి అలంకారంలో భక్తులకు అమ్మవారు దర్శనమిచ్చారు. ప్రధానంగా శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయం, పోలేరమ్మ ఆలయం, సాయిబాబా, తిమ్మాపురం శ్రీ చౌడేశ్వరి ఆయలంలో నవరాత్రి ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి.

కంభం : వాసవీ కన్యకా పరమేశ్వరిదేవి అమ్మవారు భువనేశ్వరిదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. కోటా సత్యమాంబదేవి శ్రీ భువనేశ్వరిదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. రాత్రి సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను అలరించాయి.

ఎర్రగొండపాలెం రూరల్ : వాసవీ కన్యాకపరమేశ్వరి దేవి ఆలయంలో అమ్మవారు శాఖంబరిదేవి అలంకారంలో దర్శనమిచ్చారు.

రాచర్ల : పట్టాభి రామాలయంలో బుధవారం అమ్మవారు అన్నపూర్ణాదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ అర్చకులు సతీష్ శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు.

డీఎస్సీ అభ్యర్థులకు దోర్నాలలో భోజనం


భోజనాలు చేస్తున్న డీఎస్సీ అభ్యర్థులు

పెద్దదోర్నాల, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : కర్నూలు ఉమ్మడి జిల్లా డీఎస్సీ అభ్యర్థులకు దోర్నాలలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల, జూనియర్ కళాశాల, ఎస్సీ, ఎస్టీ హాస్టళ్లలో ప్రభుత్వం బుధవారం భోజన వసతిని ఏర్పాటు చేసింది. ఎన్నోఏళ్లుగా ఎదురుచూస్తున్న నిరుద్యోగులకు వరంటా ప్రజా ప్రభుత్వం డీఎస్సీని ప్రకటించింది. అర్హత సాధించిన అభ్యర్థులకు అమరావతిలో నియామకపత్రాలు అందజేయనున్న క్రమంలో కర్నూలు, నంద్యాల జిల్లాలకు చెందిన 6వేల మంది అభ్యర్థులు 23 బస్సుల్లో దోర్నాల మీదుగా అమరావతి వెళ్తుండడంతో ఇక్కడ భోజన వసతిని కల్పించారు. దోర్నాలలో ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా ఎస్‌ఐ మహేష్ చర్యలు తీసుకున్నారు.

ఎంపీడీవోగా బాల చెన్నయ్య బాధ్యతలు


బాధ్యతలు స్వీకరించిన బాల చెన్నయ్య

మార్కాపురం రూరల్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : మార్కాపురం ఎంపీడీవోగా ఆత్మకూరి బాల చెన్నయ్య బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన ఒంగోలు మండల ఇన్‌చార్జి ఎంపీడీవో, ఈవోపీఆర్డీగా పనిచేస్తూ ఉద్యోగోన్నతిపై ఇక్కడకు బదిలీ అయ్యారు. ఇక్కడి ఎంపీడీవో బీ శ్రీనివాసులు నెల్లూరు జిల్లా ఉదయగిరికి బదిలీ అయ్యారు. బాలచెన్నయ్యకు ఏవో భాగ్యవతి, ఎన్ఆర్ఈజీఎస్ ఏపీవో నాగరాజు, జూనియర్ అసిస్టెంట్ రామసుబ్బారెడ్డి, కంప్యూటర్ ఆపరేటర్ బొగ్గు రామిరెడ్డి, సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

భారత రాజ్యాంగాన్ని కాపాడాలి

గిద్దలూరు, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : ప్రజాస్వామ్యాన్ని పరిరక్షిస్తూ భారత రాజ్యాంగాన్ని కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందని ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్య వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆకుమళ్ల రహీమ్ అన్నారు. గిద్దలూరులో పలు మండలాలకు చెందిన ఐక్య వేదిక సభ్యుల సమావేశం జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన రహీమ్ మాట్లాడుతూ భారత రాజ్యాంగంపైన, సవరణలపైన గ్రామసభలు నిర్వహించి ప్రజలను అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. ప్రజలు చట్టాలపై అవగాహన పెంచుకుని చైతన్యవంతం కావాలని కోరారు. ఐక్యవేదిక జిల్లా కన్వీనర్ గుడిసె మహబూబ్‌భాషా, ఐక్యవేదిక నాయకులు బాలకాశిరెడ్డి, ఫాజిల్, మస్తాన్‌వలి పాల్గొని ప్రసంగించారు.

స్త్రీ నిధి బకాయిలను వసూలు చేయాలి

మార్కాపురం రూరల్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : మండలంలో స్త్రీ నిధి బకాయిలను వీవోఏలు వసూలు చేయాలని స్త్రీ నిధి ఏజీఎం చిన్న బుల్లయ్య కోరారు. ఎస్సీ బీసీ కాలనీలోని డ్వాక్రా బజారులో బుధవారం వీవోఏలతో సమావేశం నిర్వహించారు. ఏజీఎం మాట్లాడుతూ స్త్రీనిధి బకాయిలు ఉన్న గ్రామాలలో సీసీలు, వీవోఏలు, ఏపీఎం ప్రత్యేక దృష్టి సారించి ఎన్‌పీఏలో ఉన్న గ్రూపు సభ్యుల నుంచి రికరవరీ చేయాలని సూచించారు. మండలంలో మొత్తం రూ.28లక్షల78వేల బకాయిలున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో స్త్రీనిధి మేనేజర్ సులోచన, ఏపీంఎ పిచ్చయ్య, ఎల్‌సీ నాగభూషణం, సీసీలు పాల్గొన్నారు.

పీ-4ని విజయవంతం చేద్దాం

తర్లుపాడు, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : పీ-4ని విజయవంతం చేద్దామని ఇన్‌చార్జ్ ఎంపీడీవో బుర్రి చంద్రశేఖర్ అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో వీఆర్‌వోలు, సచివాలయ సిబ్బందికి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ.. సర్వేలో నిరుపేదలను గుర్తించి వారికి ఆసరా కల్పించాలన్నారు. శిక్షణ పొందిన ట్రైనర్లకు పలు అంశాలను వివరించారు. కార్యక్రమంలో వీఆర్‌వోలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజలకు మెరుగైన సేవలు అందించడమే లక్ష్యం


ప్రజలతో ప్రతిజ్ఞ చేయిస్తున్న వైద్య సిబ్బంది

రాచర్ల, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన సేవలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని టీడీపీ నాయకుడు బుడమ నాగేశ్వర్‌రెడ్డి అన్నారు. ఆరోగ్యవంతమైన మహిళ శక్తివంతమైన కుటుంబం కార్యక్రమంలో భాగంగా అనుములవీడు ప్రాథమిక వైద్యశాల సిబ్బంది మండలలోని సోమిదేవిపల్లి గ్రామంలో వైద్య శిబిరం ఏర్పాటు చేయగా ఆయన పాల్గొన్నారు. ప్రభుత్వం అందించే ఉచిత వైద్యసేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. వైద్యాధికారి డాక్టర్ రమేష్ ఆధ్వర్యంలో ప్రజలకు ప్రత్యేక పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది వై రంగనాయకులు, ఎం ప్రసాద్, శ్రీనివాసులు, ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు, సచివాలయ కార్యదర్శి వైఎన్‌జి రంగనాయకులు, టిడిపి నాయకులు కె వెంకటేశ్వర్ రెడ్డి, ఆర్ రమణ, జి తిరుపతి రెడ్డి పాల్గొన్నారు.

ఏఎస్సైగా శ్రీనివాసరావు బాధ్యతల స్వీకరణ

రాచర్ల, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : ఏఎస్సైగా పి శ్రీనివాసరావు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన యర్రగొండపాలెం పోలీస్ స్టేషన్‌లో ఏఎస్సైగా విధులు నిర్వహిస్తూ బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఇక్కడ పనిచేస్తున్న ఏఎస్సై వై ఆదిశేషయ్య ఒంగోలు టూటౌన్ పోలీస్ స్టేషన్‌కు బదిలీ అయిన విషయం తెలిసిందే.

హిందీ మాస్టర్ శ్రీనుకు సన్మానం


మాస్టర్ శ్రీనును సన్మానిస్తున్న హిందీ ఉపాధ్యాయ సిబ్బంది

పెద్ద దోర్నాల, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : మండలం చిన్నదోర్నాల జడ్పీ ఉన్నత పాఠశాల హిందీ ఉపాధ్యాయుడు శ్రీనివాసులును సన్మానించారు. ఒంగోలులోని ప్రధానోపాధ్యాయుల అసోషియేషన్ భవనంలో బుధవారం జాతీయ హిందీ భాషా దినోత్సవ వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు పొందిన శ్రీనును అసోషియేషన్ వారు శాలువా కప్పి పూలమాలలతో ఘనంగా సత్కరించారు. గ్రామీణ ప్రాంతంలో పాఠశాల అభివృద్ధికి కృషి చేస్తున్న శ్రీనివాసులుకు సముచిత గౌరవం లభించిందని పలువురు కొనియాడారు. కార్యక్రమంలో హెచ్‌టీయూ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు మహబూబ్ ఖాన్, జిల్లా నాయకులు మొర్రి పిచ్చయ్య, సుభాని, శ్రీను, మజ్ను పాల్గొన్నారు.





















వైభవంగా శరన్నవరాత్రులు

దర్శి, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): శరన్నవరాత్రుల సందర్భంగా ఆలయాలు భక్తులతో కిటకిటలాడుతున్నాయి. దర్శి పట్టణంలోని కనకదుర్గమ్మ, పోలేరమ్మ, దద్దాలమ్మ, వెంకటేశ్వరస్వామి ఆలయాల్లో అమ్మవారు బుధవారం అన్నపూర్ణదేవిగా దర్శనమిచ్చి పూజలందుకున్నారు. మహిళలు అధికసంఖ్యలో అలయాలకు వెళ్లి పొంగళ్లు పెట్టి మొక్కులు తీర్చుకున్నారు. పలుచోట్ల అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు.

ముండ్లమూరులో..

ముండ్లమూరు, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): శర న్నవరాత్రుల్లో భాగంగా మండలంలోని పలు దేవాల యాల్లో కొలువుదీరిన దేవతామూర్తులైన భ్రమరాంబ, పార్వతి దేవీలను లలితాదేవిగా అలంకారం చేశారు. ఎమారెళ్ళ శివాలయంలో భ్రమరాంబదేవి, పులిపాడులోని ఊర్లేస్వర అన్నపూర్ణాదేవి ఆలయంలో పార్వతీదేవి, ముండ్లమూరులో కనకదర్గమ్మ అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు.

దొనకొండలో..

దొనకొండ, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): స్థానిక ఆ నంద ఆశ్రమంలో శరన్నవరాత్రులు వైభవంగా జరుగుతున్నాయి. మూడవరోజు బుధవారం అమ్మవారు శ్రీలలితాదేవిగా శ్రీఈశ్వరీదేవి భక్తులకు దర్శనమిచ్చారు. ఈసందర్భంగా నిర్వహించిన ప్రత్యేక పూజల్లో అధికసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

సీఎస్‌పురంలో..

సీఎస్‌పురం(పామూరు), సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): సీఎస్‌పురం మండలంలోని భైరవకోనలో శరన్నవరాత్రుల వేడుకలు ట్రస్టుబోర్డు చైర్మన్ ముప్పాళ్ల శ్యాంసుందర్‌రాజు, ఆలయ కార్యానిర్వహణాధికారి డి.వంశీకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహిస్తున్నారు. బుధవారం అమ్మవారు శ్రీఅన్నపూర్ణదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈసందర్భంగా నిర్వహించిన చండీ యజ్ఞహోమాల్లో భక్తులు పాల్గొన్నారు.

పీసీపల్లిలో..

పీసీపల్లి, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): దసరా శరన్నవరాత్రుల సందర్భంగా మూడవ రోజైన బుధవారం మల్లేశ్వరస్వామి ఆలయంలోని అమ్మవారు శ్రీగాయత్రీదేవి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయాన్నే కుంకుమార్చనతో మొదలైన పూజలు లలితాసహస్రనామస్తోత్రం, త్రిశూల పూజ, అష్టోత్తరపూజ కార్యక్రమాలను అర్చకస్వామి పలుకూరి సుబ్బారావు నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.


దర్శి: అన్నపూర్ణదేవిగా పూజలందుకుంటున్న అమ్మవారు


దొనకొండ ఆనంద ఆశ్రమంలో లలితాదేవిగా దర్శనమిస్తున్న అమ్మవారు


ప్రమాదకరంగా దర్శి - పొదిలి రోడ్డులో కాటేరు వాగు చప్టా

ప్రమాదకరంగా కాటేరు వాగు చప్టా

దర్శి, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): దర్శి-పొదిలి రోడ్డులో కాటేరు వాగుపై ఉన్న చప్టా ప్రమాదకరంగా మారింది. సుమారు 50 సంవత్సరాల క్రితం నిర్మించిన ఈచప్టా సామర్థ్యం కోల్పోయి దెబ్బతింది. శ్లాబు నెర్రలిచ్చింది. ఎప్పుడు కూలుతుందోనని ప్రయాణికులు ఆందోళన చెందుతున్నారు. చప్టాకు ఇరువైపులా నిర్మించిన రక్షణ దిమ్మెలు విరిగిపోయాయి. ప్రస్తుతం వాహన చోదకులు ఆదమరిస్తే కాటేరువాగులో పడే ప్రమాదముంది. దిమ్మెలు పూర్తిగా లేకుండాపోవటంతో రాత్రిపూట పెద్ద వాహనాలు కూడా వాగులో పడే ప్రమాదం ఉంది. రోజులు తరబడి ఈపరిస్థితి ఉన్నప్పటికీ సంబంధిత అధికారులు పట్టించుకోకపోవటం పట్ల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

మహిళల ఆరోగ్యమే కుటుంబాలకు శ్రీరామరక్ష

సీఎస్‌పురం(పామూరు), సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): మహిళల సంపూర్ణ ఆరోగ్యమే కుటుంబాలకు శ్రీరామరక్ష అని ప్రముఖ ఆయుర్వేద వైద్యాధికారి డాక్టర్ గద్దె ఏడుకొండలు అన్నారు. సీఎస్‌పురం మండలం అరివేముల గ్రామంలోని ఆయుర్వేద వైద్యశాలలో బుధవారం స్వస్త్ నారీ - సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా వైద్య శిబిరం నిర్వహించారు. డాక్టర్ గద్దె ఏడుకొండలు, డాక్టర్ పుండరి కాంక్షరావు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా ఆయుర్వేద మందు లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ రాధారుక్మిణమ్మ, తదితరులు పాల్గొన్నారు.

తాళ్లూరు: మహిళలు ఆరోగ్యవంతులుగా ఉంటే ఆకుటుంబంతో పాటు సమాజం క్షేమంగా ఉంటుందని విఠలాపురం సర్పంచ్ మారం ఇంద్రసేనారెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని విఠలాపురం సచివాలయం వద్ద స్వస్త్ నారీ - స్వశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా వైద్య శిబిరం నిర్వహించారు. పలువురికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. కార్యక్రమంలో సీడీపీవో ఆర్.పరిమిళ, వైద్యాధికారి ప్రవీణ్, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ బి.ఇందిర, తదితరులు పాల్గొన్నారు.

పామూరు: మహిళలు బలవర్ధకమైన ఆహారాన్ని తీసుకొని ఆరోగ్యంగా ఉంటేనే ఆ కుటుంబం ఆనందరంగా ఉంటుందని కూటమి నాయకులు పేర్కొన్నారు. స్వస్త్ నారీ - సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా బుధవారం స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఆరోగ్యశిబిరం ఏర్పాటుచేశారు. కార్యక్రమంలో బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ కేవీ రమణయ్య, మండల అధ్యక్షుడు ఉమ్మడి శ్రీను, టీడీపీ నాయకుడు బి.జయరామిరెడ్డి, సింగిల్‌విండో చైర్మన్ ఉప్పలపాటి హరిబాబు, పంచాయతీ కార్యదర్శి జీవీ అరవిందారెడ్డి, వైద్యశాల డైరెక్టర్‌లు షేక్ ముబినామౌలాలి, ఎన్.సాంబయ్య, తదితరులు పాల్గొన్నారు.

తల్లిపాలు బిడ్డకు శ్రేష్ఠం

కనిగిరి, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): తల్లి పాలు బిడ్డకు శ్రేష్ఠమని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పార్వతమ్మ అన్నారు. బుధవారం మండలంలోని గురవాజీపేట సెక్టార్ పరిధిలోని నల్లారెడ్డిపల్లి గ్రామంలో 8వ రాష్ట్రీయ పోషణామాసం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా గ్రామంలో ర్యాలీ నిర్వహించి తల్లిపాలు ప్రాముఖ్యతను వివరించారు. తల్లిపాటు ఇవ్వకపోతే పిల్లల ఎదుగుదలలో చాలా సమస్యలు తలెత్తి భవిష్యత్తులో అనారోగ్యాలు వచ్చే అవకాశం ఉందన్నారు.

డిగ్రీలో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవాలి

కనిగిరి, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): కనిగిరి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ జె.ఉషారాణి బుధవారం ఒక ప్రకటనలో కోరారు. కళాశాలలో నాణ్యమైన విద్యను అందించేందుకు ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటుందన్నారు. బీఏ, బీకాం, కంప్యూటర్ కోర్సులకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్టు పేర్కొన్నారు.

కార్మికులకు పని గంటలు పెంచడం అన్యాయం

దొనకొండ, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): రోజుకు ఎనిమిది గంటల పని విధానం స్థానంలో 13 గంటల పనిని వ్యతిరేకించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు తాండవ రంగారావు పిలుపునిచ్చారు. బుధవారం ఆసంఘం మండల కార్యదర్శి చిరుపల్లి అంజయ్య అధ్యక్షతన జరిగిన నిరసన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ కార్మికుల పని గంటలు పెంచటం అన్యాయమన్నారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు దారం నర్సింహారావు, పోరుమామిళ్ల కోటేశ్వరరావు, సుబ్బారావు, శ్రీనివాసరావు, వెంకటసుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

సర్పంచ్‌గా నారాయణమ్మ బాధ్యతల స్వీకరణ

ముండ్లమూరు, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): ముండ్లమూరు సర్పంచ్‌గా మేదరమెట్ల నారాయణమ్మ బుధవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. సర్పంచ్ ఒద్దిపోగు ఆదిలక్ష్మి గతనెల 23న పాము కాటుకు గురై మృతి చెందారు. దీంతో ఉపసర్పంచ్ మేదరమెట్ల నారాయణమ్మను సర్పంచ్‌గా పంచాయతీ కార్యదర్శి పి.పరమేశ్వరి ప్రమాణ స్వీకారం చేయించారు. ఈసందర్భంగా నారాయణ మ్మను తహసీల్దార్ ఎల్.లక్ష్మీనారాయణ, మాజీ సర్పంచ్ మేదరమెట్ల వెంకటరావు, మాజీ సొసైటీ అధ్యక్షుడు వీరపనేని బుచ్చిబాబు, మాజీ డీసీ చైర్మన్ గంగినేని శేషగిరిరావుతోపాటు వార్డు మెంబర్లు ఘనంగా సన్మానించారు.

ప్రభుత్వ రాయితీలను సద్వినియోగం చేసుకోవాలి

పామూరు, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు కేంద్రరాష్ట్ర ప్రభుత్వాలు మంజూరు చేసే రాయితీలను సద్వినియోగం చేసుకొని లబ్ధిపొందాలని జిల్లా పరిశ్రమల శాఖ ప్రోత్సాహక అధికారి గోగినేని ధామ్సన్ తెలిపారు. బుధవారం స్థానిక మండలపరిషత్ కార్యాలయ సమావేశపు మందిరంలో పొదుపు గ్రూపు మహిళలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఏపీఎం జి.విద్యాసాగర్, తదితరులు పాల్గొన్నారు.

దేవస్థాన హుండీల చోరీ

పామూరు, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తిరగళదిన్నె గ్రామంలోగల శ్రీవేద దక్షిణామూర్తి దేవాలయంలో హుండీల చోరీ జరిగిన సంఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. ఇటీవల గుడి ప్రారంభోత్సవం సందర్భంగా దేవస్థానంలోని హుండీల్లో భక్తులు విరాళాలు, కానుకలు సమర్పించారు. గుర్తుతెలియని వ్యక్తులు హుండీలలోని నగదు అపహరించి పొలాల్లో వదిలేశారు. ఈ విషయంపై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్టు నిర్వాహకులు తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

దర్శి, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): దర్శి పట్టణంలో ఫీడర్ లైన్ మెయింటెన్స్ మరమ్మతులు చేస్తున్న కారణంగా పలుచోట్ల సరఫరా నిలిపివేస్తున్నట్టు విద్యుత్ అధికారులు తెలిపారు. ఎస్ఎస్‌పీ కాలనీ కొత్త సబ్‌స్టేషన్ పరిధిలోని అద్దంకి రోడ్డు, పుచ్చలమిట్ట, ఆటోనగర్, మోతుపల్లి రోడ్డు ప్రాంతాల్లో గురువారం ఉదయం 6 నుంచి 9 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు అధికారులు తెలిపారు. వినియోగదారులు ఈవిషయాన్ని గమనించి సహకరించాలని కోరారు.

పీసీపల్లి: ఆర్డీఎస్ఎస్ నిర్వహణ పనుల దృష్ట్యా గురువారం మర్రికుంటపల్లి ఫీడర్‌లో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు జేఎల్ఎం నాగరాజు తెలిపారు. వినియోగదారులు విద్యుత్‌శాఖకు సహకరించాలని ఆయన కోరారు.

దేశ ప్రయోజనాలను కాపాడాలి

సీఎస్‌పురం(పామూరు), సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం దేశ ప్రయోజనాలను కాపాడాలని సీపీఎం జిల్లా కార్యదర్శి షేక్ మాబు అన్నారు. బుధవారం సీఎస్‌పురంలోని పార్టీ కార్యాలయంలో కరపత్రాలను ఆవిష్కరించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రారంభించిన వాణిజ్య యుద్ధం వివిధ దేశాలపై తీవ్ర ప్రభావం చూపుతుందన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రత్యామ్నాయ మార్గాలను ఆలోచించాలన్నారు. కార్యక్రమంలో సయ్యద్ హనీఫ్, ఊసా వెంకటేశ్వర్లు, ఊసా రాజ్యలక్ష్మి, ఎం.తిరుపతిరెడ్డి, రత్నాకర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఉద్యాన పంటలకు ప్రోత్సాహం

కనిగిరి, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఉద్యాన పంటల సాగుకు ప్రభుత్వం ప్రోత్సాహం ఇస్తుందని ఏవో విష్ణుప్రియ అన్నారు. బుధవారం మండలంలోని తుమ్మగుంట, చల్లగిరగల గ్రామాల్లో జరిగిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. మైక్రో ఇరిగేషన్ ప్రాజెక్టు ద్వారా డ్రిప్‌లు, స్ప్రింకర్లు రాయితీతో ఇస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణాధికారి ఎల్.మాల్యాద్రి, వీపీఏలు శ్రీలక్ష్మి, నజ్మా, తదితరులు పాల్గొన్నారు.













● సిద్ధమైన సభా ప్రాంగణం

సీఆర్‌డీఏ భవనం రెడీ!



రాజధానిలో తొలి శాశ్వత భవనంగా రికార్డు

విజయదశమికి ప్రారంభం?

కార్పొరేట్ కార్యాలయాలను తలదన్నేలా ఏపీ సీఆర్‌డీఏ ప్రధాన కార్యాలయ భవనం అత్యద్భుతంగా రూపు దిద్దుకుంది. రాజధాని అమరావతిలో తొలి శాశ్వత భవనంగా చరిత్ర కెక్కనుంది. ఇంటీరియర్ పనులను పూర్తి చేసుకున్న ఈ భవనం ఆరుబయటి మెరుగులను మాత్రమే అద్దుకోవాల్సి ఉంది. ఈ పనులన వారం రోజుల్లో పూర్తిచేసి విజయదశమికి ప్రారంభించేందుకు సీఆర్‌డీఏ సన్నద్ధమవుతోంది.

స్పెషల్ ఎట్రాక్షన్‌గా టెర్రస్

భవనం టెర్రస్ మీద మూడు రకాల ప్రత్యేక లేయర్స్‌తో కూడిన రూఫ్‌ను చాలా పటిష్ఠంగా ఏర్పాటు చేశారు. కాంక్రీటు శ్లాబ్‌పై ప్రైమర్, పాలి యూరియా, 270ఏ కెమికల్ (జియో టెక్స్‌టైల్ క్లాత్) వేసి దానిపైన మూడంగుళాల ఎత్తులో మళ్లీ స్క్రేడ్ కాంక్రీట్ వేసి, టైల్స్ అతికించారు. టెర్రస్‌లో ఫుడ్ కోర్టు, జిమ్, రెండు వాష్ రూంలు, మెడిటేషన్ సెంటర్, సోలార్ విద్యుత్ కోసం ప్రత్యేక ప్యానల్స్ ఏర్పాటు చేశారు.

(మంగళగిరి, ఆంధ్రజ్యోతి)

రాయపూడి సమీపాన ఎమ్మెల్యే క్వార్టర్స్‌కు ముందు వైపు.. సీడ్ యాక్సిస్ రోడ్డుకు దక్షిణంగా సీఆర్‌డీఏ ప్రధాన కార్యాలయ భవనాన్ని నిర్మిస్తున్న సంగతి తెలిసిందే. ఆగస్టు 15 న ఈ భవనాన్ని ప్రారంభించాలని అనుకున్నప్పటికీ.. పనులు పూర్తికాకపోవడంతో అది సాధ్యం కాలేదు. రూ.240 కోట్ల వ్యయంతో జీ+7గా నిర్మిస్తున్నారు. కొద్ది నెలల కిందటే సివిల్ పనులన్నీ పూర్తయినప్పటికీ.. ఇంటీరియర్, ఎలివేషన్ వర్కులకు సమయం పడుతూ వచ్చింది. ప్రస్తుతానికి 98 శాతం పనులు పూర్తయినట్టు భావించాలి.

జాప్యంతో పెరిగిన ఖర్చు!

రాజధాని నిర్మాణ బాధ్యతల్లో సింహ భాగాన్ని సీఆర్‌డీఏ తలకెత్తుకుంది. ఆ బాధ్యతలను మరింత సమర్థంగా నిర్వహించేందుకు అమరావతిలోనే తన శాశ్వత భవనాన్ని ఏర్పాటు చేసుకోవాలని

(మిగతా 8వ పేజీలో)



సార్లు.. సంబరం

● వెలగపూడి సచివాలయం వద్ద డీఎస్సీ సభ

● హాజరుకానున్న ముఖ్యమంత్రి చంద్రబాబు



అధికారులకు ఆదేశాలిస్తున్న ఐజీ త్రిపాఠి, ఎస్పీ వకుల్ జిందాల్

పటిష్ఠ బందోబస్తు : ఐజీ

డీఎస్సీ సభకు పటిష్ఠంగా బందోబస్తు ఏర్పాట్లు చేసినట్లు ఐజీ సర్వశ్రేష్ఠత్రిపాఠి తెలిపారు. అధికారులకు బందోబస్తు నిర్వహణ గురించి ఐజీ తుళ్లూరు ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్లో దిశానిర్దేశం చేశారు. వీవీఐపీ, వీఐపీ, డీఎస్సీ అభ్యర్థులకు కేటాయించిన మార్గాల్లో వారిని అనుమతించాలని చెప్పారు. ఎక్కడా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా జాగ్రత్త వహించాలన్నారు. వేదిక వద్ద విధులు నిర్వహించే వారు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా చూడాలన్నారు. ఈ సమావేశంలో ప్రకాశం జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు, ఏఎస్పీలు రమణమూర్తి, రవికుమార్, సుప్రజ, హనుమంతు, తుళ్లూరు డీఎస్పీ మురళీకృష్ణ, ఎస్బీ సీఐ అశోహరి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

నేడు నియామకపత్రాల పంపిణీ

● వివిధ జిల్లాల నుంచి తరలివచ్చిన అభ్యర్థులు

● గుంటూరు, నరసరావుపేటలోని కేంద్రాల్లో బస ఏర్పాటు

● గుర్తింపు కార్డులు పంపిణీ చేసిన విద్యాశాఖ అధికారులు

తుళ్లూరు (వెలగపూడి), నరసరావుపేట, గుంటూరు(విద్య), సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులుగా ఎంపికైన వారు ఉత్సాహంగా ఉండగా వారిని మరింత సంతోష పరుస్తూ నియామకపత్రాల పంపిణీకి ప్రభుత్వం భారీగా ఏర్పాట్లు చేసింది. గురువారం రాజధాని అమరావతి పరిధిలోని వెలగపూడి సచివాలయ సమీపంలో డీఎస్సీ సభకు అధికారులు సర్వం సిద్ధం చేశారు. గురువారం మధ్యాహ్నం 2 గంటలకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రాష్ట్రవ్యాప్తంగా ఎంపికైన డీఎస్సీ అభ్యర్థులకు నియామక పత్రాలు అందచేయనున్నారు. ఇందుకు సంబంధించిన కార్యక్రమం, బహిరంగ సభకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి, గుంటూరు జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ బుధవారం సభా ప్రాంగణం వద్ద ఏర్పాట్లను పరిశీలించారు. కాగా ముఖ్యమంత్రి నుంచి ఉపాధ్యాయ నియామక పత్రాలు అందుకునేందుకు మెగా డీఎస్సీలో ఎంపికైన అభ్యర్థులు వివిధ ప్రాంతాల నుంచి బుధవారం సాయంత్రానికి ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన బస్సుల్లో గుంటూరు, నరసరావుపేట తదితర ప్రాంతాలకు తరలి వచ్చారు. ఎక్కడికక్కడ విద్యాశాఖ అధికారులు వారి బసతో పాటు డీఎస్సీ సభకు సంబంధించి గుర్తింపు కార్డులను పంపిణీ చేశారు. ఉమ్మడి గుంటూరు జిల్లా నుంచి ఉపాధ్యాయ అభ్యర్థులు, వారి కుటుంబ సభ్యులను వెలగపూడికి తరలించేందుకు 71 బస్సులు ఏర్పాటు చేశారు. గుంటూరు పొన్నూరు రోడ్డులోని ఆంధ్రా ముస్లిం కళాశాలలో ఏర్పాటు చేసిన కేంద్రంలో జోన్-3 (గుంటూరు, ప్రకాశం, నెల్లూరు) పరిధిలో ఎంపికైన అభ్యర్థులకు బుధవారం గుర్తింపు కార్డులు అందజేసినట్లు డీఈవో రేణుక తెలిపారు. కాగా ఇక్కడి నుంచి డీఎస్సీ అభ్యర్థులు, వారి కుటుంబసభ్యులతో కూడిన బస్సులు గురువారం ఉదయం 7 గంటలకు బయలుదేరతాయన్నారు. ఉదయం 11 గంటల నుంచి ప్రారంభమైన గుర్తింపు కార్డుల పంపిణీ ప్రక్రియ సాయంత్రం వరకు కొనసాగింది. ఇక్కడ ఏర్పాట్లను ప్రత్యేక

(మిగతా 8వ పేజీలో)



కర్నూలు జిల్లా నుంచి నరసరావుపేటలోని ఎస్ఎస్ఎన్ కళాశాల వసతి గృహానికి చేరుకున్న ఉపాధ్యాయులు, కుటుంబ సభ్యులు



కాత్యాయని.. బగళాముఖి నమోస్తుతే..!

పిట్టలవానిపాలెం, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): చందోలులో వేంచేసియున్న శ్రీబగళాముకి దేవస్థానంలో మూడో రోజు బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. బగళాముఖి అమ్మవారిని కాత్యాయని మహాదేవిగా అలంకరణ చేసి భక్తులకు దర్శనం కల్పించారు.

పటిష్ఠంగా వరద నష్ట నివారణ చర్యలు

అధికారులను అప్రమత్తం చేసిన మంత్రి అనగాని



రేపల్లె, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): కృష్ణానదికి వరద ఉధృతి పెరుగుతుండటంతో.. కృష్ణా కరకట్ట పరీవాహక ప్రాంతాల్లోని ప్రజల కు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ అధికారులకు బుధవారం ఆదేశాలు జారీ చేశారు. బలహీనంగా ఉన్న కరకట్టను పటిష్ఠం చేసే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. అధిక వర్షాలు పడే అవ కాశం ఉందని, కరకట్ట వెంబడి గ్రామాల ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ.. అవసరమైతే ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని స్పష్టం చేశారు. లంక గ్రామాల ప్రజలకు ఇబ్బంది లేకుండా.. ముందస్తుగానే అధికారులు, పంచాయతీ సిబ్బంది కావాల్సిన సామగ్రిని దగ్గర పెట్టుకోవాలని తెలిపారు. రెవెన్యూ, పంచాయతీ, కృష్ణారివర్ అథారిటీ అధికారులు కరకట్టకు ముప్పు వాటిల్లకుండా చర్యలు చేపట్టాలని దిశనిర్దేశం చేశారు.

పునరావాస కేంద్రాలకు వెళ్లాల్సిందే..!

● లంక గ్రామాల ప్రజలతో కలెక్టర్ వినోద్ కుమార్

● సహాయక చర్యలకు రెస్క్యూ టీంలు సిద్ధం: ఎస్పీ



చిలుమూరులంకలో సర్పంచ్, గ్రామస్థులతో మాట్లాడుతున్న కలెక్టర్ వినోద్‌కుమార్

భట్టిప్రోలు, కొల్లూరు, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : వరద బాధితుల పునరావాస కేంద్రాలను కలెక్టర్ డాక్టర్ వాసుదేవ వినోద్‌కుమార్ బుధవారం పరిశీలించారు. కొల్లూరులోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల, వివేక, చైతన్య విద్యా సంస్థల్లోని పునరావాస కేంద్రాలను ఆయన పరిశీలించారు. అక్కడ నియమించిన అధికారులకు వరద బాధితులకు అందించాల్సిన సహాయక చర్యలపై పలు సూచనలు చేశారు. ఇందుకు సంబంధించి రూ.10 లక్షల నిధులను విడుదల చేయనున్నట్లు ఆర్డీవో రామలక్ష్మి తెలిపారు. అనంతరం సుగ్గునలంక, చిలుమూరులంక, ఈపూరులంక, పెదలంక, చింతల్లంక, పెసర్లంక గ్రామాలను సందర్శించి అక్కడ సర్పంచ్‌లు, ప్రజలతో మాట్లాడారు. శుక్ర, శనివారాల్లో కృష్ణానదికి భారీ వరద వచ్చే సూచనలు ఉన్నాయని తెలియజెప్పారు. లంక ప్రజల కోసం కొల్లూరు మండలంలో 12 పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. అన్ని వసతులు సమకూర్చామని వృద్ధులు, గర్భిణులు, బాలింతలు, రోగులు ఆశ్రయం పొందవచ్చన్నారు. 13 లక్షల క్యూసెక్కులకు పైగా వరద నీరు వచ్చే అవకాశాలు లేకపోలేదని, ప్రజలు సహకరించాలని కోరారు. అయితే ఆయా గ్రామాల సర్పంచ్‌లు గతంలో 11.50 లక్షల క్యూసెక్కుల వరద నీరు వచ్చినా ప్రజలంతా గ్రామాల్లోనే ఉన్నారని, విద్యుత్ సరఫరా ఉంటే వరద నీటిలోనే ఎన్ని రోజులైనా ఉంటారని కలెక్టర్‌కు తెలిపారు. వారి మాటలతో ఏకీభవించని కలెక్టర్ 6 లక్షల క్యూసెక్కులకు మించి వరద వస్తే విద్యుత్ సరఫరా ఉండబోదన్నారు. వీలైనంత త్వరగా పునరావాస కేంద్రాలకు వచ్చేందుకు సిద్ధం కావాలని చెప్పారు. ఆయా గ్రామాల్లో రేషన్ దుకాణాల వద్దకు వెళ్లి నిత్యవసరాల సరుకులు పరిశీలించి, ప్రజలకు అందించాలని డీలర్లకు సూచించారు. పర్యటనలో డీఎంహెచ్‌వో విజయ, జిల్లా పంచాయతీ అధికారి ప్రభాకరరావు, తహసీల్దార్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

సహాయక చర్యలకు పోలీసు శాఖ సిద్ధం: ఎస్పీ

కృష్ణానది వరద సహాయక చర్యలకు పోలీసు శాఖ సర్వం సిద్ధమైనట్లు ఎస్పీ బి.ఉమామహేశ్వర్ పేర్కొన్నారు. బుధవారం కొల్లూరు మండలంలో కృష్ణానది వరద ఉధృతిని ఆయన పరిశీలించారు. అనంతరం భట్టిప్రోలు పోలీస్‌స్టేషన్‌లో విలేకరులతో ఆయన మాట్లాడారు. కొల్లూరు, భట్టిప్రోలు, రేపల్లె మండలాల్లోని నది పరీవాహక ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేస్తున్నామన్నారు. దోనేపూడి కరకట్ట దిగువన పోతార్లంక, పెదపులివర్రు వద్ద ఉన్న చప్టాలపై వరద నీరు ప్రవహిస్తోందన్నారు. ఇక్కడ రాకపోకలు జరగకుండా పోలీసు సిబ్బందిని ఏర్పాటు చేశామన్నారు. కరకట్ట బలహీనంగా ఉన్న ప్రదేశాలతో సైతం పోలీసు సిబ్బందిని ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. అరవింద వారది వద్ద వరద ప్రవాహాన్ని రేపల్లె డీఎస్పీ శ్రీనివాసరావు, వేమూరు సీఐ పీవీ ఆంజనేయులుతో కలిసి ఎస్పీ పరిశీలించారు. పెసర్లంక గ్రామస్తులతో మాట్లాడారు. వరదలకు ఆపదలో చిక్కుకున్న వారి సమాచారం అందిస్తే రెస్క్యూ బృందాలను పంపి రక్షిస్తామని, కంట్రోల్ రూమ్‌లు కూడా ఏర్పాటు చేశామని వివరించారు.



అరవింద వారధి వద్ద పెసర్లంక గ్రామస్థులతో మాట్లాడుతున్న ఎస్పీ

గ్రామాలను చుట్టుముట్టిన వరద

◆ వాణిజ్య పంటల మునక

కొల్లూరు, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): కృష్ణానదిలో వరద ఉధృతి క్రమేపీ పెరుగుతోంది. ప్రకాశం బ్యారేజీ నుంచి బుధవారం 4.38 లక్షల క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. దీంతో కొల్లూరు మండలంలోని పెసర్లంక, ఆవులవారిపాలెం, గాజుల్లంక గ్రామాలను వరద చుట్టుముట్టింది. నది అంచులకు పడిన గండి ప్రదేశాల నుంచి వరద నీరు పోటెత్తి కొల్లూరు కరకట్టను తాకింది. లోతట్టు ప్రాంతాల్లోని ఇసుక బట్టీలను నీరు ముంచేసింది. చింతల్లంక, పెసర్లంక, ఆవులవారిపాలెం, గాజుల్లంక, పోతార్లంక పరిధిలోని వాణిజ్య పంటలతో పాటు అపరాలు, కూరగాయ తోటలు ముంపునకు గురయ్యాయి. దోనేపూడి కరకట్ట దిగువన పోతార్లంక చప్టాపై నీరు ప్రవహించడంతో నాలుగు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. భట్టిప్రోలు మండలంలో పెదపులివర్రు వద్ద చినరేవు చప్టాపై నీటి ప్రవాహిస్తుంది.

వరద నీటిలో మునిగిన అరటి తోట



ఆర్వోబీ.. అంతేనా?

నిరాశలో చీరాలవాసులు

సమన్వయ లోపంతో రద్దైనట్లు ప్రజల్లో చర్చ

చీరాల, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): ప్రతీ సారి ఎన్నికల ప్రచారంలో నేతల హామీల్లో ప్రధానంగా ఉండే చీరాల పట్టణ పరిధిలో వైకుంఠపురం రైలు గేటు వద్ద ఆర్వోబీ నిర్మాణాన్ని రైల్వేబోర్డు రద్దు చేసి ఏడాది అవుతోంది. అప్పటి నుంచి ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదు. అటు నేతలు, ఇటు అధికారులు ఆర్వోబీ సమస్యపై దృష్టి సారించడంలేదని ప్రజలు ఆగ్రహంగా ఉన్నారు. వైకుంఠపురం, విఠల్‌నగర్, ప్రకాష్‌నగర్, ఎంజీసీకాలనీ, దండుబాటరోడ్డు, జవహర్‌నగర్ ప్రాంతాలకు చెందిన ప్రజలు రైలు గేటు మీదగా వివిధ వృత్తి, ఉపాధి, విద్య, వైద్యం కోసం పట్టణానికి వస్తుంటారు. రైలు గేటుతో నిత్యం గంటల తరబడి గేట్లు వేస్తుండటంతో ప్రజలు ఎండకు ఎండుతూ, వానకు తడుస్తూ నానాయాతన పడుతున్నారు. ఈ పరిస్థితుల్లో వైకుంఠపురం వద్ద ఆర్వోబీ నిర్మించేందుకు అధికారులు ప్రయత్నాలు సాగించారు. సుమారు 800 మీటర్లు పొడవుతో రూ.50 కోట్లు అంచనాతో 2017- 18లో డీపీఆర్‌లు సిద్ధం చేశారు. 2022లో సేతు బంధన్ ద్వారా రూ.55 కోట్లు నిధులు కూడా మంజూరయ్యాయి. దీంతో ప్రజలు కూడా ఆర్వోబీపై ఆశగా ఎదురుచూశారు. సైట్ ప్లాన్, డ్రాయింగ్, పూర్తి జరిగి టెండర్ పిలిచే దశలో ఉండగా 2024 అక్టోబరు 16న రద్దు చేశారు. అధికారులు చొరవ తీసుకుని ఉంటే ఆర్వోబీ నిర్మాణం జరిగి ఉండేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. వంతెన నిలిచిపోవడానికి పాలకుల మధ్య సమన్వయ లోపం కూడా కారణమని ప్రజల్లో చర్చ నడుస్తుంది.



వైకుంఠపురం రైల్వే గేటు

ఆర్వోబీపై అసెంబ్లీలో ఎమ్మెల్యే వాణి

తాజాగా గురువారం అసెంబ్లీలో ఎమ్మెల్యే కొండయ్య ఈ ఆర్వోబీ సమస్యను ప్రస్తావించారు. ఆర్వోబీ రద్దుతో ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నట్లు వివరించారు.

శింగరకొండపై శీతకన్ను

● పర్యాటక అభివృద్ధికి అవకాశాలెన్నో

● దృష్టి సారించని అధికారులు, ప్రజాప్రతినిధులు

అద్దంకి, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): శింగరకొండ ఆధ్యాత్మిక కేం ద్రంగా వెలుగొందుతోంది. పర్యాటక కేంద్రంగా అభివృద్ధికి ఎన్నో అవకాశాలు ఉన్నాయి. అయితే గత కొన్నేళ్లగా ఆ దిశగా అధికారులు, ప్రజాప్రతినిధులు దృష్టి సారించడం లేదన్న విమర్శలు వస్తున్నాయి. 1918లో శింగరకొండ వద్ద భవనాసి చెరువును నిర్మించారు. 2009లో దానిని రిజర్వాయర్‌గా మార్చేందుకు శంకుస్థాపన చేగా చాలావరకు పనులు పూర్తయ్యాయి. కొండపైన లక్ష్మీనరసింహస్వామి, కొండ కింద చెరువు అంచున ప్రసన్నాంజనేయస్వామి దేవాలయాలతో పాటు సుమారు 10కి పైగా ఆలయాలు, అన్ని సామాజికవర్గాలకు అన్నదాన సత్రాలు ఉన్నాయి. ఇలా ఆధ్యాత్మికంగా శింగరకొండ అభివృద్ధి చెందింది. చెరువు అంచునే చెన్నై, ఇటు హైదరాబాద్‌లను కలుపుతూ నామ్ రోడ్డు ఉంది. అద్దంకికి కూతవేటు దూరంలో విజయవాడ-బెంగళూరు గ్రీన్‌ఫీల్డ్ హైవే నిర్మాణం జరుగుతుంది. ఈ క్రమంలో భవనాసి చెరువులో బోట్‌షికారు ఏర్పాటుతో పాటు చెరువు మధ్యలో ఎత్తైన అంజనేయస్వామి విగ్రహం ఏర్పాటు చేసి పార్కును నిర్మిస్తే పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చెందేందుకు అవకాశం ఏర్పడుతుందని పలువురు భావిస్తున్నారు. దశాబ్దం క్రితం పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేసేందుకు అప్పటి కేంద్ర మంత్రి పనబాక లక్ష్మి రూపొందించిన ప్రతిపాదనలు కార్యరూపం దాల్చలేదు. ప్రస్తుతం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పర్యాటక రంగానికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నందున శింగరకొండ, భవనాసి చెరువులపై ఎంపీ కృష్ణప్రసాద్, మంత్రి గొట్టిపాటి రవికుమార్ ప్రత్యేకదృష్టి సారించాలని అద్దంకివాసులు కోరుతున్నారు.

శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి దేవాలయం



గ్రానైట్ ముడి రాళ్లు తరలింపు

సీనరేజ్ తప్పించుకునేందుకు ముందస్తు నిల్వ

బల్లికురవ, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): మైనింగ్ సీనరేజ్ నుంచి తప్పించుకునేందుకు గ్రానైట్ ఫ్యాక్టరీల నిర్వాహకులు ముందస్తు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. మరో ఆరు రోజుల్లో మైనింగ్ సీనరేజ్ వసూళ్లకు ప్రైవేటు కంపెనీ ఎక్కడికక్కడ చెక్‌పోస్టులను ఏర్పాటు చేస్తోంది. చెక్‌పోస్టులు ప్రారంభమైతే బిల్లులు లేకుండా ఒక్క రాయి కూడా తరలించడం సాధ్యంకాదు. దీంతో చెక్‌పోస్టులు ప్రారంభమయ్యేలోగా గ్రానైట్ ముడిరాళ్లను రవాణా చేసుకుని నిల్వ పెడుతున్నారు. బల్లికురవ వీర్లకొండ గ్రానైట్ క్వారీల నుంచి ముడి రాళ్ల బ్లాకులను మార్టూరు, వేమవరం, గుళ్లాపల్లి, మేదరమెట్ల తదితర ప్రాంతాల్లోని గ్రానైట్ ఫ్యాక్టరీలకు తరలిస్తున్నారు. మైనింగ్ అధికారులు పట్టించుకోకపోవడంతో బుధవారం ఒక్క రోజే సుమారు 150 లారీల ముడి రాళ్ల రవాణా జరిగినట్లు సమాచారం. ఒక్కో లారీకి రెండు మూడు రాళ్లు కూడా వేసి రవాణా చేశారు.



వీర్లకొండ క్వారీల నుండి ఒక్కో లారీకి మూడు రాళ్లు వేసి ఫ్యాక్టరీలకు రవాణా

గెలాక్సీ గ్రానైట్ క్వారీ ఓనర్ల అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నిక

అధ్యక్షునిగా శిద్దా సుధీర్, ప్రధాన కార్యదర్శిగా రవి



సుధీర్‌కుమార్, రవి

చీమకుర్తి, సెప్టెంబరు 24(ఆంధ్ర జ్యోతి) : గెలాక్సీ గ్రానైట్ క్వారీ ఓనర్ల అసోసియేషన్ నూతన అధ్యక్షునిగా యువపారిశ్రామికవేత్త శిద్దా వీరవెంకట సుధీర్‌కుమార్ ఎన్నికయ్యారు. అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నిక ప్రక్రియ బుధవారం ఒంగోలులో నిర్వహించారు. గౌరవ అధ్యక్షుడుగా పోతుల రామారావు, అధ్యక్షునిగా శిద్దా సుధీర్‌కుమార్, ప్రధాన కార్యదర్శిగా ఆర్‌పీ రవి, కోశాధికారిగా చలువాది బదరీనారాయణలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షులుగా శిద్దా భరత్, కె.శైలజ, శ్రీధర్, ఆనంద్, జాయింట్ సెక్రటరీలుగా భాస్కరరెడ్డి, నవీన్‌కుమార్‌రెడ్డి, ఈసీ సభ్యులుగా శిద్దా సూర్యప్రకాశరావు, చలువాది సాకేత్‌రామానుజ, నూనె వంశీకృష్ణ, ఎండీ రఫీ, చంద్రారెడ్డి, శ్రీనివాసులు, ఎన్‌వీ రెడ్డిలను ఎన్నికయ్యారు.

మంత్రి లోకేశ్‌కు కృతజ్ఞతలు తెలిపిన పండిత పరిషత్

మార్కాపురం, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : డీఈవో పూల్ బాషా పండితుల ఉద్యోగోన్నతులకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చిన విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్‌కు పండిత పరిషత్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు ఎన్.సంపత్‌కృష్ణ, రవిచంద్ర ఒక ప్రకటనలో కృతజ్ఞతలు తెలిపారు. దశాబ్దాలుగా వెట్టి చాకిరీకి గురవుతున్న భాషా పండితుల సమస్యల పట్ల గత టీడీపీ ప్రభుత్వం సానుకూలంగా స్పందించిందన్నారు. కేబినేట్, ఆర్థికశాఖల ఆమోదంతో రాష్ట్రవ్యాప్తంగా 10,224 మంది బాషా పండితుల పోస్టులను స్కూల్ అసిస్టెంట్‌లుగా ఉన్నతీకరణ చేస్తూ 2018 డిసెంబరు 17న జీవో 91 విడుదల చేసిందన్నారు. కొన్ని సంఘాల కుయుక్తుల వలన సుమారు వెయ్యిమందికి పైగా బాషా పండితులు ఉద్యోగోన్నతులు రాక, పని చేయడానికి తాము నియామకమైనా పోస్టులు లేక గత ఆరేళ్లుగా డీఈవో పూల్‌లో ఉంటూ అనేక ఇబ్బందులు పడినట్లు తెలిపారు. మంత్రి లోకేశ్ దృష్టికి తీసుకెళ్లిన వెంటనే మిగిలిన బాషా పండితుల ఉద్యోగోన్నతులు కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడం వారి చిత్తశుద్ధికి నిదర్శనమన్నారు.

సంతకాల సేకరణ

గిద్దలూరు, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): ఓట్ల దొంగ గద్దె దిగు అని రాహుల్ గాంధీ చేస్తున్న పోరాటానికి మద్దతుగా కాంగ్రెస్ నాయకులు సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. పట్టణంలోని ముఖ్యకూడళ్లలో సంతకాల సేకరణ చేపట్టారు. నియోజకవర్గ ఇన్‌చార్జి పగడాల రంగస్వామి, కాంగ్రెస్ నాయకులు డి.శేఖర్‌రెడ్డి, యు.పోలయ్య, మండలశాఖ అధ్యక్షుడు జమాల్‌సాబ్ పాల్గొని మాట్లాడుతూ ఉన్న ఓట్లను తొలగించి బీజేపీ ఓట్ చోరీకి పాల్పడిందని ఆరోపించారు.

అన్నపూర్ణదేవి అలంకరణలో అమ్మవారు



అన్నపూర్ణదేవి అలంకరణలో ఉమామహేశ్వరి

మేదరమెట్ల, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): దసర నవరాత్రుల సందర్భంగా మండలంలోని దేవాలయాల్లో అమ్మవారు అన్నపూర్ణదేవిగా దర్శనమిచ్చారు. బుధవారం దైవాలరావూరులోని ఉమామహేశ్వర స్వామి ఆలయంలో అమ్మవారిని పూజారి రాజశేఖర్‌శర్మ.. అన్నపూర్ణదేవిగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. రావినూతలలోని వాసవీ కన్యకపరమేశ్వరి అమ్మవారి ఆలయం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మేదరమెట్లలోని మిద్దెలడొంకలో ఉన్న మల్లేశ్వరస్వామి ఆలయంలో అమ్మవారి అన్నపూర్ణదేవిగా అలంకరించారు.

ట్రస్ట్‌బోర్డు సభ్యులకు ఆర్యవైశ్య నేతల అభినందన

అద్దంకి, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): శింగరకొండ ప్రసన్నాంజనేయ స్వామి దేవాలయం ట్రస్ట్‌బోర్డు సభ్యులుగా నియమితులైన టీడీపీ నేత చుండూరి మురళీసుధాకరరావు, జనసేన నేత బత్తుల చంద్రశేఖర్, బీజేపీ నేత దేవరపల్లి సురేష్‌బాబులను బుధవారంఆర్యవైశ్య నాయకులు అభినందించారు.నేతలు చిన్ని శ్రీనివాసరావు, భోజనపల్లి సత్యనారాయణ, అత్తులూరి రమేష్, గార్లపాటి శ్రీనివాసరావు, తమ్మన శ్రీనివాసరావు, కురిచేటి చిన్ని, కురిచేటి శంకరరావు, పబ్బిశెట్టి శ్రీనివాసరావు, చామర్తి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయం.. ఆదర్శనీయం

త్రిపురాంతకంలో ఎనిమిదేళ్లుగా అదే పంథా కొనసాగింపు

జీవామృతం, ఘనామృతం, నీమాస్త్రం, అగ్ని అస్త్రం తయారీ

రెండెకరాల్లో దేశవాళీ రకాల పంటలు

రైతు త్రిపురాంతకేశ్వరరెడ్డి విజయగాథ



ఘనామృతాన్ని సిద్ధం చేస్తున్న త్రిపురాంతకేశ్వరరెడ్డి

త్రిపురాంతకం, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : నేలమ్మ శ్వాసను అర్థం చేసుకున్నాడు.. పంటల సాగు సరళిని మార్చుకున్నాడు.. ప్రకృతి వ్యవసాయాన్ని ఎంచుకున్నాడు.. సహజసిద్ధమైన పద్ధతిలో పంటలు సాగు చేస్తూ ఆర్థిక భద్రతే కాదు, ఆహార భద్రత, మానవ ఆరోగ్యభద్రత సాధించాలని లక్ష్యంగా పెట్టుకున్నాడు ఓ రైతు. డిగ్రీ ఉత్తీర్ణత సాధించి తెలుగు లిటరేచర్ చదివిన ఆయన పయనం వ్యవసాయం వైపు సాగింది. అదీ పూర్తిగా ప్రకృతి వ్యవసాయంలోనే నిమగ్నమయ్యాడు. ప్రస్తుతం ఎందరినో ఆ దిశగా నడిపేందుకు శిక్షణ ఇస్తూ, తాను ఇంకా రాటుదేలుతూ రసాయనాలు లేకుండా పంటలు పండించవచ్చని ప్రకృతికి హానిచేయకుండా జీవనోపాధి సాధించవచ్చని తన కృషితో నిరూపిస్తున్నాడు. త్రిపురాంతకానికి చెందిన రైతు చల్లా త్రిపురాంతకేశ్వరరెడ్డి విజయగాథ ఇది.

త్రిపురాంతకానికి చెందిన చల్లా త్రిపురాంతకేశ్వరరెడ్డి డిగ్రీ పట్టా పొందిన తరువాత కూడా ఉద్యోగ అవకాశాల వైపు దృష్టి సారించలేదు. వివిధ రకాల ఆదాయ మార్గాలను అన్వేషిస్తున్న తరుణంలో 2017లో కాకినాడలో ప్రకృతి వ్యవసాయంపై పాలేకర్ మాటలు విని ఆయన దృష్టి వ్యవసాయంపై పడింది. అప్పటి నుంచి ప్రకృతి వ్యవసాయం చేస్తూ ఎటువంటి రసాయనాల వినియోగం లేని పంటలు పండిస్తూ తనకున్న రెండెకరాల పొలంలోనే వివిధ రకాల పంటలు పండిస్తూ వస్తున్నారు. పంటలకు జీవామృతం, ఘనామృతం, నీమాస్త్రం, అగ్ని అస్త్రం తయారు చేస్తూ.. వినియోగిస్తూ సహజ సిద్ధమైన పద్ధతుల్లో మేలురకం పంటలు పండిస్తున్నారు.

రెండేసి గేదెలు, ఆవులతో సాగు

గతంలో పెసర, మినుములు, వరి వంటి మేలైన వంగడాలు పండించిన రైతు తమ కుటుంబానికి అవసరమైన కూరగాయలు కూడా స్వయంగా పండించుకుని తింటున్నారు. తన వ్యవసాయ పద్ధతుల కోసం రెండు గేదెలు, రెండు ఆవులను పెంచుకుంటూ వాటి ద్వారానే వ్యవసాయ అవసరాలు తీర్చుకుంటున్నట్లు చెప్పారు. పలుమార్లు ప్రకృతి వ్యవసాయంపై శిక్షణ పొందిన త్రిపురాంతకేశ్వరరెడ్డి సహజ వ్యవసాయంపై జాతీయ మిషన్ ద్వారా పలువురు రైతులకు శిక్షణ ఇచ్చేందుకు ఎంపికై ప్రస్తుతం తెనాలిలో అత్తోట వద్ద జరుగుతున్న తరగతుల్లో శిక్షణ పొందుతున్నాడు. జాతీయ వ్యవసాయ మిషన్ (ఎన్‌ఎంఎన్‌ఎఫ్) ద్వారా నెలకు రూ.6వేల పారితోషకం కూడా అందుకుంటుండడం గమనార్హం.

రత్నసోలి వెరైటీ వరి సాగు చేస్తున్నా

రైతు త్రిపురాంతకేశ్వర రెడ్డి

ప్రస్తుతం దేశవాళీ వెరైటీ రత్నసోలి రకం వరిని సాగుచేస్తున్నా. నెల్లూరు నుంచి విత్తనాలు తెచ్చి 20 రోజుల్లో నారు నాటా. ఈ వరి దాదాపు 4 నుంచి 5 అడుగులు ఎత్తు పంట పెరుగుతుంది. ఎకరాకు 30 బస్తాలకు తగ్గకుండా దిగుబడి వస్తుంది. ఇతర రకాల వరికన్నా దీనికి అధిక ధర వస్తుంది. ప్రస్తుతం 50కిలోల వరి ధాన్యం బస్తా రూ.4వేలు పలుకుతోంది. సాగు చేస్తున్న 1.50 ఎకరాల పంటకు దాదాపు 50 బస్తాలు పండితే 4 వేల చొప్పున రూ.2లక్షలు ఆదాయం వస్తుంది. ప్రకృతి సిద్ధమైన ఎరువు వాడకం వల్ల కేవలం రూ.20వేల ఖర్చు మాత్రమే వస్తుంది. ఈ లెక్కన దాదాపు 1లక్షా 80వేలు ఆదాయం వస్తుంది. ప్రకృతి వ్యవసాయం ద్వారా ఆర్థిక అవసరాలు తక్కువ ఆరోగ్య ప్రయోజనాలు ఎక్కువగానూ ఆదాయ వనరులు మెరుగ్గానూ ఉంటాయి.



సాగు చేస్తున్న వరి

శింగరకొండ దేవాలయం ట్రస్ట్‌బోర్డు సభ్యుల నియామకం

చైర్మన్‌గా మురళీసుధాకరరావు ఎన్నిక లాంఛనమే



శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి దేవాలయం

అద్దంకి, సెప్టెంబరు24 (ఆంధ్రజ్యోతి) : శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి దేవాలయం ట్రస్ట్‌బోర్డు సభ్యులను నియమిస్తూ ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఉమ్మడి ప్రకాశం జిల్లాలో ప్రధాన దేవాలయాలలో ఒకటిగా శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి దేవాలయం ఉంది. ఈ ఆలయం ట్రస్ట్‌బోర్డు నియామకంపై ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత పలువురు తమ వంతు ప్రయత్నాలు చేశారు. ఈ నేపథ్యంలో అద్దంకి పట్టణంలోని ఆర్యవైశ్య సామాజిక వర్గానికి చెందిన చుండూరి మురళీసుధాకరరావుకు చైర్మన్‌గా దక్కే అవకాశం ఉందని టీడీపీ వర్గీయులలో చర్చ సాగింది. అదేవిధంగా బుధవారం రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన సభ్యుల జాబితాలో చుండూరి మురళీసుధాకరరావు పేరు ఉంది. మొత్తం 11 మంది సభ్యులతో ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు ఇచ్చింది. మురళీసుధాకరరావు, ఆకుల కోటేశ్వరమ్మ, బత్తుల చంద్రశేఖర్, నూతి లక్ష్మీప్రసాద్, మద్దా సునీత, ఏల్చూరి వెంకట నారాయణమ్మ, దూళిపాళ్ల వెంకటరత్నం, గొర్రెపాటి పద్మజ, అరబోలు నాగమ్మ, దేవరపల్లి సురేష్‌బాబు, కోనంకి సుబ్బారావుల తోపాటు ఎక్స్ అఫిసియో సభ్యుడిగా కోట లక్ష్మీనారాయణను నియమిస్తూ ప్రభుత్వ ఎక్స్ అఫిసియో సెక్రటరీ హరిజవహర్‌లాల్ బుదవారం ఉత్తర్వులు ఇచ్చారు. ఈ మేరకు శింగరకొండ ప్రసన్నాంజనేయ స్వామి దేవాలయానికి కూడా ఉత్తర్వులు అందినట్లు ఈవో, అసిస్టెంట్ కమిషనర్ తిమ్మానాయుడు తెలిపారు. 11 మంది సభ్యులు ప్రమాణస్వీకారం చేసిన తరువాత మురళీసుధాకరరావును చైర్మన్‌గా ఎన్నుకోవటం లాంఛనమే కానుంది. తమ నియమాకానికి కృషి చేసిన మంత్రి గొట్టిపాటి రవికుమార్‌కు మురళీసుధాకరరావు, మిగిలిన సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.



మురళీసుధాకరరావు

డప్పు, టపాసులతో అడవి జంతువుల నుంచి సిబ్బందికి రక్షణ

రైలు పట్టాలపై అదనపు గస్తీ

గిద్దలూరు, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): నల్లమల అటవీ ప్రాంతంలో పులుల సంఖ్య పెరిగింది. ఇతర అడవి జంతువుల సంఖ్య కూడా రోజురోజుకూ పెరుగుతున్నది. గ్రామ శివార్లలోకి పులులు వచ్చి పశువులను చంపుతున్న ఘటనలు చోటుచేసుకుంటున్నాయి. ఈనేపథ్యంలో రైల్వే శాఖ సిబ్బందిని కాపాడుకునేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టింది. అదనపు సిబ్బందితోపాటు పులుల బారినపడకుండా సిబ్బందికి డప్పులు, టపాసులు సమకూర్చింది. గుంటూరు - గుంతకల్లు రైలు మార్గంలో, గిద్దలూరు - నంద్యాల మధ్య దట్టమైన అటవీ ప్రాంతం నుంచి రైలు వెళ్లాల్సి ఉంది. పగలు, రాత్రి తేడా లేకుండా రైల్వే గ్యాంగ్ సిబ్బంది రైలు పట్టాల వెంట డ్యూటీ చేయాల్సి ఉంటుంది. అటవీ జంతువుల బారి నుంచి ప్రయాణికులను, సిబ్బందిని కాపాడుకునేందుకు రైల్వే శాఖ ఉన్నతాధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. దిగువమెట్ట నుంచి చలమ వరకు ఈ రెండు రైల్వేస్టేషన్ల మధ్య 16 కిలోమీటర్లమేర దట్టమైన అటవీ ప్రాంతం ఉంది. ఈ 16 కిలోమీటర్లను 3 భాగాలుగా విభజించి పెట్రోలింగ్ కోసం 3 టీములను ఏర్పాటు చేశారు. పగటిపూట ట్రాక్‌లు తనిఖీ చేసే కీమెన్ భద్రత కోసం ఒకరికి బదులు ఇద్దరిని కేటాయించారు. రాత్రివేళల్లో ముగ్గురు సభ్యులను బృందాలుగా పంపాలని నిర్ణయించారు. డ్రమ్స్, టపాసులను సిబ్బందికి సమకూర్చారు. అడవి జంతువులు కనిపిస్తే డప్పు వాయిస్తూ రైల్వే సిబ్బంది తమకు తాము రక్షించుకోవడంతోపాటు రైలు ప్రయాణికులను కూడా రక్షించడానికి ఉపకరిస్తుందని గుంటూరు డివిజన్ రైల్వే శాఖ అధికారి వినయ్‌కాంత్ తెలిపారు. 16 కిలోమీటర్ల ఘాట్ రోడ్డులో పులులు, చిరుతలు, ఎలుగుబంట్ల సంచారం పెరగడం వలన ఈ భద్రత చర్యలను అమల్లోకి తెచ్చినట్లు తెలిపారు.



విధులు నిర్వహిస్తూ డప్పు కొడుతున్న రైల్వే సిబ్బంది

ఎట్టకేలకు రోడ్డెక్కిన గ్యాస్ ట్యాంకర్

మూడు ఎక్స్‌కవేటర్ల సహాయంతో రోడ్డుపైకి ట్యాంకర్

పర్యవేక్షించిన జిల్లా అగ్నిమాపక అధికారి

నామ్ రోడ్డుపై ట్రాఫిక్ నిలిపివేత

అద్దంకి, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి) : రోడ్డు అంచులోకి ఒరిగిపోయిన గ్యాస్ ట్యాంకర్‌ను రెండు రోజుల నుంచి తీవ్రంగా ప్రయత్నించి బుధవారం మధ్యాహ్నానికి రోడ్డు పైకి చేర్చారు. మూడు రోజుల క్రితం అర్ధరాత్రి సమయంలో చెన్నై నుంచి హైదరాబాద్ వైపు వెళ్తున్న గ్యాస్ ట్యాంకర్ అదుపు తప్పి అద్దంకి మండలం శ్రీనివాసనగర్ వద్ద నామ్ రోడ్డు అంచులోనికి వరిగింది. మంగళవారం రెండు ఎక్స్‌కవేటర్ల సహాయంతో తీవ్రంగా ప్రయత్నించినా రోడ్డు పైకి చేరలేదు. దీంతో బుధవారం విజయవాడ నుంచి తీసుకొచ్చిన రెండు భారీ ఎక్స్‌కవేటర్లు, స్థానికంగా ఉన్న మరో ఎక్స్‌కవేటర్ సహాయంతో సుమారు రెండున్నర గంటల పాటు శ్రమించి రోడ్డుపైకి చేర్చారు. ఈ సమయంలో నామ్ రోడ్డుపై ట్రాఫిక్ నిలిపివేశారు. 18 టన్నుల గ్యాస్‌తో పాటు మొత్తం ట్యాంకర్ బరువు సుమారు 35 టన్నుల వరకు ఉంది. దీంతో రోడ్డు అంచులో నుంచి రోడ్డు పైకి చేర్చేందుకు తీవ్రంగా శ్రమించాల్సి వచ్చింది. జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి వినయ్ పర్యక్షించారు. అద్దంకి పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేయటంతో పాటు నామ్ రోడ్డుపై ట్రాఫిక్ మళ్లించారు. గ్యాస్ లీకైతే పెను ప్రమాదం జరిగే అవకాశం ఉండటంతో అగ్నిమాపక, పోలీస్‌శాఖ అధికారులు అన్ని ముందస్తు జాగ్రత్తలు తీసుకున్నారు.



భారీ క్రేన్‌ల సహాయంతో రోడ్డు పైకి చేర్చుతున్న గ్యాస్ ట్యాంకర్

ప్రకాశం టూ చెన్నై వయా నెల్లూరు

- **రేషన్ బియ్యం రాకెట్ రూట్ ఇది..**
- **రవాణాదారుడు మహేష్‌రెడ్డిపై కేసు నమోదు**
- **పట్టుబడిన బియ్యం ఎంఎల్‌ఎస్ పాయింట్‌కు**

నెల్లూరురూరల్,సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి) : రేషన్ బియ్యం అక్రమ రవాణా గుట్టురట్టైంది. స్మగ్లింగ్ రూటు బహిర్గతం కావడంతో అధికార, రాజకీయ వర్గాలు విస్మయం వ్యక్తం చేస్తున్నాయి. ప్రకాశం జిల్లా నుంచి సేకరించిన రేషన్ బియ్యాన్ని లారీల్లో లోడ్ చేసి చెన్నైలోని మార్కెట్‌కు తరలిస్తూ వయా నెల్లూరులో ఆగడంతో భారీగా బియ్యం పట్టుబడినట్లు పౌరసరఫరాల శాఖకు చెందిన ఓ అధికారి తెలిపారు. సాధారణ బియ్యం రవాణా మాటున రేషన్ బియ్యం కూడా తరలించేందుకు సిద్ధం చేసుకున్న ప్రణాళిక బెడిసికొట్టడంతో రెండు లారీల్లోని బియ్యం పట్టుబడినట్లు ఆ అధికారి చెప్పుకొచ్చారు. ప్రకాశం జిల్లాలో రేషన్ షాపుల ద్వారా రహస్యంగా సేకరించిన బియ్యం చెన్నై మార్కెట్‌కు తరలించే బాధ్యతను అనంతరసాగరం మండలం వెంగంపల్లికి చెందిన బట్టిరెడ్డి మహేష్‌రెడ్డి తీసుకున్నట్లు పౌరసరఫరాల శాఖ అధికారులు ప్రాథమికంగా గుర్తించారు.



పట్టుబడిన బియ్యం లారీలు

పట్టుబడిన లారీలు ఆయనవే కావడంతో పౌరసరఫరాల శాఖ ఆయనపై 6ఏ కేసును నమోదు చేయగా, ఇటు నెల్లూరురూరల్ పోలీసులు సీఎస్‌డీటీ జమీర్‌బాషా ఇచ్చిన ఫిర్యాదుతో 7 ఆఫ్ ఈసీ చట్టం కింద కేసు కట్టినట్లు సీఐ గుంజి వేణు బుధవారం తెలిపారు. కాగా పట్టుబడిన రేషన్ బియ్యాన్ని నిల్వ చేసేందుకు పౌరసరఫరాల శాఖ నేతృత్వంలోని ఎంఎల్‌ఎస్ గోదాములకు తరలించారు.

నెల్లూరులో ఎందుకు ఆపారు...?

అధికారులకు పట్టుబడింది రెండు లారీల రేషన్ బియ్యమే అయినా, చెన్నైలోని స్మగ్లింగ్ మార్కెట్ కేంద్రంగా భారీ రాకెట్ నడుస్తున్నట్లు నిఘా వర్గాలు అంచనా వేస్తున్నాయి. పేదలకు ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్న రేషన్ బియ్యానికి ఏకంగా రూ. 46 వరకు వ్యాపారులకు కొనుగోలు సమయంలో చెల్లిస్తున్నట్లు తెలుస్తోంది. వీటిని పలువురు తినేందుకు ఇష్టపడక రేషన్ డీలర్లకు కేజీ రూ. 10ల చొప్పున అమ్మేసి సొమ్ముచేసుకుంటున్నారు. ఇలా సేకరించిన బియ్యాన్ని మండలాల వారీగా మాఫియా వ్యక్తులు జిల్లాకు కేజీ రూ. 15 నుంచి 20ల వరకు అమ్ముతున్నట్లు సమాచారం. ఈ మార్గాల ద్వారా రేషన్ బియ్యం స్మగ్లింగ్ చేసే సిండికేట్లు భారీగా నిల్వ చేసి చెన్నైకు తరలిస్తున్నట్లు తాజాగా పట్టుబడిన లారీగా రాకెట్ ద్వారా సమాచారాన్ని నిఘా వర్గాలు సేకరించినట్లు తెలుస్తోంది. కాగా మహేష్‌రెడ్డి అనే వ్యక్తి రెండు లారీల్లో రేషన్ బియ్యాన్ని నింపి మరో మూడు లారీల్లో సాధారణ బియ్యం నింపి నెల్లూరులో ఎందుకు ఆపారు...? వీటితో పాటు మరిన్ని లారీలు ఒకే సారి చెన్నై బయల్దేరే అవకాశమేమైన ఉందా...? ఉంటే ఆ లారీలు ఎక్కడ...? అన్నది ప్రస్తుతం దర్యాప్తు అధికారులు ఆరా తీస్తున్నారు.

అవీఇవీ

పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఎనలిస్టుగా బాజీ

ముక్తేశ్వరం పంచాయతీ కార్యదర్శిగా విధులు నిర్వహిస్తూనే ఎంపిక



తురిమెళ్ల బాజీ

బల్లికురవ, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి) : మండలంలోని ముక్తేశ్వరం గ్రామ పంచాయతీ కార్యదర్శిగా పనిచేస్తున్న షేక్ తురిమెళ్ల బాజీ రాష్ట్ర పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్‌లో గ్రేడ్-2 ఎనలిస్టుగా ఎంపికయ్యారు. రాష్ట్రస్థాయిలో పొల్యూషన్ కంట్రోల్ బోర్డు పరీక్షలను ఈ ఏడాది మార్చిలో నిర్వహించారు ఈ పరీక్షలలో పంచాయతీ కార్యదర్శి తురిమెళ్ల బాజీ పాల్గొని ఉత్తీర్ణత సాధించారు. జూలైలో సీసీటీ పరీక్షలు నిర్వహించారు. ఈ పరీక్షలో రాష్ట్రవ్యాప్తంగా 40 మంది క్వాలిఫై కాగా వారిలో 18 మందిని ఎనలిస్టులుగా ఎంపిక చేశారు. మంగళవారం రాత్రి పొల్యూషన్ బోర్డు విడుదల చేసిన ఫలితాలలో సత్తాచాటిన బాజీ ఎనలిస్టు పోస్టుకు ఎంపికయ్యారు. సంతమాగులూరు మండలం ఏల్చూరుకు చెందిన షేక్ తురిమెళ్ల బాజీ ఐదేళ్ల నుంచి పంచాయతీ కార్యదర్శిగా విధులు నిర్వహిస్తున్నారు. చిన్నతనం నుంచే చదువపై మక్కువతో ఆమె గ్రూప్స్ పరీక్షలు రాయాలని పట్టుదలగా ముందుకు వెళ్లారు. ఒక వైపు పంచాయతీ కార్యదర్శిగానే పనిచేస్తునే ఖాళీ సమయంలో చదువుతూ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు పరీక్షలు రాసి రాష్ట్రస్థాయిలో ఉత్తీర్ణత సాధించారు. ఈ సందర్భంగా అమెను ఏల్చూరు గ్రామస్థులతో పాటు తోటి ఉద్యోగులు ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా బాజీ మాట్లాడుతూ తాను పట్టుదలతో చదివానని ఏదైనా ఉన్నత ఉద్యోగం చేయాలనే సంకల్పంతో ముందుకు వెళ్లి విజయం సాధించానని తెలిపారు.

లోక్ కల్యాణ్ పథకాన్ని వినియోగించుకోవాలి



మాట్లాడుతున్న నగరపంచాయతీ కమిషనర్ కేఎల్ఎన్ రెడ్డి

పొదిలి, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన లోక్ కల్యాణ్ పథకాన్ని వినియోగించుకోవాలని నగరపంచాయతీ కమిషనర్ కేఎల్‌ఎన్‌రెడ్డి చెప్పారు. బుధవారం నగర పంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన లోక్ కల్యాణ్ మేళాపై వీధి వ్యాపారులకు జరిగిన అవగాహన కార్యక్రమంలో కమిషనర్ మాట్లాడారు. చిరువ్యాపారులు ఆర్థికంగా అభివృద్ధి చెందాలనే లక్ష్యంతో ప్రభుత్వం లోక్ కల్యాణ్ మేళాను అమలు చేస్తోందన్నారు. మొదటి విడతగా రూ.15వేలు, రెండో విడతగా రూ.25వేలు, మూడవ విడతగా రూ.50వేలు ఇవ్వనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వ్యాపారులు, సిబ్బంది పాల్గొన్నారు.

సీఆర్‌డీఏ భవనం రెడీ!

(7వ పేజీ తరువాయి)

భావించింది. 6.13 ఎకరాల విస్తీర్ణంలో.. తొలుత రూ.82 కోట్ల వ్యయంతో భవనాన్ని నిర్మించేలా కేపీసీ సంస్థకు కాంట్రాక్ట్ ఇచ్చారు. మధ్యలో వైసీపీ ప్రభుత్వంలో నిర్మాణ పనులు నిలిచిపోయాయి. అనంతరం కూటమి ప్రభుత్వం వచ్చాక 2024 అక్టోబరులో పనులు పునః ప్రారంభించారు. కాలతీతమై నిర్మాణ వ్యయం పెరిగిపోయింది. ఇంటీరియర్స్ వర్కులు కూడా కార్పొరేట్ కార్యాలయాలను తలదన్నే విధంగా ఉండాలన్న ఆకాంక్షతో రాష్ట్ర ప్రభుత్వం అదనంగా మరో రూ.160 కోట్లను మంజూరు చేసింది. దీంతో మొత్తం భవన నిర్మాణ వ్యయం రూ.240 కోట్లకు చేరింది.

ఎలివేషన్స్...అదుర్స్!

సీఆర్డీఏ భవన నిర్మాణాన్ని 3.62 ఎకరాల్లో చేపట్టారు. ముందర సుమారు రెండున్నర ఎకరాల విస్తీర్ణంలో పార్కింగ్, గ్రీనరీ పనులను చేపడుతున్నారు. భవనం ప్రవేశ ద్వారంపై అమరావతి గుర్తుగా ఇంగ్లీష అక్షరం ఏ ప్రతిబింబించే విధంగా ప్రత్యేకంగా మెటల్ లోవర్స్ పానల్స్‌ను చాలా ఆకర్షణీయంగా ఏర్పాటు చేశారు. దీంతో పాటే భవనం చుట్టూ ఎలివేషన్ కోసం మరిన్ని మెటల్ లోవర్స్ ప్యానల్స్‌ను నిలువు కడ్డీల రూపంలో చూడముచ్చటగా ఏర్పాటు చేశారు. రాత్రివేళల్లో వీటిపై విద్యుద్దీపకాంతులు విరజిమ్మేలా ప్రత్యేక లైటింగ్ ఏర్పాట్లు చేశారు. ఇక భవనం చుట్టూ మెటల్ లోవర్స్‌కు మధ్య అడుగున్నర ఖాళీ వచ్చేలా క్యాట్వాక్‌ను ఏర్పాటు చేశారు. ఇందులో మొక్కలను పెంచడం ద్వారా మరింత లుక్ తేనున్నారు. భవనానికి వెనుకవైపు 46వేల కిలోలీటర్ల సామర్థ్యంతో కల మురుగునీటి శుద్ధి కేంద్రాన్ని ఏర్పాటుచేశారు.

ఏ అంతస్తులో.. ఏముంది..?

మొత్తం భవనం జీ+7 రూపంలో టెర్రస్‌తో కూడి ఉంది. ఒక్కో అంతస్తును 33 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో నిర్మించారు. గ్రౌండు ఫ్లోర్‌లో రిసెప్షన్, ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్, బ్యాంకు, క్యాంటీన్ ప్రతిపాదించారు. మొదటి అంతస్తును పూర్తిగా సమావేశాల కోసం కేటాయించారు. ఇందు కోసం 250 సీటింగ్ సామర్థ్యంతో కూడిన ఓ సెమినార్ హాలు, 30 నుంచి 50 మంది పట్టే విధంగా నాలుగు కాన్ఫరెన్స్ హాళ్లు, ఓ డైనింగ్ హాలును నిర్మించారు. ఇక రెండో అంతస్తు నుంచి నాలుగో అంతస్తు వరకు ఉన్న మూడు ఫ్లోర్లు.. ఏపీ సీఆర్‌డీఏ కార్యకలాపాల కోసం వినియోగించాలని ప్రాథమికంగా నిర్ణయించారు. ప్రతిదానిలో 150 మంది వరకు సిబ్బంది పనిచేసేలా వర్కు స్టేషన్లు ఏర్పాటు చేశారు. బిల్డింగ్ మొత్తం ఏడు లిఫ్టులు ఏర్పాటు చేశారు. నాలుగేసి క్యాబిన్‌లు, ఫ్లోర్ ఇన్‌చార్జిగా వ్యవహరించే ఉన్నతాధికారి కోసం ప్రత్యేక చాంబర్ ఉంటుంది. మినీ మీటింగ్ హాళ్లను కూడా తీర్చిదిద్దారు. అయిదు, ఆరు ఫ్లోర్‌లను అమరావతి అభివృద్ధి సంస్థ (ఏడీసీ)కి కేటాయించే అవకాశం వుంది. ఏడవ అంతస్తులో మునిసిపల్ శాఖ మంత్రి క్యాబిన్, శాఖ ప్రిన్సిపల్ కార్యదర్శి, ఈఎస్‌సీ, డిజైన్ ఇంజనీరు చాంబర్లను చాలా అద్భుతంగా తీర్చిదిద్దారు. సిబ్బందికి వర్కు స్టేషన్ల వారీగా చాంబర్లు సిద్ధం చేశారు.

నీటి వనరుల నిర్వహణపై ప్రత్యేక దృష్టి

(7వ పేజీ తరువాయి)

ఆదేశించారు. వివిధ జలాశయాలను జియో కోఆర్డినేటర్స్ ఆధారంగా ఈ యాప్‌తో అనుసంధానం చేయాలన్నారు. తద్వారా నీటివనరుల నిల్వ వివరాలను ఎప్పటికప్పుడు తెలుస్తుందన్నారు. ఈ యాప్ ద్వారా జనలవరులశాఖలో పనిచేసే ఉద్యోగులు, ప్రధానంగా క్షేత్రస్థాయి సిబ్బంది అనుక్షణం అప్రమత్తంగా ఉండేందుకు అవకాశం ఉంటుందన్నారు. వివిధ జలాశయాలకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న మరమ్మతులు, ఇతర నిర్వహణ పనుల అంచనాలను రూపొందించాలన్నారు. మైనర్ చెరువుల్లోని మట్టిని స్థానికులు ఉచితంగా తీసుకెళ్లేందుకు అనుమతి కోసం రాష్ట్రప్రభుత్వానికి పంపేందుకు ప్రతిపాదనలు సిద్ధంచేయాలని ఆదేశించారు. సాగర్ కాలువ ద్వారా దర్శి నుంచి పొదిలికి మంచినీళ్ల సరఫరా చేసే పైపులైన్ పనులు త్వరగా పూర్తిచేసేలా సంబంధిత కాంట్రాక్టర్‌తో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఇరిగేషన్, ప్రాజెక్టులు, ఆర్‌డబ్ల్యూఎస్ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. సమావేశంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ బాలశంకరరావు, ఇరిగేషన్, ప్రాజెక్టుల ఈఈలు, డీఈఈలు, భూగర్భ నీటి వనరులశాఖ డిప్యూటీ డైరెక్టర్ వందనం పాల్గొన్నారు.

మహిళా కళాశాలలో ఎంఎస్సీ కంప్యూటర్స్ కోర్సు

ఒంగోలు విద్య, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : ఒంగోలులోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో 2025-26 విద్యా సంవత్సరానికి ఎంఎస్సీ కంప్యూటర్ సైన్స్ కోర్సుల్లో అడ్మిషన్లు జరుగుతున్నట్లు ప్రిన్సిపాల్ డి.కళ్యాణి ఒక ప్రకటనలో తెలిపారు. పీజీసెట్ అర్హత సాధించిన వారు కళాశాలలో ప్రవేశం కోసం ఈనెల 27లోపు వెబ్‌సైట్‌లో ఆప్షన్లు పెట్టుకోవాలని కోరారు.

అవీ..ఇవీ..

ఆహార అలవాట్లపై ప్రత్యేక శ్రద్ధ వహించండి

● ప్రిన్సిపాల్ ఎస్.మురళీ



విద్యార్థుల నుంచి శాంపిల్స్ సేకరిస్తున్న వైద్యులు

చీరాల, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు ఆహార అలవాట్లపై కచ్చితమైన శ్రద్ధ వహించాలని ప్రిన్సిపల్ డా.ఎస్ మురళీ పేర్కొన్నారు. బుధవారం స్థానిక వైఏ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు ఆరోగ్యంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈక్రమంలో యూత్ రెడ్ క్రాస్ ఆధ్వర్యంలో బ్లడ్ గ్రూపింగ్, ఆరోగ్యంపై అవగాహన నిర్వహించారు. కార్యక్రమంలో ఏరియా వైద్యశాల వైద్యులు డా.రాజాసెల్వన్, ల్యాబ్ సిబ్బంది తిరుమలరావు, బాలాజీ నాయక్, కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

ఎంపీడీవోగా ధనలక్ష్మి బాధ్యతల స్వీకరణ



ఎంపీడీవోకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న సిబ్బంది

చినగంజాం, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి) : చినగంజాం మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా కే.ధనలక్ష్మి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఉమ్మడి ప్రకాశం జిల్లా ప్రజా పరిషత్తు పరిధిలో పరిపాలనాధికారిగా విధులు నిర్వహిస్తూ పారిన్ సర్వీస్ నియమ నిబంధనల మేరకు ప్రకాశం జిల్లా ఏపీఎస్ఎంఎఫ్‌సీ కార్యాలయంలో ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. ఈ నెల 4న పదోన్నతి పొంది చినగంజాం మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా నియమితులయ్యారు. ఇప్పటి వరకు ప్రకాశం జిల్లా దోర్నాల ఎంపీడీవోగా పనిచేస్తున్న ఎన్.విజయ ఇన్‌చార్జ్ ఎంపీడీవో ఉన్నారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన ధనలక్ష్మికి పంచాయతీరాజ్ ఏఈ దండమూడి దాసు, మండల పరిషత్ కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ నిర్మల, నక్కల వేణు, సిబ్బంది పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

నాగరాజుపల్లి సొసైటీ చైర్మన్‌గా బ్రహ్మయ్య



బాధ్యతలు స్వీకరిస్తున్న నూతన పాలకవర్గం

మార్టూరు, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నాగరాజుపల్లి సొసైటీ చైర్మన్‌గా దామర్ల బ్రహ్మయ్య బుధవారం ప్రమాణ స్వీకారం చేసి పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఆయనతో పాటు డైరెక్టర్లుగా పసుపులేటి నాగరాజు, గల్లా మరియబాబులు ప్రమాణస్వీకారం చేశారు. ఈ సందర్భంగా బ్రహ్మయ్య మాట్లాడుతూ ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు సూచనలకు అనుగుణంగా గ్రామ నాయకులు మిన్నెకంటి రవికుమార్ సహకారంతో సొసైటీ ద్వారా రైతులకు సక్రమంగా సేవలను అందిస్తానన్నారు. సొసైటీ అభివృద్ధికి, రైతుల సంక్షేమానికి కృషిచేస్తానన్నారు. కార్యక్రమంలో శానంపూడి లక్ష్మయ్య, వెంపరాల సుబ్బారావు, కుమ్మరి సుబ్బారావు, పసుపులేటి రాంబాబు, దాసం హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

తల్లిపాల ద్వారా బిడ్డకు బంగారు భవిష్యత్తు



పోషణ కార్యక్రమంలో మాట్లాడుతున్న సీడీపీవో సుభద్ర

మార్టూరు, సెప్టెంబరు24 (ఆంధ్రజ్యోతి): బిడ్డలకు తల్లిపాలు ఇవ్వడం ద్వారా వారు జీవితాంతం ఆరోగ్యంగా ఉండగలుగుతారని ఐసీడీఎస్ పర్చూరు సీడీపీవో సుభద్ర అన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలు ద్వారా నిర్వహిస్తున్న మహాపోషణ కార్యక్రమంలో భాగంగా బుధవారం మండలంలోని కోలలపూడి గ్రామంలో నిర్వహించిన కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తల్లిపాలు ద్వారా బిడ్డలలో రోగనిరోధక శక్తి పెరుగుతుందన్నారు. దీంతో చిన్న చిన్న వ్యాధులను తట్టుకొని, బిడ్డలు ఆరోగ్యవంతంగా ఎదుగుతారన్నారు. సర్పంచ్ ఎం. సతీష్ కుమార్ మాట్లాడుతూ కేంద్రాలలో పిల్లల సంఖ్య పెరగాలని, వారికి పౌష్టికాహారాన్ని సక్రమంగా అందజేయాలని కోరారు. కార్యక్రమంలో అంగనవాడీ కార్యకర్త కవిత, ఆశా వర్కర్లు, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

సేవల్లో సెయింట్ ఆన్స్ విద్యార్థుల ఉత్సాహం

● ఘనంగా జాతీయ సేవా విభాగ దినోత్సవం



సమావేశంలో ప్రతినిధులు, వృద్ధులు

దేశాయిపేట(చీరాల), సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : సేవా కార్యక్రమాలు నిర్వహించేందుకు సెయింట్ ఆన్స్ విద్యార్థులు ఉత్సాహంగా ముందుకు వస్తున్నారని కళాశాల సెక్రటరీ వనమా రామకృష్ణారావు, కరస్పాండెంట్ శ్రీమంతుల లక్ష్మణరావు పేర్కొన్నారు. బుధవారం దేశాయిపేట అనాధ వృద్ధాశ్రమంలో జాతీయ సేవా విభాగ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆశ్రమానికి రెండు రైస్ బ్యాగులు, పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ డా.జగదీష్‌బాబు, డైరెక్టర్ సీఎస్ రావు, ఎన్ఎస్ఎస్ విభాగం ప్రోగ్రాం అధికారి డా.జ్యోతీ స్వరూప్, విద్యార్థులు పాల్గొన్నారు.

మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలి

మార్టూరు,సెప్టెంబరు24(ఆంధ్రజ్యోతి): గంజాయి, డ్రగ్స్ వంటి మత్తుపదార్థాలకు యువత దూరంగా ఉండాలని సీఐ ఎం.శేషగిరిరావు అన్నారు. ఆయన బుధవారం సాయంత్రం మార్టూరు సెంటర్లో డ్రగ్స్ అనర్థాలపై ప్రజలకు అవగాహన కలిగించారు. వాటి వినియోగం వలన అనారోగ్యానికి గురికావడంతోపాటు,సమాజంలో చెడ్డపేరు వస్తుందన్నారు. వాటిని వినియోగించినా, ప్రోత్సహించినా నేరమన్నారు. అంతేగాకుండా దొంగతనంగా ఎవరైనా వాటిని అమ్మినా తమకు సమాచారం అందించాలన్నారు. చట్టానికి సహకరించాలన్నారు.

అన్నపూర్ణాదేవిగా అమ్మవారు

● వివిధ ఆలయాల్లో విశేష పూజలు ● ఆకట్టుకుంటున్న జగజ్జనని అలంకరణలు



నాంచారమ్మ ఆలయంలో అన్నపూర్ణాదేవి అలంకరణలో అమ్మవారు

పర్చూరు, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : దసరా శరన్నవరాత్రి ఉత్సవాలను మండలంలో భక్తులు ఘనంగా నిర్వహిస్తున్నారు. కార్యక్రమంలో భాగంగా స్థానిక శ్రీ అద్దంకి నాంచారమ్మ అమ్మవారి ఆలయంలో బుధవారం అమ్మవారు అన్నపూర్ణాదేవి అలంకరణ లో భక్తులకు దర్శనమిచ్చారు. వేడుకల సందర్భంగా ఆయా ఆలయాలను విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించారు. అదేవిధంగా పర్చూరులోని శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి అలయంలో స్వామివారి ఉత్సవ వేడుకలను అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. శరన్నవరాత్రుల వేడుకలను తిలకించేందుకు పెద్ద ఎత్తునభక్తులు తరలివచ్చారు. పూజాకార్యక్రమాల అనంతరం భక్తులకు ప్రసాద వినియోగాలు చేపడుతున్నారు. మండలంలోని చెరుకూరు, నాగుల పాలెం, ఉప్పుటూరు, అన్నంబొట్లవారిపాలెం, నూతల పాడు తదితర గ్రామాల్లో వేడుకలను అత్యంత ఘనంగా నిర్వహిస్తున్నారు.

బల్లికురవ : దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు గ్రామాలలో కనుల పండువగా నిర్వహిస్తున్నారు. కొప్పెరపాడు బొడ్డురాయి కూడలి వద్ద ఏర్పాటు చేసిన దుర్గాదేవి బుధవారం అన్నపూర్ణదేవి అలంకరణలో భక్తులకు దర్శనం ఇచ్చారు. వేమవరం ఎస్టీ కాలనీలో ఏర్పాటు చేసిన దుర్గాదేవి విగ్రహం వద్ద పూజలు నిర్వహించారు. అంబడిపూడి, గుంటుపల్లి, కొండాయపాలెం, చెన్నుపల్లి, కొమ్మినేనివారిపాలెం గ్రామాలలోని దేవాలయాలలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

మార్టూరు : దసరా శరన్నవరాత్రుల ఉత్సవాలలో భాగంగా మూడవరోజు అమ్మవారు పలు ఆలయాల్లో అన్నపూర్ణాదేవిగా భక్తులకు దర్శనం ఇచ్చారు. మార్టూరులో శ్రీదుర్గామల్లేశ్వరి దేవాలయంలో, ద్రోణాదులలోని అమ్మవారి ఆలయంలో, నాగరాజుపల్లి గ్రామంలోని దేవాలయంలో అన్నపూర్ణాదేవి అవతారంలో భక్తులు అలంకరించారు.తదుపరి ప్రత్యేక పూజా కార్యక్రమాలను చేసిన తర్వాత, భక్తులకు తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు.

పంగులూరు : మండలంలో శ్రీదేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు బుధవారం ఘనంగా నిర్వహించారు. ఆలయ అర్చక స్వాములు అమ్మవారిని అన్నపూర్ణాదేవి గా భక్తులకు దర్శనం ఇచ్చారు. ముప్పవరంలోని శ్రీలక్ష్మీ గణపతి షిర్డీసాయి ఆలయంలో గణపతిపూజ, నవావర్ణ పూజ, కలశస్థాపన, స్వామి వారికి అభిషేకము, సూక్త హోమము, రుద్రహోమము నిర్వహించారు. సాయంత్రం శ్రీదేవీ నవావరణ, అన్నపూర్ణాదేవి, శ్రీలలితాదేవి సహస్రనామం జపించి కుంకుమపూజ చేశారు. కొండమూరు, రామకూరు గ్రామాలలో అన్నపూర్ణాదేవిగా దర్శనమిచ్చిన అమ్మవారికి భక్తులు ప్రత్యేక పూజలుచేశారు. చందలూరులోని రామలింగేశ్వరస్వామి, పంగులూరులోని భీమలింగేశ్వర స్వామి ఆలయాలలో అమ్మవారికి ప్రత్యేక అలంకరణ చేసి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అమ్మవారిని దర్శించుకున్న భక్తులకు తీర్థప్రసాదాలు అందచేశారు.

చినగంజాం : మండల పరిధిలోని పలు గ్రామాల్లోని ఆలయాల్లో దసరా పండుగను పురస్కరించుకొని శరన్నవరాత్రులు ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. శరన్నవ ఉత్సవాలలో భాగంగా దేవి మండపాలు, ఆలయాల్లో అమ్మవార్లను వివిధ అలంకారాల్లో అలంకరించి పూజలు జరుపుతున్నారు. స్థానిక భూసమేత భావనారాయణస్వామి దేవస్థానంలో 18వ వార్షిక బ్రహోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. బ్రహ్మోత్సవాలలో భాగంగా ఉదయం దేవస్థానంలో శ్రీవారికి, అమ్మవార్లకు విశేష పూజలు, విశేష హోమములు జరిపారు. రాత్రికి హనుమద్వాహనంపై శ్రీవారికి గ్రామంలో గ్రామోత్సవం నిర్వహించారు. గ్రామోత్సవంలో వాహనసేవ లో స్వామివారి ముందు భావనారాయణస్వామి కోలాటబృందం వేసిన కోలాటం భక్తులను ఆకట్టుకుంది. గొనసపూడి, పెదగంజాం, నీలాయపాలెం, కడవకుదురు, సంతరావూరు తదితర గ్రామాల్లో వివిధ రూపాల్లో అలంకరించిన అమ్మవార్లకు భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు.

అద్దంకి : దసరా శరన్నవరాత్రుల ఉత్సవాలలో భాగంగా బుధవారం అద్దంకి పట్టణంలోని కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవాలయంలో అమ్మవారిని అన్నపూర్ణాదేవిగా అలంకరించారు. వేయిస్తంభాల గుడి, దత్తపాదుకాక్షేత్రం తదితర దేవాలయాలలో అమ్మవారి ని ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు పెద్ద సంఖ్యలో అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.







కొప్పెరపాడులో అన్నపూర్ణ దేవీ అలంకరణలో అమ్మవారు , మార్టూరులో దుర్గామల్లేశ్వరి దేవాలయంలో అన్నపూర్ణాదేవి అలంకరణ, ద్రోణాదులలో అమ్మవారి అలంకరణ, చినగంజాంలో హనుమవాహనంపై భావనారాయణస్వామి, అద్దంకిలో కన్యకాపరమేశ్వరిగా అమ్మవారు

స్మార్ట్ రేషన్ కార్డులతో పౌరసరఫరాలో మెరుగైన సేవలు



బల్లికురవలో స్మార్ట్‌కార్డులు పంపిణీ చేస్తున్న తహసీల్దార్

మేదరమెట్ల, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): పౌరసరఫరాలలో ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకే స్మార్ట్ కార్డులు అందిస్తున్నట్లు తహసీల్దార్ జీవీ.సుబ్బారెడ్డి తెలిపారు. బుధవారం మండలంలోని పమిడిపాడులో స్మార్ట్‌రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమానికి సుబ్బారెడ్డి ముఖ్యఅతిథిగా హజరయ్యారు. కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు మెరుగైన సేవలు అందించడానికి స్మార్ట్‌కార్డులను ప్రవేశపెట్టారన్నారు. రేషన్ కార్డులపై కందిపప్పు, గోదుమలు ప్రభుత్వం పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. కుటుంబంలో ఎవరైన వేలిముద్రలు వేసి రేషన్‌పొందవచ్చన్నారు. కార్యక్రమంలో పమిడిపాడు సొసైటీ అధ్యక్షుడు జాగర్లమూడి జయకృష్ణ, వీఆర్వో నరసింహారావు, గ్రామస్థులు పాల్గొన్నారు.

బల్లికురవ : ప్రభుత్వ ఆదేశాల మేరకు మండలంలోని అన్ని గ్రామాలలో రెండు రోజుల నుండి రేషన్ దుకాణాల ద్వారా స్మార్టు రేషన్‌కార్డుల పంపిణీ బుధవారం ఉప్పుమాగులూరు గ్రామంలో గ్రామ టీడీపీ నేతలు దగ్గర ఉండి ప్రజలకు రేషన్ కార్డులను అందజేశారు. బల్లికురవ మండలంలోని 21 గ్రామ పంచాయతీలలోని 16,931 మందికి స్మార్టు రేషన్ కార్డులు మంజురు అయ్యాయని తహసీల్దార్ రవినాయక్ తెలిపారు. ఈ కార్డుల ద్వారానే రేషన్ పంపిణీ అక్టోబరు నెల నుంచి చేపడతామన్నారు. బల్లికురవలో తహసీల్దార్‌తో కలిసి సొసైటీ చైర్మన్ గొట్టిపాటి లక్ష్మయ్య ప్రజలకు కార్డులను అందజేశారు. ఉప్పుమాగులూరు గ్రామంలోని మహిళలు ప్రభుత్వం అందించిన స్మార్టు రేషన్ కార్డులు ఎంతో బాగున్నాయని గతంలో వైసీపీ ప్రభుత్వం జగన్ ఫోటోలు వేసి కార్డులు అందించారని కూటమి ప్రభుత్వం స్మార్టుగా కార్డులు తయారు చేయించి అందించిందని వారు కార్డులను చూపించి హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ పందిరి అంజిబాబు, నేతలు పావులూరి ఏడుకొండలు, అమరనేని వినోద్ తదితరులు పాల్గొన్నారు.

నిషేధించిన బర్లీపొగాకు సాగు చేయవద్దు : ఏవో



రైతులకు సూచనలిస్తున్న ఏవో సుబ్బారెడ్డి

పంగులూరు,సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): బర్లీ పొగాకు సాగును ప్రభుత్వం నిషేధించిందని, రైతులెవరూ బర్లీసాగు చేపట్టవద్దని ఏవో డి.సుబ్బారెడ్డి సూచించారు. మండలంలోని చందలూరు, నూజెళ్లపల్లె గ్రామాలలో బుధవారం పొలంపిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఏవో సుబ్బారెడ్డి మాట్లాడుతూ బర్లీసాగుకు ప్రత్యామ్నాయంగా అపరాలు, మొక్కజొన్న సాగుచేపట్టాలని సూచించారు. ప్రకృతి వ్యవసాయం చేపడితే తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు సాధించవచ్చన్నారు. 2025-26 సంవత్సరంలో సాగుచేసిన పంటల వివరాలను రైతులు ఈ-క్రాప్‌లో నమోదు చేయాలని కోరారు. కార్యక్రమంలో మురకొండ సుబ్బారావు, గొట్టిపాటి కాజాస్వామి, పెంట్యాల వేణుబాబు, వ్యవసాయ సహాయకులు అశోక్ రైతులు పాల్గొన్నారు.

గ్రామీణ ప్రాంతాల్లో వైద్యసేవలందించడంలో నిర్లక్ష్యం తగదు

104 పల్నాడు జిల్లా రీజనల్ మేనేజర్ మహ్మద్ ఖలీమ్



సిబ్బందికి సూచనలిస్తున్న ఖలీమ్

అద్దంకిటౌన్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): 104 వాహనం ద్వారా గ్రామాలల్లో నిర్ణయించిన తేదీలలో వైద్యసేవలు అందించడంలో నిర్లక్ష్యం వహించవద్దని 104 పల్నాడు జిల్లా రిజనల్ మేనేజర్ మహ్మద్ ఖలీమ్ అన్నారు. బుధవారం మండలంలోని శింగరకొండపాలెంలో 104 వాహనం ద్వారా అందిస్తున్న వైద్యసేవలను ఆయన ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రజలను 104 వాహనం ద్వారా అందిస్తున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. స్వస్థ్ నారి, సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమం గురించి అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో డాక్టర్ శ్రీ హర్ష, డాక్టర్ జగదీష్, డీఎం నాగేశ్వరరావు, ఏఈ అఖిల్, సిబ్బంది పాల్గొన్నారు.

పంగులూరు : గ్రామీణ ప్రాంతాలలో ప్రజల వైద్య అవసరాలను గుర్తించి తగిన విధంగా సేవలు అందించాలని 104 సర్వీసెస్ పల్నాడు రీజనల్ మేనేజర్ మహ్మద్‌ఖలీమ్ సూచించారు. మండలంలోని నూజెళ్లపల్లె గ్రామంలో బుధవారం 104 సిబ్బంది ప్రజలకు అందిస్తున్న వైద్యసేవలను ఆర్ఎం మహ్మద్ ఖలీమ్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమాల వివరాలను సిబ్బందిని అడిగి తెలుసుకు న్నారు. గ్రామాలలో ప్రజలు ఎదుర్కొంటున్న ఆరోగ్యసమస్యలను అవగతం చేసుకుని, పరిసరాలను క్షుణ్ణంగా పరిశీలించాలని కోరారు. పారిశుధ్యం ప్రాధాన్యతను ప్రజలకు వివరించడంతో పాటు ఆరోగ్య విషయాలపై వారికి అవగాహన కల్పించాలన్నారు. విష జ్వరాలైన డెంగ్యూ, మలేరియా, చికెన్‌గున్యా బారినపడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియపరచాలన్నారు. కార్యక్రమంలో పంగులూరు పీహెచ్‌సీ వైద్యాధికారిని డాక్టర్ బాలరాజేశ్వరీ, డీఎం.నాగేశ్వరరావు, ఈవో అఖిల్, 104 సిబ్బంది పాల్గొన్నారు.

మార్టూరు : గ్రామాలలో పేదలకు 104 ద్వారా సక్రమంగా వైద్యసేవలను అందించాలని 104 పల్నాడు రీజినల్ మేనేజరు మహ్మద్ ఖలీమ్ వైద్య సిబ్బందిని కోరారు. బుధవారం ఆయన బొల్లాపల్లి గ్రామంలో వైద్యసేవలను అందిస్తున్న 104 సర్వీసెస్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వైద్యసిబ్బంది అందిస్తున్న సేవలను పరిశీలించారు. అంతేగాకుండా వారికి 'స్వస్థ్‌నారి సశక్త్ పరివార్ అభియాన్' కార్యక్రమం గురించి వివరించారు. కార్యక్రమంలో డాక్టరు పద్మజ, డీఎం నాగేశ్వరరావు, ఓఈ అఖిల్, అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

పేదరిక నిర్మూలనకే పీ-4 సర్వే



పీ-4పై అవగాహన కల్పిస్తున్న రిసోర్స్‌పర్సన్

చినగంజాం, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి) : ప్రజలు ప్రభుత్వం, ప్రైవేట్ భాగస్వామ్యంతో పేదరిక నిర్మూలనకు కృషి చేయాలని ఎంపీడీవో కే.ధనలక్ష్మి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో మండల పరిధిలోని గ్రామ కార్యదర్శులు, వీఆర్వోలు, గ్రామ సచివాలయ సిబ్బందికి బుధవారం పీ-4 సర్వేపై శిక్షణ నిర్వహించారు. రాష్ట్రంలో పేదరిక నిర్మూలనకే పీ-4 సర్వే నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో తెలిపారు. పీ-4 సర్వేపై రిసోర్సుపర్సన్లు శిక్షణ ఇచ్చారు. సర్వేను వీలైనంత త్వరగా చేపట్టి వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సూచించారు. కార్యక్రమంలో గ్రామ కార్యదర్శులు, గ్రామ రెవెన్యూ అధికారులు, గ్రామ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు అద్దంకిలో విద్యుత్ సరఫరా నిలిపివేత

అద్దంకి, సెప్టెంబరు24 (ఆంధ్రజ్యోతి): అద్దంకి పట్టణంలో కొత్త విద్యుత్ టవర్లు నిర్మాణ పనులు చేస్తున్న నేపథ్యంలో గురువారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు రామ్‌నగర్ ఫీడర్ పరిధిలో మార్కెట్‌యార్డు వద్ద నుంచి అన్నక్యాంటిన్ వరకు నామ్ రోడ్డు వెంబడి రెండువైపులా విద్యుత్ సరఫరా నిలిపి వేయనున్నట్లు ఈఈ దామోదరం తెలిపారు.

మినుములో సస్యరక్షణ చర్యలు తీసుకోవాలి



మినుము పైరును పరిశీలిస్తున్న ఏవో వెంకటకృష్ణ

అద్దంకిటౌన్, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): మినుము పంటలో సస్యరక్షణ చర్యలు తీసుకోవాలని ఏవో కొర్రపాటి వెంకటకృష్ణ తెలిపారు. బుధవారం మండలంలోని కలవకూరు, కుంకుపాడు గ్రామాలల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయశాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

రీ సర్వేలో జరిగిన లోపాలను సవరించాలి

ఒంగోలు కలెక్టరేట్, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని పలు ప్రాంతాల్లో భూముల రీ సర్వేలో అనేక లోపాలు జరిగాయని, వాటిని సవరించే విధంగా చర్యలుతీసుకోవాలని పీడీసీసీ బ్యాంకు చైర్మన్ డాక్టర్ కామేపల్లి సీతారామయ్య కోరారు. బుధవారం కలెక్టరేట్‌లోని జేసీ గోపాలకృష్ణను మర్యాదపూర్వకంగా కలిశారు.ఈసందర్భంగా జేసీకి మొక్క ఇచ్చి అభినందించారు. రీ సర్వేలో ఆ భూములను ఇనాం భూములు, రైతువారీ పట్టాగా రెవెన్యూ రికార్డుల్లో చూపించారన్నారు. దాని వల్ల రైతులు వారి భూములను తనఖా పెట్టుకొని రుణం తీసుకొనే వీలు లేక నానా ఇబ్బందులు పడుతున్నారని, అందువల్ల ఆ సమస్యను పరిష్కరించాలని కోరారు. జిల్లాలో పీడీసీసీ బ్యాంకుకు 34 బ్రాంచీలు ఉండగా 30 బ్రాంచిలు అద్దెభవనాల్లో ఉన్నాయని జేసీ దృష్టికి తెచ్చారు. బ్యాంకు కార్యకలాపాలు నిర్వహించేందుకు ఆభవనాల్లో ఇబ్బందికరంగా ఉన్నందున అందుబాటులో ఉన్న ప్రాంతాల్లో పదిసెంట్ల భూమిని కేటాయించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు.

ఎస్టీపీ ప్లాంట్ ఏర్పాటుపై నిరసన



నిరసన వ్యక్తం చేస్తున్న పలు సంఘాల నేతలు

చీరాల, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : ఉద్దేశ్య పూర్వకంగానే ఎస్టీపీ ప్లాంట్(మురుగు నీటి శుద్ధి కేంద్రం) ఏర్పాటు చేస్తున్నారని పలు సంఘాల నేతలు ఆరోపించారు. మున్సిపల్ పరిధిలోని దండుబాట రోడ్డులో నిర్మాణాలు చేపట్టిన ప్లాంట్‌ను వెంటనే నిలిపి వేయాలని ఆ ప్రాంతంలో పలు సంఘాల నేతలు నిరసన ప్రదర్శన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్లాంట్ నిర్మాణంకు తాము వ్యతిరేకం కాదని, అయితే ఎంచుకున్న ప్రదేశం సరైనది కాదని అన్నారు. నిర్మాణం నిలుపకుంటే ఉద్యమిస్తామని చెప్పారు.

జీఎస్టీ తగ్గింపు ఫలాలు పేదలకు అందాలి

పంగులూరు, సెప్టెం బరు 24(ఆంధ్రజ్యోతి): కేంద్రం నిర్దేశించిన జీఎస్టీ తగ్గింపు ఫలాలు పేద ప్రజానీకానికి అందేలా ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టాలని సీపీఎం జిల్లా కార్యదర్శి సీహెచ్.గంగయ్య కోరారు. బుధవారం పంగులూరులో స్థానిక విలేకర్ల సమావేశంలో గంగయ్య కేంద్రప్రభుత్వం జీఎస్టీ దరలను కొన్ని శ్లాబుల వారీగా తగ్గించిందన్నారు. ఆ ఫలాలు పేదలకు అందడం లేదని వారు తెలిపారు. మార్కెట్లో నిత్యావసర వస్తువులు పాత దరలకే విక్రయిస్తున్న విషయాన్ని అధికారులు గుర్తించాలన్నారు. అదేవిధంగా ప్రభుత్వం బర్లీ పొగాకు సాగుపై నిషేదం విధించిందని, ప్రత్యామ్నాయ పంటలుగా సాగు చేసేందుకు అవసరమైన మొక్కజొన్న, శనగ, మినుము విత్తనాలు ప్రభుత్వం సరఫరా చేయాలని కోరారు.

భర్త వేధింపులపై కేసు నమోదు

అద్దంకి,సెప్టెంబరు24(ఆంధ్రజ్యోతి): భర్త వేరే మహిళతో మాట్లాడటం గమనించి ప్రశ్నించినందుకు వేధింపులకు పాల్పడుతున్న ఘటనపై బుధవారం స్థానిక పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసుల కథనం మేరకు అద్దంకి పట్టణంలోని బెరకానగర్‌కు చెందిన షేక్ నాగూర్‌మీరావలి, ఆషాలకు ఐదేళ్ల క్రితం వివాహమైంది. వీరికి ఒక పాప ఉంది. ఇటీవల భర్త వేరే మహిళతో మాట్లాడుతుండటాన్ని గమనించిన ఆషా భర్త నాగూర్‌మీరాను ప్రశ్నించింది. దీంతో భర్త వేధింపులకు పాల్పడుతూ పుట్టింటికి పంపించాడు. దీంతో ఆషా ఫిర్యాదు మేరకు బుధవారం కేసు నమోదు చేసినట్లు సీఐ సుబ్బరాజు తెలిపారు.

క్షతగాత్రులకు వైసీపీ ఇన్‌చార్జ్ పరామర్శ




బాధితులను పరామర్శిస్తున్న అశోక్‌కుమార్

అద్దంకి, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చినకొత్తపల్లికి చెందిన ఓ కుటుంబం పల్నాడు జిల్లా అడిగొప్పులలో మంగళవారం మొక్కు తీర్చుకొని తిరిగి వచ్చే క్రమంలో వి.కొప్పెరపాడు వద్ద పలువురు గాయపడి నర్సరావుపేట వైద్యశాలలో చికిత్స పొందుతున్నారు. ఈ నేపథ్యంలో బుధవారం అద్దంకి నియోజకవర్గ వైసీపీ సమన్వయకర్త డాక్టర్ చింతలపూడి అశోక్‌కుమార్ నర్సరావుపేటలో ప్రైవేట్ వైద్యశాలలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను పరామర్శించారు. అద్దంకి మండల వైసీపీ అధ్యక్షుడు గుజ్జుల జగన్మోహనరెడ్డి, తదితరులు ఉన్నారు.

4న అద్దంకికి అశోక్‌కుమార్

అద్దంకి నియోజకవర్గ వైసీపీ సమన్వయకర్తగా నియమితులైన డాక్టర్ చింతలపూడి అశోక్‌కుమార్ అక్టోబర్ 4న తన పుట్టిన రోజు సందర్భంగా తొలిసారిగా అద్దంకి నియోజకవర్గానికి రానున్నారు. ఈ సందర్భంగా అద్దంకిలో పలు కార్యక్రమాలు నిర్వహించేందుకు వైసీపీ నేతలు ఏర్పాట్లు చేస్తున్నారు.

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
7
శ్రీ పొట్టిశ్రీరాములు
నెల్లూరు
జిల్లా వార్తలు
గురువారం 25 సెప్టెంబరు 2025



స్పెషల్ కెపాసిటీ బిల్డింగ్ కోర్సుకు దరఖాస్తుల ఆహ్వానం

నెల్లూరు(విద్య) : భారత క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో పాటియాలోని నేతాజీ సుభాష్ నేషనల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ స్పోర్ట్స్‌లో 2025-26 సంవత్సరానికి స్పెషల్ కెపాసిటీ బిల్డింగ్ కోర్స్ ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డీఎస్‌డీవో ఆర్‌కే యతిరాజ్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఒలంపిక్, ఏషియన్ చాంపియన్‌షిప్, కామన్‌వెల్త్ క్రీడల్లో పాల్గొన్న క్రీడాకారులతోపాటు జాతీయ గేమ్స్, వరల్డ్ మిలటరీ గేమ్స్, ఆలిండియా ఇంటర్ యూనివర్సిటీ, ఖేలో ఇండియా, జాతీయ స్థాయి క్రీడాపోటీల్లో పాల్గొన్న క్రీడాకారులందరూ ఈ కోర్సుకు అర్హులని తెలిపారు. స్పోర్ట్స్ కోచింగ్‌లో డిప్లమోతో సమానమైన ఈ కోర్సులో చేరేందుకు ఆసక్తి కలిగిన వారు www.nsnis.in వెబ్‌సైట్‌లో పొందుపరిచిన మార్గదర్శకాలకు అనుగుణంగా ఈనెల 25లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు నెల్లూరు ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలోని డీఎస్‌ఏ కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.



పెళ్లకూరును సత్కరిస్తున్న ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి

రాష్ట్ర వేతనాల సలహా బోర్డు చైర్మన్‌గా
'పెళ్లకూరు' ప్రమాణం

నెల్లూరు (వైద్యం), సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర వేతనాల సలహా బోర్డు చైర్మన్‌గా జిల్లాకు చెందిన పెళ్లకూరు శ్రీనివాసులురెడ్డి బుధవారం ప్రమాణ స్వీకారం చేశారు. విజయవాడలోని సీతారామపురం లేబర్ కమిషనర్ కార్యాలయంలో ఆయన ప్రమాణం చేశారు. వ్యాపారులు, కార్మికులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా బాధ్యతగా వ్యవహరిస్తామని వెల్లడించారు. సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డిసహా పలువురు నాయకులు పెళ్లకూరుకు శుభాకాంక్షలు తెలిపారు.

పంచాయతీల మార్పు,
చేర్పులుంటే పంపండి

నెల్లూరు (జడ్పీ), సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : గ్రామ పంచాయతీల మార్పులు, చేర్పులు ఉంటే ప్రతిపాదనలను పంపాలని జిల్లా పంచాయతీ అధికారి (డీపీఓ) శ్రీధర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. పంచాయతీ సాధారణ ఎన్నికల పదవీ కాలం 2026, ఏప్రిల్ 2వ తేదీలో ముగియనుందని, అప్పటిలోగా ఎన్నికలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసుకునేందుకు షెడ్యూలు జారీ అయినట్లు పేర్కొన్నారు. పంచాయతీల ఏర్పాటుకు అక్టోబరు 15వ తేదీలోగా ప్రతిపాదనలు పంపాలని కోరారు.

నేర సామ్రాజ్యం
గుట్టు రట్టు!

రాజకీయ, పోలీసు వర్గాల్లో కి'లేడి' నడిగుంట అరుణ ప్రకంపనలు సృష్టిస్తోంది. పలు నేరాల్లో పోలీసు అధికారులే సహకరించారనే గుట్టు రట్టు కావడంతో సంబంధిత ఆ శాఖలో కలకలం మొదలైంది. మూడు రోజులపాటు అరుణను కస్టడీలోకి తీసుకున్న పోలీసులు పలు అంశాలపై క్షుణ్ణంగా విచారించినట్లు తెలిసింది. తాను ఏ ఏ నేరాలకు పాల్పడింది... ఎవరెవరు సహకరించారు? ఎవరెవరికి ఎంతెంత ఇచ్చింది? ఇలా అనేక అంశాలను పూసగుచ్చినట్లు విచారణాధికారులకు తెలిసినట్లు సమాచారం. అలాగే కొంతమంది పేర్లు కూడా చెప్పగా, ఆ వివరాలను అధికారులు గోప్యంగ ఉంచారు. కోర్టు కేటాయించిన కస్టడీ సమయం ముగియడంతో బుధవారం అరుణను నెల్లూరులోని ఇన్చార్జి మేజిస్ట్రేట్ కోర్టులో హాజరుపరిచిన అనంతరం జిల్లా జైలుకు తరలించారు.



కోవూరు పోలీస్ స్టేషన్ నుంచి వెలుపలకు వస్తున్న నిడిగుంట అరుణ

- 3 రోజులపాటు అరుణను విచారించిన పోలీసులు
- ఎన్నో విషయాలు చెప్పిన కి'లేడీ'
- జాబితాలో పోలీస్ అధికారులు, రాజకీయ నేతలు, ప్రజాప్రతినిధుల పేర్లు
- 'రివాల్వర్' కేసులో త్వరలో కస్టడీ కోరే అవకాశం
- రాష్ట్ర పోలీస్ బాస్ నుంచి ఎప్పటికప్పుడు జిల్లా ఉన్నతాధికారులకు దిశానిర్దేశం

కోవూరు, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : పలుకేసుల్లో నిందితురాలైన అరుణ నెల్లూరు జిల్లా జైలులో రిమాండులో ఉండగా పోలీసులు సోమవారం కస్టడీకి తీసుకుని విచారించారు. నెల్లూరు రూరల్ డీఎస్పీ జీ శ్రీనివాసరావు పర్యవేక్షణలో కోవూరు పోలీస్‌స్టేషనులో సీఐ సుధాకరరెడ్డి, ఎస్‌టీఐ సీఐ నాగేశ్వరమ్మలు అరుణను ప్రశ్నించగా తన నేరాల చిట్టా విప్పినట్లు తెలిసింది. రౌడీషీటర్ల మధ్య నెలకొన్న వివాదాల గురించి కూడా కొంత సమాచారం అందించారని తెలిసింది. విచారణలో వెలుగు చూసిన అంశాలను అధికారులు ఎస్పీ అజిత వేజెండ్ల దృష్టికి తీసుకు వెళ్ళినట్లు విశ్వసనీయ సమాచారం. గత వైసీపీ ప్రభుత్వంలో పలు కేసుల్లో బాధితులు ఫిర్యాదు చేసినా పట్టించుకోని పోలీసు అధికారుల వివరాల గురించి అరుణ తేటతెల్లం చేశారు. ప్రస్తుత ప్రభుత్వంలోనూ రౌడీషీటరు శ్రీకాంత్‌కు, తనకు సహకరించిన పోలీసుల పేర్లను కూడా చెప్పినట్లు తెలిసింది. అలాగే పలు నేరాలతో సంబంధం ఉన్న రాజకీయ నాయకులు, ప్రజాప్రతినిధులు, రౌడీషీటర్ల వివరాలను కూడా ఆమె వివరించినట్లు తెలిసింది. దీనిప్రకారం ఎస్పీ అజిత దృష్టి సారించనున్నారనే సమాచారంతో పోలీసు వర్గాల్లో కలకలం రేగుతోంది.

● రాష్ట్ర యంత్రాంగం అప్రమత్తం

తాను సాగించిన నేరాలకు పలువురు పోలీసు అధికారులు సహకరించారని కి'లేడీ' అరుణ విచారణలో చెప్పడంతో రాష్ట్ర పోలీసు యంత్రాంగం అప్రమత్తమైనట్లు తెలిసింది. ఈ విషయమై తీసుకోవాల్సిన చర్యల గురించి రాష్ట్ర పోలీసు బాస్ నుంచి జిల్లా అధికారులకు ఆదేశాలు అందినట్లు భావిస్తున్నారు. జిల్లాలో రౌడీషీటర్లపై ఉక్కుపాదం మోపాలనే రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయానికి అనుగుణంగా అడుగులు పడుతుండటంతో నేరాలకు సహకరించిన అధికారులు, ప్రముఖులు, రాజకీయ నాయకులు తీవ్ర మానసిక ఒత్తిడికి గురవుతున్నట్లు సమాచారం.

● నేర సామ్రాజ్యంపై విచారణ

కోవూరు నాగులకట్టకాలనీకి చెందిన 21 మంది గిరిజన మహిళల నుంచి ఇళ్ల పట్టాల పేరుతో అరుణ నగదు వసూలు చేయడమే కాకుండా రౌడీషీటర్ల నేర సామ్రాజ్యం గురించి కూడా విచారణాధికారులు వివరాలు రాబట్టారు. నెల్లూరులోని పలు కేసులు, హిజ్రా హాసిని హత్యకేసుపై కూడా సమాచారాన్ని రాబట్టారు. హత్య అనంతరం ఎవరెవరికి ఎంతెంత నగదు ఇచ్చారో ఆ వివరాలు కూడా చెప్పినట్లు సమాచారం. కాగా, పోలీసు కస్టడీ బుధవారం మధ్యాహ్నం ముగియడంతో వైద్యుల పరీక్షల అనంతరం ఆమెను జిల్లాజైలుకు అప్పగించారు. కాగా, నగరంలో రివాల్వరుతో బెదిరించిన కేసును విచారించేందుకు త్వరలోనే నెల్లూరు పోలీసులు కస్టడీ విచారణను కోరనున్నట్లు సమాచారం.



నెల్లూరు నగరంలోని మూలస్థానేశ్వరుడి ఆలయంలో విద్యార్థినుల నృత్యరూపకం

వేదమూతా నమోస్తుతే..!

నెల్లూరు (సాంస్కృతికం), సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని ఆలయాల్లో దేవీ నవరాత్రి ఉత్సవాలు వైభవోపేతంగా జరుగుతున్నాయి. మూడో రోజు బుధవారం వివిధ రూపాల్లో అమ్మవారు భక్తులను కటాక్షిం చారు. విశేష అభిషేకాలు, సామూహిక కుంకుమ పూజలు, హోమాలు, శ్రీచక్ర నవావరణ పూజలు జరిగాయి. అమ్మణ్ణి నామస్మరణతో ఆలయాలు మారుమోగాయి. సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. నెల్లూరులోని రాజరాజేశ్వరి అమ్మవారు గాయత్రి దేవి అలంకరణలో దర్శనమిచ్చారు. కన్యకాపరమేశ్వరి బాలా త్రిపుర సుందరిగా, ఇరుకళల పరమేశ్వరి గజలక్ష్మిగా పూజలందుకున్నారు.



నెల్లూరు : గాయత్రీదేవిగా రాజరాజేశ్వరి

వెంకటాచలం సర్పంచి
చెక్ పవర్ రద్దు

వెంకటాచలం, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : వెంకటాచలం సర్పంచి మందల రాజేశ్వరి చెక్ పవర్‌ను రద్దు చేస్తూ జిల్లా పంచాయతీ అధికారి ఎల్ శ్రీధర్‌రెడ్డి బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. పంచాయతీ నిధులు భారీగా దుర్వినియోగమైనట్లు టీడీపీ నేత సండి రమేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు అధికారులు విచారించారు. సర్పంచి అధికారాన్ని అడ్డుపెట్టుకుని తన భర్త వైసీపీ జిల్లా ఉపాధ్యక్షుడు మందల వెంకటశేషయ్యను కాంట్రాక్టర్‌గా చూపించి భారీగా నిధుల దుర్వినియోగానికి పాల్పడ్డారని, నిబంధనలకు విరుద్ధంగా వెంకటశేషయ్య ఖాతాకు రూ.81,42,220, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరావు కుమారుడు వంశీ వెంకట్, డేటా ఎంట్రీ ఆపరేటర్, వివిధ పంచాయతీ కార్యదర్శుల ఖాతాలకు మరో రూ.26,16,721 జమ చేశారు. దీనిపై వెంకటాచలం సర్పంచికు పలుమార్లు షోకాజు నోటీసులు జారీ చేసి సంజాయిషీ కోరగా వివరణ సరిగ్గా లేనందున పంచాయతీ నిధులు డ్రా చేసే అధికారాన్ని ఆరు నెలల వరకు తాత్కాలికంగా నిలుపుదల చేస్తూ డీపీఓ ఉత్తర్వులు జారీ చేశారు.

జీఎస్టీ 2.0 సంస్కరణ..
ఓ పొదుపు పండుగ

- అన్ని వర్గాలకు ఎంతో ప్రయోజనం
- పాత ధరల ప్రకారం అమ్మితే చర్యలు
- నేటి నుంచి అవగాహన కార్యక్రమాలు
- ప్రత్యేక బృందాల ద్వారా పరిశీలన : కలెక్టర్

నెల్లూరు (హరనాథపురం), సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన జీఎస్టీ 2.0 సంస్కరణతో పేద, మధ్య తరగతి వర్గాలకు ఎంతో మేలు చేకూరుతుందని, ఇది ఒక పొదుపు పండుగ అని కలెక్టర్ హిమాన్షు శుక్లా అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లోని శంకరన్ హాలులో వాణిజ్య పన్నుల శాఖ జాయింట్ కమిషనర్ కిరణ్‌కుమార్‌తో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. నిత్యావసరాలు, మందులు, వ్యవసాయ పరికరాలు, భవన నిర్మాణ సామాగ్రి, ఆటో మొబైల్ రంగాల్లోని ఉత్పత్తులపై భారీగా జీఎస్టీ తగ్గిందన్నారు. ప్రధానంగా సిమెంటు ధరపై జీఎస్టీ 28 నుంచి 18 శాతానికి తగ్గడంతో భవన నిర్మాణ రంగం బలోపేతమవుతుందని చెప్పారు. నిత్యావసర వస్తువులు పూర్తిగా ప్రజలకు అందుబాటు ధరల్లో లభ్యమవుతాయని వివరించారు. ఈ తగ్గింపు వల్ల చిరువ్యాపారాలు పెరుగుతారని, ఫలితంగా రానున్న కాలంలో అన్ని వర్గాల వారు జీఎస్టీ పరిధిలోకి వస్తారని, ఇప్పటి కన్నా ఎక్కువగా ప్రభుత్వానికి ఆదాయం వస్తుందని వివరించారు. రాష్ట్రంలోని ప్రజలకు జీఎస్టీ రేట్లు తగ్గడం వల్ల రూ.8 వేల కోట్ల మేర లబ్ధి చేకూరుతుందని తెలిపారు. ఇక వ్యాపారులు కూడా కొత్త జీఎస్టీ రేట్ల ప్రకారం వస్తువులు అమ్మాలని, పాత జీఎస్టీ ప్రకారం అమ్మితే చర్యలు తప్పవని హెచ్చరించారు.



విలేకరులతో మాట్లాడుతున్న కలెక్టర్ హిమాన్షు శుక్లా, జాయింట్ కమిషనర్ కిరణ్‌కుమార్

● నెలపాటు కార్యక్రమాలు

ప్రతి ఇంటికి జీఎస్టీ ఫలాలు చేరేలా నెల రోజులపాటు అవగాహనా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ చెప్పారు. ఈ నెల 25 నుంచి 29వ తేదీ వరకు ఇంటింటికీ వెళ్లి జీఎస్టీ ఫలాల పేరుతో తగ్గిన నిత్యావసర వస్తువుల వివరాలను, కలుగుతున్న ప్రయోజనాలను వివరించనున్నట్లు తెలిపారు. 30 నుంచి అక్టోబరు 6వ తేదీ వరకు వ్యవసాయం దాని అనుబంధ రంగాల్లో కలిగే ప్రయోజనాలను వివరిస్తామని, అక్టోబరు 7 నుంచి 13 వరకు మానవవనరుల అభివృద్ధి, డిజిటల్ సాధికారతపై, 14 నుంచి 18వ తేదీ వరకు వికాస్ విశ్వాస్, నమ్మకమైన అభివృద్ధిపై అవగాహన కార్యక్రమాలు ఉంటాయని చెప్పారు.

● ప్రత్యేక బృందాలతో ఆరా

జిల్లాలో జీఎస్టీ అమలు తీరును ప్రత్యేక బృందాల ద్వారా పరిశీలించనున్నట్లు కలెక్టర్ తెలిపారు. వాణిజ్య సముదాయాల్లో నిబంధనలు పాటించకపోతే చర్యలు తీసుకుంటామని చెప్పారు. వాణిజ్య పన్నుల శాఖ జాయింట్ కమిషనర్ కిరణ్‌కుమార్ మాట్లాడుతూ జీఎస్టీ 2.0 వలన పన్నుల తగ్గింపుతోపాటు జీఎస్టీ రిజిస్ట్రేషన్, రీఫండ్ తదితర సేవలు చాలా సులభతరమైనట్లు చెప్పారు.



మెరుగైన విద్యుత్ సరఫరాకు ప్రాధాన్యమిస్తా

- నూతన ఎస్‌ఈ రాఘువేంద్రం

నెల్లూరు (జడ్పీ), సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : వినియోగదారులకు మెరుగైన విద్యుత్ సరఫరాకు అధిక ప్రాధాన్యత ఇస్తానని ఆ శాఖ నూతన ఎస్‌ఈ కొండూరు రాఘువేంద్రం అన్నారు. నగరంలోని విద్యుత్ భవన్‌లో బుధవారం ఆయన ఎస్‌ఈగా బాధ్యతలు స్వీకరించారు. శ్రీసత్యసాయి జిల్లాలో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌గా పని చేస్తూ పదోన్నతిపై నెల్లూరుకు వచ్చారు ఇక్కడున్న విజయన్ జనరల్ మేనేజర్ సోలార్ కార్పొరేట్ ఆఫీస్ కు (తిరుపతి) బదిలీపై వెళ్లారు. కాగా, జిల్లావాసి అయిన రాఘవేంద్రం గతంలో ఇక్కడే పని చేశారు. ఈ సందర్భంగా విద్యుత్ అధికారులు, సిబ్బంది, ట్రేడ్ యూనియన్, అసోసియేషన్ నేతలు ఎస్‌ఈని కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు.

మర్రిపాడులో భూచోళ్లు!

- ప్రభుత్వ భూమి కనిపిస్తే కబ్జానే!
- వర్షాకాలం వస్తే మరింత ఎక్కువగా..
- అధికారులకు తెలిసినా పట్టించుకోని వైనం

భూ కబ్జాదారులు చెలరేగిపోతున్నారు. అధికారుల నిర్లక్ష్యం వారికి కలిసి వస్తుండటంతో ప్రభుత్వ భూములనే ఆక్రమిస్తున్నారు. ఏటా వర్షాలు ప్రారంభం కాగానే ప్రభుత్వ భూములను జల్లెడ పట్టి.. అందులో ఉన్న కంప చెట్లను తొలగించి, జామాయిల్ మొక్కలు నాటి స్వాధీన పరుచుకుంటున్నారు. మర్రిపాడు మండలంలో ఈ వ్యవహారం జోరుగా సాగుతోంది. అల్లంపాడు రెవెన్యూ పరిధిలోని 1081, 1082, 1083, 1165, 1167 సర్వే నెంబర్లలో సుమారు 40 ఎకరాల భూమిని కొంతమంది దుక్కిదున్నారు. ఇటీవల మరి కొంతభూమిలో కంప చెట్లను తొలగిస్తుండటంతో స్థానికుల ఫిర్యాదుతో రెవెన్యూ అధికారులు అక్కడికి వెళ్లి, ఎక్స్‌కవేటర్‌ను ఆపేసి అక్రమార్కులను మందలించి, పంపించేశారు. అయితే, మరుసటి రోజే అదే భూమిలో ఎక్స్‌కవేటర్ సహాయంతో చెట్లను తొలగించేందుకు రంగంలోకి దిగారు. దీంతో రెవెన్యూ అధికారులు వెళ్లి అక్కడ ఉన్న ఎక్స్‌కవేటర్‌ను, ట్రాక్టరును తహసీల్దారు కార్యాలయానికి తరలించారు. తహసీల్దారు అనిల్‌కుమార్ ఆక్రమణకు గురవుతున్న భూమిలో బోర్డు ఏర్పాటు చేశారు. భూమి ఆక్రమించిన వ్యక్తిపైన, ఎక్స్‌కవేటర్ ఓనర్, ట్రాక్టర్ డ్రైవర్‌పైన బైండోవర్ కేసు నమోదు చేసి, వాహనాలను పంపించేసినట్లు తహసీల్దారు తెలిపారు.



- వివరాలు 10లో..

మర్రిపాడు పరిసరాల్లో కబ్జారాయుళ్లు ఆక్రమించిన ప్రభుత్వ భూమి

వికసిత్ భారత్‌కు
దరఖాస్తుల ఆహ్వానం

నెల్లూరు(విద్య) : స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకుని mybharath.gov.in పోర్టల్ ద్వారా నిర్వహించే వికసిత్ భారత్ క్విజ్‌లో 15 నుంచి 29 ఏళ్ల యువత పాల్గొనాలని సెట్నల్ సీఈవో నాగేశ్వరరావు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. యువత ఆలోచనలను వినూత్నంగా ప్రదర్శించేందుకు ఉపయోగపడే ఈ వేదికకు అందరూ దరఖాస్తు చేసుకోవాలని, పూర్తి వివరాలకు వెబ్‌సైట్‌ను పరిశీలించాలని కోరారు.

ఎన్‌క్యాప్ ద్వారా నెల్లూరుకు
రూ.13.50 కోట్ల మంజూరు

నెల్లూరు (సిటీ, ఆంధ్రజ్యోతి) : నేషనల్ క్లీన్ ఎయిర్ ప్రోగ్రాం (ఎన్‌క్యాప్)లో భాగంగా ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి సంబంధించి నెల్లూరుకు రూ.13.50 కోట్ల నిధులు మంజూరైనట్లు కలెక్టర్ హిమాన్షు శుక్లా వెల్లడించారు. బుధవారం కలెక్టరేట్‌లోని తన ఛాంబరులో ఎన్‌ఎంసీ, పొల్యూషన్ బోర్డు ఇతర శాఖలతో ఆయన సమావేశమై మాట్లాడారు. నగరానికి మంజూరైన ఈ నిధులను రోడ్ల నిర్మాణం, పచ్చదనం పెంపు, యంత్రాలతో రోడ్ల శుభ్రం, దుమ్ము నియంత్రణ వంటి చర్యలు చేపట్టనున్నట్లు చెప్పారు. పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఇంజనీర్ అశోక్‌కుమార్ మాట్లాడుతూ కేంద్రంలోని తమ శాఖ ఏపీలో 13 నగరాల్లో పీఎం10 నమూనాలను తీయగా అందులో నెల్లూరు కూడా ఉందన్నారు. వాయుకాలుష్యాన్ని అరికట్టడానికి నగరంలో స్వచ్ఛమైన గాలికోసం సమగ్ర కార్యచరణ అమలు చేస్తున్నట్లు తెలిపారు. కాలుష్యాన్ని పూర్తిగా కట్టడి చేసేందుకు సిటీలో కమిటీ కూడా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్‌ఎంసీ కమిషనర్ నందన్, డీటీసీ చందర్, పరిశ్రమల శాఖ జీఎం మారుతీప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

వృద్ధులు, పురుషుల కోసం
బస్సు సర్వీసులు పెంచండి

డయల్ యువర్ ఆర్టీసీ డీఎంలో ఓ ప్రయాణికుడు 10లో



చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	117
స్కిన్ చికెన్	214
స్కిన్‌లెస్	236

కోడిగుడ్ల ధర (100): 560

ఆయనలా అవినీతికి పాల్పడడం లేదు : టీడీపీ

కందుకూరు, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): వైసీపీ కందుకూరు ఇన్‌చార్జి బుర్రా మధుసూదన్‌యాదవ్ కనిగిరి నియోజకవర్గంలో చేసిన అవినీతి, భూదందాలు లాగా అందరూ చేస్తారనుకుని ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావుపై విమర్శలు చేయడం అవివేకమని టీడీపీ నాయకులు విమర్శించారు. బుధవారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో టీడీపీ నాయకులు దామా మల్లేశ్వరరావు, జనిగర్ల నాగరాజు, బుస్సారెడ్డి కృష్ణారెడ్డి, పోకూరి రాంబాబు, చదలవాడ కొండయ్య, బెజవాడ ప్రసాదు, చిలకపాటి మధు, రాయపాటి శ్రీనివాసరావు తదితరులు మాట్లాడుతూ రామాయపట్నంలో మేజరు పోర్టు నిర్మాణంకు టీడీపీ ప్రభుత్వంలో శంకుస్థాపన జరగ్గా దానిని మైనర్‌పోర్టుగా మార్చింది వైసీపీ ప్రభుత్వం కాదా అని ప్రశ్నించారు.

న్యూస్ బాక్స్

పెద్ద శేష వాహనంపై శ్రీవారి చిద్విలాసం



పెద్దశేష వాహన సేవలందుకుంటున్న వేంకటేశ్వరస్వామి

కావలి(టౌన్), సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): స్థానిక బృందావనం కాలనీలో వెలసిఉన్న వేంకటేశ్వరస్వామి నవరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా రెండవ రోజు పెద్దశేష వాహనంపై విహరించారు. ఆలయ వ్యవస్థాపక కమిటీ అధ్యక్షుడు శ్రీరామ్ మాల్యాద్రి పర్యవేక్షణలో ఆలయ అర్చకులు అర్చకం అంజనాద్రి, నారాయణ సునీల్‌కుమార్ బ్రహ్మోత్సవాల యాగ్నికస్వామి పరాంకుశం చినవెంకటస్వామి అర్చకత్వంలో బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. బుధవారం రాత్రి ధ్వజారోహణం పూజల అనంతరం శ్రీవారు పెద్దశేష వాహనంపై ఊరేగుతూ భక్తులకు అభయమిచ్చారు. భక్తులు అడుగడునా శ్రీవారికి బ్రహ్మరథం పట్టి స్వామివారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. గురువారం ఉదయం స్వామివారికి చిన్నశేష వాహన ఉత్సవం రాత్రి హంసవాహన ఉత్సవం జరగనున్నాయి.

ఎమ్మెల్సీ సోము వీర్రాజుకు రజక సంఘం కృతజ్ఞతలు

కావలి(టౌన్), సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): రజకులను ఎస్టీలుగా గుర్తించాలని శాసన మండలిలో ప్రస్తావించిన ఎమ్మెల్సీ సోము వీర్రాజుకు రజక సంఘం నాయకులు తలమంచి రవి సంఘం తరుపున బుధవారం ఒక ప్రకటనలో కృతజ్ఞతలు తెలిపారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కూడా రజక కులాన్ని ఎస్సీ జాబితాలో కలుపుతామని హామీ ఇచ్చారని పేర్కొన్నారు. రజక కులస్తులు కొన్ని రాష్ట్రాల్లో ఎస్సీలుగా కొన్ని రాష్ట్రాల్లో ఎస్టీలుగా పరిగణించబడుతున్నారన్నారని, మన రాష్ట్రంలో మాత్రమే బీసీలుగా చలామణి అవుతున్నామని, కనుక ఎస్సీ జాబితాలో చేర్చి న్యాయం చేయాలని తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలు

అల్లూరు, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి) : రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలైన సంఘటన అల్లూరులో బుధవారం రాత్రి జరిగింది. అల్లూరు శివారులోని లారీ కాటా వద్ద ఎదురెదురుగా వస్తున్న రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగింది. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం 108 అంబులెన్స్‌లో కావలికి తరలించారు.

ఆర్వో ప్లాంట్ నిరుపయోగం!

- 22 రోజులుగా పనిచేయని పరిస్థితి
- అరకొరగా వాటర్ క్యాన్ల కొనుగోలు
- ఏరియా వైద్యశాలలో తాగునీటికి అవస్థ
- ఇబ్బందులు పడుతున్న రోగులు, వారి సహాయకులు

కావలి, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): కావలి ఏరియా వైద్యశాలలో తాగునీటికి రోగులు, వారి సహాయకులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇక్కడ ఉన్న ఆర్వో ప్లాంట్ 22 రోజులుగా పనిచేయకపోవడంతో నిరుపయోగంగా మారింది. దీంతో వాటర్ క్యాన్లు కొనుగోలు చేసి సరఫరా చేస్తున్నా అవి అరకొరగా ఉండటంతో వైద్యశాలలో తాగునీటి ఇబ్బందులు తప్పడం లేదు. వైద్యశాలలో ఉన్న ఆర్వో ప్లాంట్ మోటారును, వాటి వైర్లను 22 రోజుల కిందట దొంగలు తీసుకెళ్లారు. వాటితో పాటు ఏసీల కాపర్ వైర్లను కూడా చోరీ చేశారు. దీనిపై పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకున్న దాఖలాలు లేవని ఆసుపత్రి వర్గాలు అంటున్నాయి. ఆర్వో ప్లాంట్ మోటారు, వైర్లు ఏర్పాటు చేయాలంటే సుమారు రూ.70 వేల వరకు ఖర్చు అవుతోందని అంచనా. అదీకాక ఆర్వోప్లాంట్ బేస్ కూడా దెబ్బతిని ఉన్నందున దానిని కూడా మార్చి కొత్తది



ఏరియా వైద్యశాలలో నిరుపయోగంగా ఉన్న ఆర్వో ప్లాంట్

వేయాలంటే మరో రూ.40 వేల వరకు అవసరం అవుతోందని అంచనా. ఈ క్రమంలో ఆర్వో ప్లాంట్‌ను మళ్లీ నూతనంగా తీసుకు రావాలంటే సుమారు లక్ష రూపాయల వరకు ఖర్చు అవుతోందని, ఎవరైనా దాతలు ముందుకు వస్తే బాగుంటుందని ఎదురు చూస్తున్నారు. గతంలో ఈ ఆర్వో ప్లాంట్‌ను ప్రస్తుత రాజ్యసభ సభ్యుడు బీద మస్తాన్‌రావు దాతృత్వంతో ఏర్పాటు చేశారు. మళ్లీ ఎవరైనా కొత్త దాతలు దొరుకుతారా లేకపోతే వైద్యశాల అభివృద్ధి నిధుల నుంచి దానిని నిర్మించాలా అనే సందిగ్ధంలో ఉన్నారు. ఆర్వో ప్లాంట్ ఉంటే అర్ధరాత్రి నీరు అవసరమైనా తెచ్చుకునే వెసులుబాటు ఉండేది. క్యాన్లు సరఫరా చేసినా అవి ఎప్పుడు వస్తాయో ఎప్పుడు అయిపోతాయో అవి ఎక్కడ ఉంటాయో అర్థం కాక రోగులు, వారి సహాయకులు తాగునీటి కోసం ఇబ్బందులు పడుతున్నారు. వైద్యాధికారులు స్పందించి దాతల ద్వారా, వైద్యశాల అభివృద్ధి నిధుల నుంచైనా త్వరగా ఆర్వోప్లాంట్‌ను సిద్ధం చేసి వైద్యశాలలో తాగునీటి ఇబ్బందులు తొలగించాలని కోరుతున్నారు.



ఆటోలో తీసుకువచ్చిన వాటర్ క్యాన్లు



మొగిలిచెర్లలో పౌష్టికాహారాన్ని ప్రదర్శిస్తున్న సూపర్‌వైజర్ రాధాదేవి, తదితరులు

గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారం తప్పనిసరిగా తీసుకోవాలి

లింగసముద్రం, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): గర్భిణులు, బాలింతలు అంగన్వాడీ కేంద్రాలలో ఇచ్చే కోడిగుడ్లు, పాలు, అటుకులు, ఖర్జూరం, రాగిపిండి, బెల్లం, చిక్కీలు తదితర పౌష్టికాహారాన్ని తీసుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఏవీ రాధాదేవి చెప్పారు. బుధవారం మండలంలోని మొగిలిచెర్ల అంగన్వాడీ కేంద్రంలో పోషణ మాసోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా పౌష్టికాహారాన్ని ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు ఏ.మాధవి, ప్రసన్న, సులోచన, ఓబులమ్మ, శ్రీదేవి పాల్గొన్నారు.

పౌష్టికాహారంపై అవగాహన ఉండాలి

బిట్రగుంట, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): గర్భిణులు, బాలింతలు అంగన్వాడీ కేంద్రాల్లో ప్రభుత్వం అందచేస్తున్న పౌష్టికాహారాన్ని తప్పనిసరిగా తీసుకోవాలని వైద్యులు రాజశేఖర్, నిత్యప్రశాంతి అన్నారు. బోగోలు మండలంలోని ఏనుగులబావి, మంగమూరు పంచాయతీలో బుధవారం స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమాలు వేర్వేగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు ఎదుర్కొంటున్న పలు వ్యాధుల గురించి అవగాహన కల్పించారు. ఏనుగులబావిలో సర్పంచు ప్రభాకర్‌రెడ్డి, ఏఎంసీ డైరెక్టర్ ఎల్లమ్మ, హెల్త్ సూపర్‌వైజర్ వసంత, అంగన్వాడీ సూపర్‌వైజర్ సౌజన్య, ముంగమూరులో టీడీపీ నేత వై.వెంకటే శ్వర్లు, శ్రీనివాసులురెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



పౌష్టికాహారాన్ని ప్రదర్శిస్తున్న వైద్యులు, సిబ్బంది, అంగన్‌వాడీలు

వేధిస్తున్న అధ్యాపకులు, ఉపాధ్యాయుల కొరత!

- విధులకు హాజరు కాని జూనియర్ అసిస్టెంటు
- ఇది తిమ్మారెడ్డిపాలెం ఏపీ మోడల్ స్కూల్ పరిస్థితి
- ఇబ్బందులు పడుతున్న విద్యార్థులు



తిమ్మారెడ్డిపాలెం ఏపీ మోడల్ స్కూల్

లింగసముద్రం, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి) : మండలంలోని తిమ్మారెడ్డిపాలెం ఏపీ మోడల్ స్కూల్‌లో అధ్యాపకులు, ఉపాధ్యాయులు, సిబ్బంది కొరత వేధిస్తోంది. ఈ ఏడాది జూన్‌లో జరిగిన సాధారణ బదిలీల్లో పలు సబెక్టులకు సంబంధించిన ఉపాధ్యాయులు బదిలీపై వెళ్లారు. వారి స్థానంలో ఇక్కడకు ఎవరూ రాలేదు. దీంతో మూడు నెలలుగా ఉపాధ్యాయులు, అధ్యాపకుల, సిబ్బంది పోస్టులు ఖాళీగా ఉండడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రధానంగా తెలుగు సబ్జెక్టుల పోస్టులు 2, బోటనీ, సైన్సు, సోషల్ సబ్జెక్టు పోస్టులు ఒక్కొక్కటి చొప్పున ఖాళీగా ఉన్నాయి. అయితే బోటనీ సబ్జెక్టుకు జువాలజీ అధ్యాపకురాలు, 6వ రతగతి నుంచి 8వ తరగతి విద్యార్థులకు పీజీటీ తెలుగు అధ్యాపకులు, సైన్సు సబ్జెక్టుకు ఫిజిక్స్, కెమిస్ట్రీ అధ్యాపకులు, సోషల్ సబ్జెక్టుకు ఎకనామిక్స్, సివిక్స్ సబ్జెక్టుల అధ్యాపకుల ద్వారా బోధన చేయస్తూ ప్రిన్సిపాల్ మహమ్మద్ హఫ్తార్ తాత్కాలికంగా చర్యలు చేపట్టారు. అలాగే స్కూల్‌లో జూనియర్ అసిస్టెంటు ఒకరు ఈ ఏడాది ఏప్రిల్ నెలలో సెలవుపై వెళ్లారు. ఆయన ఇప్పటి వరకు విధుల్లో చేరలేదు.దీంతో ప్రిన్సిపాల్, రికార్డు అసిస్టెంటు, కంప్యూటర్ ఆపరేటర్‌లు జూనియర్ అసిస్టెంటు పనులు చేయాల్సి వస్తోంది. దీంతో ప్రిన్సిపాల్, విద్యార్థులు, ఉపాధ్యాయులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుతం మోడల్ స్కూల్‌లో 313 మంది విద్యార్థులు 6వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు చదువుతున్నారు. సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని విద్యార్థులు, వారి తలిదండ్రులు కోరుతున్నారు.

విండ్రో కంపోస్ట్ తయారీ విధానం పరిశీలన



విండ్రో కంపోస్ట్ తయారీ విధానాన్ని పరిశీలిస్తున్న నాయుడుపేట మున్సిపల్ కమిషనర్ ఫజులుల్లా

కావలి, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): కావలి పురపాలకసంఘంలో పారిశుధ్య నిర్వహణ, విండ్రోకంపోస్ట్ తయారీ విధానాలను తెలుసుకుని తమ పురపాక సంఘంలో కూడా అమలు చేసేందుకు బుధవారం నాయుడుపేట మున్సిపల్ కమిసనర్ షేక్ ఫజులుల్లా కావలికి వచ్చారు. పట్టణంలోని కంపోస్ట్‌యార్డులో నూతన సాంకేతిక పరిజ్ఞానంతో తయారు చేస్తున్న విండ్రోకంపోస్ట్ తయారీ విధానాన్ని ఆయన పరిశీలించి అక్కడ సిబ్బందిని అడిగి వివరాలు తెలుసుకున్నారు. అలాగే పట్టణంలో ఇంటింటి నుంచి సేకరించిన చెత్తను తీసుకెళ్లే వాహనాలు వచ్చే వరకు రోడ్డుపై పడేయకుండా చెత్త డబ్బాలను పెట్టేందుకు ఏర్పాటు చేసిన ఇనుప గ్రిల్స్‌తో తయారు చేసిన బోనులను, బ్లాక్ స్పాట్స్‌ను గ్రీన్ స్పాట్స్‌గా మార్చేందుకు ఏర్పాటు చేసిన తులసి వనాలను పరిశీలించి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఈ విధానం బాగుందని కావలి పురపాలకసంఘం పనితీరును అభినందించారు. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఎండీ బషీర్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రతి మహిళ లక్షాధికారి కావాలి

- మున్సిపల్ కమిషనర్ శ్రావణ్‌కుమార్



వస్తువులను తిలకిస్తున్న మున్సిపల్ కమిషన్ శ్రావణ్‌కుమార్

కావలి(టౌన్), సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): ప్రతి మహిళ లక్షాధికారి కావాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని మున్సిపల్ కమిషనర్ శ్రావణ్ కుమార్ తెలిపారు. రైల్వే రోడ్డులోని మెప్మా కార్యాలయ ప్రాంగణంలో మెప్మా ఆధ్వర్యంలో స్వయం సహాయక సంఘాల సభ్యులు ఏర్పాటు చేసిన అర్బన్ మార్కెట్‌ను బుధవారం శ్రావణ్‌కుమార్ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ లక్ష్యం చిన్న వ్యాపారల నుంచి పెద్ద వ్యాపారాలు చేసుకోవాలని, తయారు చేసిన వస్తువులు ఆన్‌లైన్ మార్కెటింగ్ చేసుకునేందుకు అవకాశం కల్పించారని, తద్వారా లాభాలు పొందవచ్చన్నారు. మహిళలు తయారు చేసి ప్రదర్శించిన వస్తువులు, వస్త్రాలు, ఆభరణాలు, ఆహారానికి సంభందించిన రాగిపిండి, మల్టీగ్రెయిన్ పిండి, వడియాలు, ఊరగాయలు, మగ్గం వర్క్ శారీస్, పింగాణి గ్లాసులు బొమ్మలు, ఫినాయిల్, వర్క్ బ్లౌజ్‌లు తదితర వస్తువులు ప్రత్యేక ఆకర్షణగా ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో డీఈ సాయిరామ్, ఇండియన్ బ్యాంక్ మేనేజర్ హరిబాబు, మెప్మా సీఎంఎం భారతి తదితరులు పాల్గొన్నారు.

నూతన విద్యావిధానంపై సెమినార్



సెమినార్‌లో మాట్లాడుతున్న డాక్టరు సుదర్శన్

కందుకూరు, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): బహుజన టీచర్స్ అసోసియేషన్ (బీటీఏ) ఆధ్వర్యంలో నూతన విద్యావిధానంపై బుధవారం స్థానిక బాలుర ఉన్నత పాఠశాలలో సెమినార్ నిర్వహించారు. నూతన విద్యావిధానం-విద్యావ్యవస్థపై దాని ప్రభావం అనే అంశంపై ఉస్మానియా యూనివర్సిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టరు సుదర్శన్ బాలబోయిన మాట్లాడుతూ నూతన జాతీయ విద్యావిధానం హిందీ భాషను బలవంతంగా హిందీయేతర రాష్ట్రాలలో ప్రవేశపెట్టడానికి ప్రయత్నిస్తోందని, అంతేగాక వృత్తివిద్యను ప్రవేశపెట్టి సనాతన ధర్మంలోని వివక్షను ప్రోత్సహించే విధంగా ఉందని విమర్శించారు. ఉపాధ్యాయులు విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి కృషి చేయాలని, ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాభ్యాసం చేసేది నిరుపేద విద్యార్థులే కనుక వారి ఉన్నతికోసం చిత్తశుద్ధితో పాటుపడాలని కోరారు. కార్యక్రమంలో బీటీఏ రాష్ట్ర ప్రధానకార్యదర్శి చిట్టేటి రమేష్, శ్రీమాన ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

క్యాన్సర్ వ్యాధులపై అవగాహన ఉండాలి



మహిళలకు వ్యాధులపై అవగాహనకలిగిస్తున్న డాక్టర్ గీతారెడ్డి

కలిగిరి, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద బుధవారం స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమం వైద్యాధికారిణి డాక్టర్ బిజ్జం గీతారెడ్డి ఆధ్వర్యంలో జరిగింది. ఆమె మాట్లాడుతూ మహిళలు క్యాన్సర్ వ్యాధులపై అవగాహన కలిగి ఉండాలన్నారు. గర్భాశయ ముఖద్వారం, నోటి, రొమ్ము క్యాన్సర్‌ల గురించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ పాలూరి మాల్యాద్రిరెడ్డి, టీడీపీ మండల కన్వీనర్ బిజ్జం కృష్ణారెడ్డి, సర్పంచు రాగి దివ్య, పీఏసీఎస్ అధక్షుడు కదిరి వెంకటరంగారావు, అంగన్‌వాడీ సీడీపీవో చర్మిష్ట సూపర్ వైజర్ విజయలక్ష్మి, యల్లకర సతీష్, కొప్పోలు కొండలరావు, తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

లింగసముద్రం, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి) : మండలంలోని మొగిలిచెర్ల, లింసము ద్రం, చినపవని విద్యుత్ సబ్‌స్టేషన్ల పరిధి లోని గ్రామాల్లో గురువారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని మండల విద్యుత్ శాఖ ఏఈ షేక్ ఫిరోజ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆయా సబ్ స్టేషన్లలో ఆర్‌డీఎస్ఎస్ మెయింటెనెన్స్ పనులు జరుగుతున్నందున ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపి వేస్తున్నట్టు పేర్కొన్నారు. వినియోగదారులు ఈ విషయాన్ని గమనించాలని పేర్కొన్నారు.

భక్తిశ్రద్ధలతో నవరాత్రి ఉత్సవాలు



కలిగిరి : లలిత త్రిపురసుందరీదేవిగా భద్రకాళి



కావలి(టౌన్) : కన్యకాపరమేశ్వరి కుంకుమ సమర్పిస్తున్న భక్తులు

కావలి(టౌన్), సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు మూడవ రోజు బుధవారం భక్తిశ్రద్ధలతో జరిగాయి. గ్రామదేవత కలుగోళశాంభవి భక్తులకు శ్రీలలితా పరమేశ్వరి దేవి అలంకారంలో దర్శనమిచ్చి రాత్రి వ్యాళీ వాహన సేవలందుకున్నారు. శివాలయంలోని దుర్గాభ్రమరాంబ అమ్మణ్ణి అన్నపూర్ణాదేవి అలంకారంలో, అన్నపూర్ణాదేవి అలకారంలో కొత్తబజారులోని వాసవీకన్యకాపరమేశ్వరి, విష్ణాలయం లోని రాజ్యలక్ష్మి ధాన్యలక్ష్మి అలంకారంలో, వడ్డిపాలెం లోని కనకదుర్గాదేవి గాయిత్రీ దేవి అలకారంలో దర్శనమిచ్చారు. ఆయా ఆలయాల్లో భక్తులు వేలాదిగా పాల్గొని అమ్మవార్లను దర్శించుకుని పూజలు నిర్వహించారు. విద్యుదీపాలంకరణలు భక్తుల కోలాహలంతో అమ్మవారి ఆలయాల్లో ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది. కన్యకాపరమేశ్వరికి భక్తులు కుంకుమ సమర్పించారు. ఆలయ ప్రాంగణంలో మహిళా భక్తుల కోలాటాలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

- అమ్మణ్ణులకు విశేష పూజలు

అల్లూరు: దేవీనవరాత్రులను పురస్కరించుకొని మండలంలోని అన్ని శక్తి ఆలయాల్లో బుధవారం విశేష పూజలు నిర్వహించారు. ముఖ్యంగా అల్లూరులోని పార్వతిదేవి ఆలయం (దసరా దేవాలయం), పోలేరమ్మ, కలుగోళమ్మ, గంగమ్మ, అంకమ్మ, కన్యకా పరమేశ్వరి ఆలయాల్లో విశేష పూజలు నిర్వహించారు. ఆలయాలను పూలతో శోభాయమానంగా తీర్చిదిద్దారు. నార్తుమోపూరులోని పోలేరమ్మ ఆలయం, ఇస్కపల్లిలోని శివాలయంలో ఉదయం నుంచి ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. బాలాత్రిపుర సుందరి అలంకారంలో కన్యకాపరమేశ్వరి దర్శనమిచ్చారు.



బిట్రగుంట : అన్నపూర్ణాదేవిగా రాజరాజేశ్వరిదేవి



అల్లూరు:బాలాత్రిపుర సుందరిగా కన్యకాపరమేశ్వరి

- అన్నపూర్ణాదేవిగా రాజరాజేశ్వరిదేవి

బిట్రగుంట : బోగోలు మండలం విశ్వనాథరావు పేటలోని కోదండరామస్వామి ఆలయంలో రాజరాజేశ్వ రిదేవి అన్నపూర్ణాదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. రైల్వే పీడబ్ల్యూఐ ఎస్.రాజ్‌కుమార్ సుజాత దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరించారు. రామస్వామిపాలెం లోని జ్ఞాన ప్రసూనాంబ సమేత రామలింగేశ్వర స్వామి ఆలయంలో అమ్మవారు అన్నపూర్ణాదేవిగా పూజలందుకున్నారు.

- భద్రకాళికి ప్రత్యేక అభిషేకాలు

కలిగిరి : దేవీ నవరాత్రులలో భాగంగా మండలంలోని తెల్లపాడులో భద్రకాళి అమ్మవారు బుధవారం భక్తులకు లలితత్రిపురసుందరీదేవి అలంకారంలో దర్శనమిచ్చారు. అమ్మవారికి పాలు, పెరుగు, తేనె, నెయ్యి, పన్నీరు, పసుపు, కుంకుమ, ఫలాలతో జరిగిన ప్రత్యేక అభిషేక కార్యక్రమాల్లో భక్తులు పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. నున్నా వెంకట కొండ య్యాచెంచమ్మ దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



కావలి(టౌన్) : అన్నపూర్ణాదేవి అలంకారంలో కన్యకాపరమేశ్వరి



రాపూరు : ధాన్యలక్ష్మిగా ఆదిలక్ష్మి అమ్మవారు

బుచ్చి రక్తబీజవధ అలంకారంలో కామాక్షితాయి

కావలి : శ్రీలలితాపరమేశ్వరి దేవి అలంకారంలో కలుగోళశాంభవి

నెల్లూరు రూరల్ : ధైర్యలక్ష్మిగా ఆదిలక్ష్మి

:నెల్లూరు : బాలా త్రిపుర సుందరిగా కన్యకాపరమేశ్వరి

:నెల్లూరు : గజలక్ష్మిగా ఇరుకళల పరమేశ్వరి

భూచోళ్లు!



ఎక్స్‌కవేటర్‌తో చెట్లను తొలగిస్తున్న అక్రమార్కులు

- ప్రభుత్వ భూమి కనిపిస్తే కబ్జానే!
- వర్షాకాలం వస్తే మరింత ఎక్కువగా..
- తాజాగా 40 ఎకరాల ఆక్రమణ
- అధికారులకు తెలిసినా పట్టించుకోని వైనం

మర్రిపాడు, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల వర్షాలు పడిన వారం, పది రోజుల వ్యవధిలో మర్రిపాడు మండలం పడమటినాయుడుపల్లి రెవెన్యూలో 30 ఎకరాలు, చుంచులూరు రెవెన్యూ పరిధిలోని నకరేకల్ ఏర్చేడుపల్లి జాతీయరహదారికి దగ్గరలో 10 ఎకరాలు, గాగినేనిగుంట రెవెన్యూ పరిధిలో 25 ఎకరాల ప్రభుత్వ భూములను అక్రమార్కులు దున్ని స్వాధీనపరుచుకున్నారు. రైతులు పొలాలకు వెళ్లేందుకు దారిని కూడా వదలకుండా ఆక్రమించిన పరిస్థితి నెలకొంది.

● హెచ్చరించి వదిలేస్తున్నందునే...

ప్రభుత్వ భూముల ఆక్రమణ సమయంలో అధికారులకు ఫిర్యాదులు వస్తే ఆక్రమణదారులను హెచ్చరించి వదిలేస్తున్నారు. దీంతో వారు తిరిగి కొన్ని రోజులకు మిగతా పని పూర్తి చేసి ప్రభుత్వ భూములను ఎట్టకేలకు తమ స్వాధీనంలోకి తెచ్చుకుంటున్నారు. ఇలా మండలంలో వేలాది ఎకరాల ప్రభుత్వ భూమిని అగ్రవర్ణాలకు చెందిన వారే అధికంగా కబ్జా చేసినట్లు సమాచారం. దీంతో ఖాళీగా ఉన్న ప్రభుత్వ భూమి గ్రామాల్లో క్రమేణా తగ్గిపోతోంది. మిగిలిన ఆ కొద్ది భూమి కోసం ఇద్దరు ముగ్గురు నిత్యం కొట్లాడుకుంటుండటంతో పోలీస్ స్టేషన్‌కు భూ తగాదాల కేసులే అధికంగా వస్తున్నాయి. ఇటీవల సింగనపల్లి రెవెన్యూ పరిధిలోలో ఓ ప్రభుత్వ భూమి ఆక్రమణ విషయంలో నేను ముందు.. అంటే నేను ముందంటూ ఇరు వర్గాలు ఘర్షణ పడగా, కొంతమంది తలలు పగిలి, చేతులు విరిగిన సంఘటనలు వేరు వేరు చోట్ల రెండు పర్యాయాలు చోటు చేసుకున్నాయి. మరో భూమిలో జామాయిల్ మొక్కలు నాటిన చెట్లను వేరొకరు కోసేయటంతో పంచాయితీ పోలీస్ స్టేషన్‌కు చేరింది. భీమవరంలో ఒకే భూమి కోసం రెండు వర్గాలు ఘర్షణ పడుతున్న పరిస్థితి మరో మూడు చోట్ల నెలకొంది.

● సీసీ కెమెరాలతో పర్యవేక్షణ

పొంగూరు రెవెన్యూ పరిధిలో జాతీయ రహదారి పక్కనే ఉన్న ప్రభుత్వ భూమిని పట్టా భూమిగా కంప్యూటర్ అడంగల్‌లో నమోదు చేసుకోవటంతో దాని ధర కోట్ల రూపాయలకు పెరిగింది. ఆ భూమిలో జామాయిల్ మొక్కలు నాటే క్రమంలో గ్రామంలో గొడవలు జరిగాయి. దీనికి కాస్త రాజకీయం తోడు కావడంతో ఎట్టకేలకు జామాయిల్ మొక్కలు నాటి అందులో సీసీ కెమెరాలతో నిత్యం పర్యవేక్షిస్తున్నారు. అదే రెవెన్యూ పరిధిలో వైసీపీ నేత రాత్రికి రాత్రే మిషన్ ద్వారా డ్రిల్ వేసి ఫెన్సింగ్ రాళ్లు నాటారు. ఉదయం ఇతర ప్రాంతాల నుండి మహిళా రౌడీ మూకలను తీసుకొచ్చి భూమి దున్నుతుండగా స్థానికుల ఫిర్యాదుతో ఆ నేతపై పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదయింది. పెగళ్లపాడులో ఇటీవల 100 ఎకరాలు, ఇర్లపాడు రెవెన్యూ పరిధిలో సుమారు 15 ఎకరాలు అక్రమణకు గురైంది. అల్లంపాడు రెవెన్యూ పరిధిలో నెల్లూరు- ముంబాయి జాతీయ రహదారికి దగ్గర్లో సుమారు 200 ఎకరాల భూమిని గత వైసీపీ ప్రభుత్వంలో ఆ పార్టీ నేతలు ఆక్రమించి తమ స్వాధీనంలో ఉంచుకున్నారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే రెండు నెలల కాలంలో ఆ మొత్తం భూమిలో ఆగమేఘాల మీద జామాయిల్ మొక్కలు నాటి ధీమాగా ఉన్నారు. ఇలా వేలాది ఎకరాల ప్రభుత్వ భూమి ఆక్రమణకు గురైంది. విడతల వారీగా పేదలకు భూ పంపిణీ చే యాలంటే ఇక్కడ సెంటు ప్రభుత్వ భూమి కూడా దొరికే పరిస్థితి కనిపించటంలేదు.

వృద్ధులు, పురుషుల కోసం సర్వీసులు పెంచండి

డయల్ యువర్ డీఎంలో ఓ ప్రయాణికుడు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): స్త్రీశక్తి పథకం అమలయ్యాక మగవారికి, వృద్ధులకు బస్సుల్లో సీట్లు సరిపోవడం లేదని, నెల్లూరు-పామూరు రూటులో ప్రస్తుతం నడుపుతున్న సర్వీసులకు అదనంగా బస్సులు నడపాలని నెల్లూరుకి చెందిన సునీల్‌కుమార్ కోరారు. నెల్లూరు-1వ డిపోలో బుధవారం డయల్ యువర్ డీఎం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎనిమిది మంది ప్రయాణికులు ఫోన్ చేసి సమస్యలు తెలిపారు. స్పందించిన డీఎం వెంకటేశ్వర్లు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

● వారు ప్రస్తావించిన సమస్యలు..

- ఏటూరు నుంచి మెయిన్ రోడ్డుకు బస్సు సౌకర్యం కల్పించాలని సుజాత అనే ప్రయాణికురాలు కోరారు.
- పీఎస్ఆర్ బస్టాండు బుచ్చి బస్సులు నిలుపు ప్రదేశంలో బస్‌షెల్టర్ నిర్మించాలని కోవూరుకు చెందిన కే. శ్రీనివాసులు కోరారు.
- నెల్లూరు నుంచి పొదలకూరుకు పల్లెవెలుగు బస్సు సౌకర్యం కల్పించాలని పొదలకూరుకి చెందిన నారాయణ కోరారు.
- ముద్దమూడికి సాయంత్రం 5.15 నిమిషాల తర్వాత అదనపు ట్రిప్పు వేయాలని ముద్దమూడికి చెందిన ఏడుకొండలు కోరారు.
- నార్త్‌రాజుపాలెం గుండా ఎక్స్‌ప్రెస్ బస్సులు నడపాలని నార్త్‌రాజుపాలెంకు చెందిన ఆరిఫ్ కోరారు.
- సంగం లోపలికి బస్సులు రావడం లేదని కరీం ఫిర్యాదు చేశారు.
- సంగం నుంచి చేజర్లకు బస్సు సౌకర్యం కల్పించాలని జీ. హరిబాబు కోరారు.

ఉయ్యాలపల్లిలో ఇద్దరు పిల్లల అదృశ్యం

● ఆచూకీ కోసం గాలిస్తున్నగ్రామస్థులు ● పోలీసులకు సమాచారం

కలువాయి, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉయ్యాలపల్లికి చెందిన ఇద్దరు పిల్లలు బుధవారం మధ్యాహ్నం నుంచి కనిపించడం లేదు. వారి ఆచూకీ కోసం గ్రామస్థులంతా కలసి ఊరు పరిసరాల్లోని కాలువలు, చెరువులు, అటవీ ప్రాంతంలో రాత్రి వరకు గాలించారు. గ్రామస్థుల సమాచారం మేరకు...ఉయ్యాలపల్లికి చెందిన నూటేటి విఘువర్ధన్(9) కలువాయిలోని ఓ ప్రైవేటు పాఠశాలలో 5వ తరగతి చదువుతున్నాడు. మనుబోటి నవశ్రావణ్ (12) గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలోనే 6వ తరగతి చదువుతున్నాడు. దసరా సెలవులు కావడంతో ఇద్దరు కలసి మధ్యాహ్నం వరకు గ్రామంలోనే ఆడుకుంటూ ఉన్నారు.



విఘువర్ధన్



నవశ్రావణ్

ఊరికి సమీపంలోని చెరువు నుంచి టిప్పర్లతో లోని మట్టి తోలుతున్నారు. వీరిద్దరు మట్టి కోసం వెళుత్తున్న టిప్పరులో ఎక్కి చెరువు వద్దకు వెళ్లారు. కొద్ది సేపటి తరువాత పిల్లలు కోసం వారి తల్లిదండ్రులు చెరువు వద్ద వారిని అడగా ఇక్కడ లేరని చెప్పడంతో తల్లిదండ్రులు ఆందోళనకు గురయ్యారు. ఇంటికి రాకుండా చెరువు వద్ద కూడా లేకుండా ఎక్కడి పోయారని గ్రామస్థులు సుమారు 100 మంది కలసి రాత్రి పొద్దుపోయేవరకు సమీప ప్రాంతాల్లో వారి ఆచూకీ కోసం గాలించారు. కానీ ఆచూకీ తెలియలేదు. ఈ విషయమై పోలీసులకు కూడా సమాచారం ఇచ్చినట్లు వారు తెలిపారు.

పది బైకుల స్వాధీనం

కోవూరు, సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): ఇటీవల బైక్‌లను అపహరిస్తూ పట్టుబడిన కావలి పట్టణానికి చెందిన నిందితుడు సాగర్ వద్ద నుంచి పది మోటారు బైక్‌లను స్వాధీనం చేసుకున్నట్లు నెల్లూరు రూరల్ డీఎస్పీ జీ శ్రీనివాసరావు తెలిపారు. స్థానిక సీఐ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జాతీయ రహదారిపై పహారా కాస్తున్న పోలీసులు సాగర్‌ను ఆ దుపులోనికి ప్రశ్నించడంతో వివరాలు వెలుగులోకి వచ్చినట్లు చెప్పా రు. నిందితుడు సాగర్ తన మిత్రులు సహన్‌బాబు, ఆదర్శ్‌గోవింద్‌లతో కలిసి వరుస చోరీలకు పాల్పడినట్లు అంగీకరించాడని చెప్పారు. దీంతో రూ.9లక్షల విలువ చేసే పది బైకులను స్వాధీనం చేసుకున్న కోవూరు పోలీసులను ఆయన అభినందించారు. ఈ సమావేశంలో సీఐ సుధాకరరెడ్డి పాల్గొన్నారు.

మృతదేహం లభ్యం

కలువాయి, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): సోమశిల కండలేరు వ రద కాలువ ప్రవాహంలో సోమవారం గల్లంతైన కేశమనేనిపల్లి ఎస్టీ కాలనీకి చెందిన చలంచర్ల శీనయ్య (35) మృతదేహాన్ని బుధవారం కండలేరు జలాశయం పాత దాచూరు సమీపంలో స్థానికులు గుర్తించారు. ఈమేరకు పోలీసులు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టమ్‌కు పంపి దర్యాప్తు చేస్తున్నారు.

నేడు ప్రపంచ ఫార్మసిస్టుల దినోత్సవం

వ్యాధుల నివారణలో కీలకం!

- వారు లేకుండా ఔషధ దుకాణాల్లేవు
- అనుమతులు లేకుండానే కొన్ని మందులషాపులు
- వైద్యులు రాసే మందుల్లో కంపెనీలదే అగ్రస్థానం
- సమస్యలు పరిష్కరించాలంటున్న ఫార్మసిస్టులు

నెల్లూరు (వైద్యం), సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): వ్యాధులు న యం చేయటంలో ఫార్మిసిస్టులదే కీలక పాత్ర. ఏమాత్రం పొరపాటుగా వారు మందులు పంపిణీ చేసినా, వాటి ని వైద్యులు గమనించక పోయినా వ్యాధిగ్రస్తులు తీవ్ర అనారోగ్యానికి గురికావాల్సిందే. అయితే వైద్యు లు రాసే ప్రిస్క్రిప్షన్ ఎంతో కీలకం. వైద్యులు రాసే మందులు వారికి మాత్రమే అర్థమవుతాయి. దీ నికి ఇందుకు అనుగుణంగా వారు మందులు ఇస్తుంటారు.ఈ నేపథ్యంలో 2009లో ఏర్పాటయిన ఫెడరేషన్ ఇంటర్నేషనల్ ఫార్మాస్యూటికల్స్ నిర్వాహకులు ఏటా సెప్టెంబరు 25న (నేడు) ప్రపంచ ఫార్మాసిస్టుల దినోత్సవాన్ని జరుపుకుంటా రు. ప్ర పంచ వ్యప్తంగా రోగులకు మెరుగైన వైద్యం అందించాలన్నదే వారి నినాదం.

● డబ్బుకు ఆశపడి..

కొందరు వైద్యులు ఎక్కువగా డబ్బు అందించే కంపెనీలకే ప్రాధాన్యత ఇస్తూ, రోగి పేదరికాన్ని పరిగణలోకి తీసుకోవటం లేదన్న వాదన ఫార్మసిస్టుల నుంచి వినిపిస్తుంది. ఉదాహరణకు జ్వరానికి వినియోగించే పారాసెట్‌మల్ మందులు రాయకుండా, డోలో వంటి వాటికే ప్రాధాన్యత ఇస్తున్నారని వారు చెబుతున్నారు. కాగా పలు రకాల నకిలీ మందులు తయారు చేసే వారు ఎక్కువగా ఉన్నారని ఫార్మసిస్టులు అంటున్నారు. ఏమాత్రం పనిచేయని ఊరు పేరు లేని మందుల కంపెనీలు ఇబ్బడిముబ్బడిగా వచ్చాయని, అవి తయారు చేసే మందులు వ్యాధులు తగ్గించక పోగా కొత్త రోగాలు వచ్చే అవకాశం ఉందంటున్నారు.



●కరోనాలోనూ కీలకం

2020 నుంచి 2022 వరకు జిల్లాలో 1.66 లక్షల మంది కరోనాకు గురయ్యారు. వారు కోలుకునేందుకు ఫార్మసిస్టులు అందించిన మందులే కీలకంగా మారాయి. రోగులు త్వరితగతిన కోలుకునేందుకు వారు చేసిన కృషి ఎంతో ఉంది. కరోనా చికిత్సకు వినియోగించే అత్యవసర రెమ్‌డిసీవర్ ఇంజక్షన్‌లు, కరోనా మందుల కిట్‌లు, యాంపోటెరిసిన్ ఇంజక్షన్‌లు, పోసకొనజాల్ ఇంజక్షన్‌లు సైతం అందుబాటులో ఉండేందుకు వారు ఎంతో కృషి చేశారు.

● ఫార్మసిస్టులు లేకుండా...

జిల్లాలో 2500లకుపైగా మందులు దుకాణాలు ఉన్నాయి. ఆయా మందుల షాపు ల్లో తప్పనిసరిగా ఫార్మసిస్ట్ ఉండాలి. అ యితే చాలా వాటిల్లో వారు ఉండటం లేదు. కొందరైతే ఫార్మసిస్టుల ద్వారా మందుల షాపులకు అనుమతులు తీసుకుంటూ సొంతంగా నడుపుతున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో పచారికొట్టులో కూడా మందులు అందుబాటులో ఉంటున్నాయి. వీటిని నిరోధానికి అధికారులు కృషి చేయటం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఇవి తీవ్ర అనారోగ్యానికి హేతువులవుతున్నాయి.

మాకూ సమస్యలు ఉన్నాయి



జిల్లాలోని ఫార్మాసిస్టులు పలు సమస్యలు ఎదుర్కొంటున్నారు. జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో 130 మందికి పైగా పని చేస్తున్నారు. వీరిలో 90 మంది వరకు రెగ్యులర్ ఉద్యోగులే. అయితే మిగతా వారంతా కాంట్రాక్టు ఉద్యోగులే. వీరిని రెగ్యులర్ చేయాలని ఎప్పటి నుంచో డిమాండ్ చేస్తున్నాం.

- నరసింహులు, ఫార్మసిస్ట్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు

రోగులకు సహకారం



రోగులకు అన్నీ విధాలా సహకారం అందిస్తున్నాం. జిల్లాలో తమ అసోసియేషన్‌లో 2300 మంది వరకు సభ్యులు ఉన్నారు. వైద్యులు రాసిన మందుల కొరత లేకుండా చూస్తున్నాం. అయితే కొన్ని షాపుల వినియోగంలో ఫార్మసిస్ట్‌లు లేరన్న అపవాదు ఉంది. అనుమతి లేకుండా షాపులు నిర్వహిస్తే చర్యలు తీసుకోవాలి. అందుకు మా సహకారం ఉంటుంది.

- ప్రదీప్, జిల్లా కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్

చెరువుల్లో యథేచ్ఛగా మట్టి అక్రమ తవ్వకాలు

● నామమాత్రపు రుసుంతో దోపిడీ ● పట్టించుకోని అధికారులు



చెరువులో అక్రమంగా మట్టి తవ్వి ట్రాక్టర్లకు లోడ్ చేస్తున్న ఎక్స్‌కవేటర్

కలిగిరి, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): అక్రమ మట్టి తవ్వకాలు రేయింబవళ్లు యథేచ్ఛగా జరుగుతున్నా అధికారులు ఏ మాత్రం పట్టించుకోవడం లేదు. ముఖ్యంగా ఆదివా రం, ఇతర సెలవు దినాలు వస్తే చాలు మట్టి తవ్వకాలతో పెట్రేగిపోతున్నారు. ఎక్స్‌కవేటర్లు తీ సుకెళ్లి చెరువులను కుళ్ల బొడిచేసేస్తున్నారు. పదుల సంఖ్యలో ట్రాక్టర్లతో వందల ట్రిప్పుల మట్టిని అక్రమంగా తరలిస్తున్నారు. సంబంధిత అధికారులను మామూళ్లతో కట్టిపడేసి సాగుతున్న మట్టిదందాకు దళారులు తోడవుతున్నారు. వారే ఎవరికి మట్టి అవసరమో గుర్తించి వారితో బేరాసారాలకు దిగుతున్నారు. ముఖ్యంగా మండలంలోని కలిగిరి, నాగసముద్రం, వీరనకొల్లు, వెలగపాడు పంచాయతీల పరిధిలో ఈ అక్రమ మట్టితోలకాలు ఎక్కువగా సాగుతున్నాయి. చెరువుల్లో ప్రజల అవసరాల పేరుతో దళారులు మట్టి తోలకాలను అధికారులకు నామమాత్రపు రుసుం చెల్లించి వందల కొద్ది ట్రాక్టర్లతో మట్టిని తరలిస్తూ వ్యాపారాలు చేస్తూ ధ నార్జనకు పాల్పడుతున్నారు. ఇష్టానుసారంగా చెరువులు తవ్వేస్తుండటంతో చెరువుల వద్ద గుంతలు ఏర్పడి ప్రమాదాలు జరుగుతాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా సెలవు దినాల్లో అయితే అధికారులు స్థానికంగా ఉండరన్న నెపంతో తమకు ఇబ్బందులు ఉండవని, ఒకవేళ అధికారులకు ఎవరైనా సమాచారం ఇస్తే వారు మట్టి తవ్వే ప్రాంతానికి వెళ్లే సరికి అక్రమార్కులు తమ పనికానించుకొని అక్కడి నుంచి ఉడాయిస్తున్నారు. ఎక్స్‌కవేటర్, ట్రాక్టర్ల యజమానుల వివరాలు తెలిసి అధికారులు విచారిస్తే రాజకీయ నాయకుల అండదండలతో తప్పించుకుంటున్నారు. అధికారులు కూడా రాజకీయ ఒత్తిడిలకు తలొగ్గి విధులు నిర్వహిస్తున్నారా అని అధికారుల తీరుపై సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి. దళారుల ప్రమేయంతో జరుగుతున్నమట్టి తవ్వకాలపై జిల్లా అధికారులు దృష్టి సారించి చెరువులను రక్షించాలని స్థానికులు కోరుతున్నారు.

ప్రకాశం టూ చెన్నై వయా నెల్లూరు

● రేషన్ బియ్యం రాకెట్ రూట్ ఇది.. ● రవాణదారుడు మహేష్‌రెడ్డిపై కేసు నమోదు

● పట్టుబడిన బియ్యం ఎంఎల్ఎస్ పాయింట్‌కు తరలింపు



నెల్లూరురూరల్,సెప్టెంబరు 24(ఆంధ్రజ్యోతి): రేషన్ బియ్యం అక్రమ రవాణా గుట్టురట్టైంది. స్మగ్లింగ్ రూటు బహిర్గతం కావడంతో అధికార, రాజకీయ వర్గాలు విస్మయం వ్యక్తం చేస్తున్నాయి. ప్రకాశం జిల్లా నుంచి సేకరించిన రేషన్ బియ్యాన్ని లారీల్లో లోడ్ చేసి చెన్నైలోని మార్కెట్‌కు తరలిస్తూ వయా నెల్లూరులో ఆగడంతో భారీగా బియ్యం పట్టుబడినట్లు పౌరసరఫరాల శాఖకు చెందిన ఓ అధికారి తెలిపారు. సాధారణ బియ్యం రవాణా మాటున రేషన్ బియ్యం కూడా తరలించేందుకు సిద్ధం చేసుకున్న ప్రణాళిక బెడిసికొట్టడంతో రెండు లారీల్లోని బియ్యం పట్టుబడినట్లు ఆ అధికారి చెప్పుకొచ్చారు. ప్రకాశం జిల్లాలో రేషన్ షాపుల ద్వారా రహస్యంగా సేకరించిన బియ్యం చెన్నై మార్కెట్‌కు తరలించే బాధ్యతను అనంతరసాగరం మండలం వెంగంపల్లికి చెందిన బట్టిరెడ్డి మహేష్‌రెడ్డి తీసుకున్నట్లు పౌరసరఫరాల శాఖ అధికారులు ప్రాథమికంగా గుర్తించారు. పట్టుబడిన లారీలు ఆయనవే కావడంతో పౌరసరఫరాల శాఖ ఆయనపై 6ఏ కేసును నమోదు చేయగా, ఇటు నెల్లూరురూరల్ పోలీసులు సీఎస్‌డీటీ జమీర్‌బాషా ఇచ్చిన ఫిర్యాదుతో 7 ఆఫ్ ఈసీ చట్టం కింద కేసు కట్టినట్లు సీఐ గుంజి వేణు బుధవారం తెలిపారు. కాగా పట్టుబడిన రేషన్ బియ్యాన్ని నిల్వ చేసేందుకు పౌరసరఫరాల శాఖ నేతృత్వంలోని ఎంఎల్ఎస్ గోదాములకు తరలించారు. అధికారులకు పట్టుబడింది రెండు లారీల రేషన్ బియ్యమే అయినా, చెన్నైలోని స్మగ్లింగ్ మార్కెట్ కేంద్రంగా భారీ రాకెట్ నడుస్తున్నట్లు నిఘా వర్గాలు అంచనా వేస్తున్నాయి. పేదలకు ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్న రేషన్ బియ్యానికి ఏకంగా రూ. 46 వరకు వ్యాపారులకు కొనుగోలు సమయంలో చెల్లిస్తున్నట్లు తెలుస్తోంది. వీటిని పలువురు తినేందుకు ఇష్టపడక రేషన్ డీలర్లకు కేజీ రూ. 10ల చొప్పున అమ్మేసి సొమ్ముచేసుకుంటున్నా రు. ఇలా సేకరించిన బియ్యాన్ని మండలాల వారీగా మాఫీయా వ్యక్తులు జిల్లాకు కేజీ రూ. 15 నుంచి 20ల వరకు అమ్ముతున్నట్లు సమాచారం. ఈ మార్గాల ద్వారా రేషన్ బియ్యం స్మగ్లింగ్ చేసే సిండికేట్లు భారీగా నిల్వ చేసి చెన్నైకు తరలిస్తున్నట్లు తాజాగా పట్టుబడిన లారీగా రాకెట్ ద్వారా సమాచారాన్ని నిఘా వర్గాలు సేకరించినట్లు తెలుస్తోంది. కాగా మహేష్‌రెడ్డి అనే వ్యక్తి రెండు లారీల్లో రేషన్ బియ్యాన్ని నింపి మరో మూడు లారీల్లో సాధారణ బియ్యం నింపి నెల్లూరులో ఎందుకు ఆపారు...? వీటితో పాటు మరిన్ని లారీలు ఒకే సారి చెన్నై బయల్దేరే అవకాశమేమైనా ఉందా...? ఉంటే ఆ లారీలు ఎక్కడ...? అన్నది దర్యాప్తు అధికారులు ఆరా తీస్తున్నారు.

జాతీయ యోగా పోటీలకు జడ్జిగా పద్మావతి



నెల్లూరు(విద్య), సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : విజయవాడలో ఈ నెల 28 నుంచి జరిగే ఆరో జాతీయ యోగా పోటీలకు నెల్లూరుకు చెందిన పద్మావతిని జడ్జిగా నియమిస్తూ యోగాసన భారత్ ఉపాధ్యక్షుడు, పోటీల చైర్మన్ డాక్టర్ సంజయ్ ఉత్తర్వులిచ్చారు. పంజాబ్‌లోని పాటియాలాలో జరిగిన జాతీయ స్థాయి న్యాయనిర్ణేతల రాత పరీక్షల్లో యోగా టీచర్ పద్మావతి ఉత్తీర్ణత సాధించడంతో ఆమెను జాతీయ పోటీలకు నియమించినట్లు తెలిపారు. జిల్లాలోని యోగా గురువులు, క్రీడాకారులు, యోగా అసోసియేషన్ ప్రతినిధులు పద్మావతికి అభినందనలు తెలిపారు.

రహదారిపై భారీ కొండచిలువ ప్రత్యక్షం



ప్రధాన రహదారిపై భారీ కొండ చిలువ

సీతారామపురం, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని బస్టాండ్ కూడలి సమీపంలో నుంచి డీజీ పేట వెళ్లే ప్రధాన రహదారిపై భారీ కొండచిలువ బుధవారం రాత్రి ప్రత్యక్షమైంది. దీంతో అటుగా వెళ్తున్న ప్రయాణికులు భయాందోళనకు గురయ్యారు. సుమారు 10 అడుగుల పొడవు ఉందని స్థానికులు తెలిపారు. కాగా, ప్రయాణికుల చప్పుడుతో పొదల్లోకి వెళ్లిపోయినట్లు తెలిపారు. సుమారు 15 నిమిషాల పాటు వాహనాలు నిలిచిపోయాయన్నారు.

దాడికి పాల్పడిన నలుగురు హిజ్రాల అరెస్టు

కందుకూరు, సెప్టెంబరు 24 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని హరిణి వైద్యశాలలో నర్సుపై దాడికి పాల్పడిన నలుగురు హిజ్రాలను అరెస్టు చేసినట్లు సీఐ అన్వర్‌బాషా తెలిపారు. బుధవారం రాత్రి ఆయన తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ పట్టణంలోని ఉప్పుచెరువులో నివాసం ఉంటూ కందుకూరు పట్టణంలో దుకాణాలు, ఇతర సంస్థల వద్ద యాచన పేరుతో బలవంతం చేస్తున్న హిజ్రాలు మంగళవారం రాత్రి బస్టాండ్ సెంటర్‌లో ఉన్న ఆసుపత్రికి వెళ్లి చప్పట్లు కొడుతూ పెద్దగా కేకలు వేస్తూ డబ్బులు అడిగారు. ఆ సమయంలో డ్యూటీలో ఉన్న పుట్ట ఆదిలక్ష్మి అనే నర్సు డాక్టరు గారు లేరు, మీరు కేకలు వేయకండని హెచ్చరించిందని తెలిపారు. దీంతో రెచ్చిపోయిన వలేటి లావణ్య, బత్తుల పింకీ, బూదురు సౌజన్య, కందిపాటి విజయలక్ష్మి అనే హిజ్రాలు ఆమెపై దాడి చేసి దారుణంగా కొట్టారని, దీంతో చంపేస్తారని భయపడిపోయిన నర్సు ఆదిలక్ష్మి తన జేబులో ఉన్న రూ.2వేలు తీసి ఇచ్చిందని తెలిపారు. ఈ మొత్తం ఘటన సీసీ కెమెరాల్లో రికార్డు అయిందని, దీనిపై తక్షణమే విచారణ ప్రారంభించామని తెలిపారు.ఎస్పీ అజిత ఘటనను సీరియస్‌గా తీసుకుని తగు ఆదేశాలు జారీ చేయగా బుధవారం రాత్రి నలుగురిని అరెస్టు చేశామని తెలిపారు.

అరాచకాలను ఖండించిన వ్యాపారులు

కందుకూరు పట్టణంలో హిజ్రాల ఆగడాలపై కందుకూరులోని వ్యాపారులు బుధవారం ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసుకుని వారినుంచి విముక్తి కల్పించేలా పోలీసులు చర్యలు తీసుకోవాలని కోరుతూ తీర్మానించారు. స్థానిక పెద్దబజారులోని వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో జరిగిన సమావేశంలో భిచ్చగాళ్లపై ఇకమీదట జాలి, దయ ఎవరూ చూపేదిలేదని వారిని భిక్షగాళ్లవలే చూడాలని తీర్మానించారు.